178

ఆగస్ట్ 1990

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

గరిమెళ్ళ సంస్మరణ

కె. వి. ఆర్.

కన్యాశుల్కం రస చర్చ

హరి

బాబ్రీ మసీదు - రామజన్మభూమి

ఎన్. వేణుగోపాల్

'అభివృద్ధి - వెలుగునీడలు' సమీక్ష

సర్వదారి, 'గౌతమ్' కవితలు

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

178 మాసపత్రిక ఆగస్ట్ 1990

ఈ సంచికలో....

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P. Hemalatha, Flat 11, Block 2, MIG II, Bagh Lingampalli, Hyderabad 500 044 and Printed at Nagendra Press, Vijayawada - 520 002

Working Editor : Vara Vara Rao

గెస్ట్ ఎడిటోరియల్

గరిమెళ్ళ సత్యనారాయణ సంస్మరణ :

కవిధీరుడు

పల్లవి : మాకొద్దీ తెల్లదొరతనము : దేవ
మాకొద్దీ తెల్లదొరతనము-

అనుపల్లవి : ప్రాణాలపై పొంచి-మానాలు హరియించె— మాకొద్దీ॥

40 చరణాలున్న ఈ పాటలో కరువు కాటకాల గురించీ, భూమిశిస్తు గురించీ, అబ్కారీ విధానం గురించీ, కోర్టు వ్యాజ్యాల గురించీ, పన్నుల భారం గురించీ, స్థానిక ప్రభుత్వ సంస్థల గురించీ, క్రూరశాసనాల గురించీ ప్రస్తావనలు ఉన్నాయి. చీరాల పేరాల సత్యాగ్రహం, జలియన్‌వాలాబాగ్ దురంతం, మోప్లా తిరుగుబాటు, జస్టిస్ పార్టీ పరిపాలన వంటి సమకాలిక ఘటనలు కూడా స్మరణకు వస్తాయి. ప్రజల నుద్దేశించి జైళ్ళు నింపమన్న పిలుపుంది. గాంధీ ప్రశంస వుంది. రాట్నగానం వుంది. ఆవేశ బలానికి తోడు విషయ సంపద వుందన్నమాట. అందుకే ఇది గొప్ప పాట కాగలిగింది. జనం నోటికి పట్టింది. అంతకనే ప్రభుత్వం ఉలికి పడింది.

గోదావరి జిల్లా కలెక్టరు బ్రాకెన్ స్వయంగా అడిగి మరీ కవిచేతనే పాట పాడించుకొని విన్నాక, భాష తెలియని తననే ఇంత ఉద్రిక్తుణ్ణి చేస్తే ప్రజలను మరేం చెయ్యలేదనుకొన్నాడట. ఇది వాడుకలోవున్న కథ.

మరోకథ కూడా వుంది. గాంధీగారు జాతీయోద్యమ శపులను సమావేశపరచి నప్పుడు, కేవలం పాట రాసి పాడినందుకు జైలుకు వెళ్ళవలసి వచ్చిందని గరిమెళ్ళ సత్యనారాయణ చెప్పితే నమ్మకం కలగక ఆ పాటపాడి వినిపించమన్నాడట. విన్నాక నమ్మకం కలిగిందట.

కాకినాడలో డిప్యూటీ మేజిస్ట్రేటు 9-2-1922న గరిమెళ్ళ సత్యనారాయణకు ఒక సంవత్సరం జైలుశిక్ష విధించింది మాత్రం కథకాదు. కడలూరు జైల్లో కాన్విక్ట్ నెంబరు 6742గా 'కఠిన' కారాగారవాస శిక్ష ననుభవించి తిరిగి వచ్చాడో లేదో, 'స్వరాజ్య గీతములు' పుస్తక నిషేధం, రాజద్రోహం కేసు, రెండేళ్ళ జైలుశిక్ష.

గరిమెళ్ళ సత్యనారాయణ రాజకీయ నాయకుడు కాదు. కనీసం సత్యాగ్రహి

కూడా కాదు. కేవలం జాతీయోద్యమ కవి, గాయకుడు కూడా. ఎన్నో పాటలు రాసినా ఒక్కటి మాత్రమే సుప్రసిద్ధమయింది. అందుకనే ఆయనమీద ప్రభుత్వం కక్ష బూనింది. మొదటిసారి జైలుకు వెళ్ళేముందు ఆయన ఆంధ్రులకిచ్చిన సందేశం (ది హిందూ, 1922 ఫిబ్రవరి 11) స్మరణీయమైనది :

Dear brothers and sisters – I have done my little work and am going to a comparatively long rest. The British buraucracy have determined to lull my pen and my voice for a period of 1 year. It pleased them to think that I am dangerous to the 'public tranquility' which means its own existance. ....I have given to the country what is best in me. My physical body is to be locked up but my soul I have left off into the country through literature. Let it be gathered, consolidated and worked out. It will work more than my frail body....

ప్రభుత్వంవారి నిషేధాజ్ఞలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అడ్డుకోవనికూడా చెప్పాడు. తాను జైలునుంచి తిరిగి వచ్చేనాటికల్లా దేశంలో 'స్వరాజ్యం' నెలకొంటుం దని వెర్రిగా నమ్మాడు. 'ఏడాది లోపలే స్వరాజ్యం' అంటూ గాంధీగారు అరచేతిలో వైకుంఠం చూపివున్నాడు గదా!

మద్రాసులో ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటు కోర్టులో 'స్వరాజ్య గీతములు' కేసు విచారణ జరిగింది. రాజద్రోహ నేరారోపణ చేశారు. నిందితుడు నేరం అంగీక రించాడు. పైగా, శిక్ష విధించినందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినందిస్తూ మేజి స్ట్రేటుకు వందనాలు చెప్పాడు. "ఇదియే బ్రిటిషు న్యాయపరిపాలనమునకు చరమ ఘంటావినాదమగును" అన్నాడు. పోలీసులు ఆయన మాటలను ఆపారు. తీసుకెళ్ళి పోయారు. అంతక్రితం తాను రాసుకొచ్చిన 'స్టేట్మెంటు'ను మేజిస్ట్రేటుకోర్టులో చదివి వినిపించనివ్వలేదు. అయినా పూర్తి పాఠం 'ఆంధ్రపత్రిక' (1922 జూలై 28) లో అచ్చుపడింది.

స్వాతంత్ర్యం కోసం ప్రభుత్వాన్ని ప్రతిఘటించక తప్పదంటూ, ప్రభుత్వం

తోటి సర్దుకుపోయి రాజీపడి లోబడేతత్వాన్ని తీవ్రంగా ఖండించాడు ! ఇట్టి సమాధాన భావమును పూర్తిగా ధిక్కరించుటయే అసహాయోద్యమ సిద్ధాంతము. బ్రిటిషు నిరంకుశత్వము వలన కలిగినట్టి నైచ్యస్థితికంటె అధమమగు మరియొక స్థితి మరే కారణము వలనను గూడ కలుగదుగాన నీ నిరంకుశత్వమును తొలగించుటకు దేశీయులెట్టి మహాత్యాగములైన చేసి తీరవలెనని యీ అసహాయోద్యమము ఖండితముగా నుడువుచున్నది."

అసహాయోద్యమం కేవలం భారతీయులకేగాక, ఆసియా ఖండవాసులకూ, అఖిల ప్రపంచవాసులకు గూడా మేలు చేస్తుందని గరిమెళ్ళ నమ్మాడు. గాంధీకంటె ఒక ఆకు ఎక్కువే చదివాడన్నమాట. వాషింగ్టన్‌లో, జెనీవాలో, హేగ్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశాలు విఫలమయ్యాయి కాబట్టి ప్రపంచ సమస్యల కన్నిటికీ అసహాయోద్యమమే పరిష్కారమన్నాడు.

"కార్మిక సమస్యను – ధనికులు పేదలనను సమస్యను – కొద్దిమంది ధనమునంతను సేకరించి దాని సహాయమున అధికారమును, పలుకుబడిని గడించుట- దాని సహాయమున వ్యక్తులను, జాతులను లోబరచుకొనుట – ఇందుల కిప్పటి రాజ్యములును సామ్రాజ్యములును నిదర్శనములు. వీటినన్నిటిని ఖద్దరు వలననే అసహాయోద్యమము పరిష్కరింపగలదు. వ్యక్తులను, జాతులను బానిసలుగ చేయుట వలన, దాస్యపాతకము వలన వక్రచేష్టితులగు ప్రజలు కలుగుచున్నారుగాన నిక మీదట నట్టి వ్యక్తి కి జాతి వశీకరణమే యుండగూడదు."

పెట్టుబడిదారీ విధానం గురించి, సామ్రాజ్యవాదం గురించీ గరిమెళ్ళ సత్యనారాయణకు ఈమాత్రపు అవగాహన అయినా వున్నందుకే సంతోషించాలి. అప్పటికిదే గొప్ప. సామ్రాజ్యవాద వ్యతిరేకత, నిర్దిష్టంగా బ్రిటిషు సామ్రాజ్యవాద వ్యతిరేకత తన ధర్మంగా ప్రకటించుకొన్నాడు :

"ఏ దేశమునైన పరిపాలించు ఏ విదేశీయ ప్రభుత్వమునకైనను ముఖ్యముగా హిందూదేశము నేలు విదేశ ప్రభుత్వమునకు నేను విరోధినని ప్రకటించుచున్నాను."

"....నేను వ్రాసిన విషయములనట్లు వ్రాయక యేమాత్రము తగ్గించి వ్రాసినను నేను నా అంతరాత్మకును, దేశమునకును, దేశీయులకును గూడ ద్రోహినగుదును.

దురదృష్టవశాత్తు ఈ బ్రిటిషు ప్రభుత్వమునందు సత్యము రాజద్రోహముగ పరిణమించి నది. సత్యమును పలుకుటయు, నా అభిప్రాయమును స్పష్టపరచుటయు....విధిని నెర వేర్పుడని నా దేశీయులకు బోధించుటయు రాజద్రోహమగునేని రాజద్రోహము నొనర్చితినని చెప్పగలిగినందు కెంతయు గర్వించుచున్నాను."

అప్పుడేకాదు, మరొకప్పుడైనా, ఇంత నిబ్బరంగా ప్రవర్తించగలిగినవారు ఎందరో వుండరు. ఒక పాటకోసం మొత్తంమీద మూడేళ్ళు జైలుశిక్ష ననుభవించి వచ్చిన ఈ కవిని అప్పట్లోనే లోకం మరిచిపోయింది. చిల్లర మల్లర పత్రికలలో పని చేస్తూ పొట్ట పోసుకోవలసి వచ్చింది. చివరకు మద్రాసు వీధుల్లో వచ్చేపోయేవాళ్ళ ముందు చేయి చాపవలసి వచ్చింది. చివరకు ఆరోగ్యం పాడై కనుచూపుపోయి శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట తాలూకాలోని స్వగ్రామానికి తిరిగి వెళ్ళవలసి వచ్చింది. దిక్కుమాలినచావు చావవలసి వచ్చింది. పుట్టెడు కష్టాల్లోగూడా గరిమెళ్ళ నీరుగారిపోలేదు సరిగదా, వేదాంత వైఖరిలో 'కొందరు కష్టపడడానికే పుడతారు' అని సమాధానపడుతూ వచ్చాడట. మొత్తానికి, బతకడం చేతగాని మనిషి.

'మాకొద్దీ తెల్లదొరతనము' తర్వాత ఎన్నో పాటలు రాసినా వాటిలో చెప్పుకో దగింది ఒక్కటే. వాహిని పత్రికలో అచ్చుపడిన

"అన్యాయ కాలంబు దాపురించిందిపుడు
అందరము మేలుకోవాలండి
మాన్యాలు భోగాలు మనుజులందరి కబ్బు
మార్గాలు వెదకాలి రారండి!"

డిప్రెషన్ రోజుల్లో తెలుగుదేశంలో ఒకవైపు రంగా, మరోవైపు కమ్యూని స్టులు రైతు సంఘాలు, కూలిసంఘాలు ఏర్పడుస్తూ వచ్చినప్పుడు, వర్గచైతన్య భావాలను ప్రకటించిన ఈ కవిత, గరిమెళ్ళ సత్యనారాయణ కవిగా ఏ దిక్కుకు మళ్ళిపోసాగాడో సూచిస్తుంది. అయితే, నిర్ధారణగా చెప్పటానికి ఇది ఒక్కటే సరిపోదు.

—కె. వి. ఆర్.

జీవితపదం

సర్వధారి

జీవిత పదం
పెదవిమీద పృథివిలా దొరలాలి
తనను తెలుపుతూ
సూర్యుడ్ని తెలుపుతున్నంత వివరంగా

జీవిత వాక్యం
పృథివిమీద ఆకాశంలా పరచుకోవాలి
ఏ కళ్ళు ఎక్కడ్నించి పరికించినా
కనిపించేంత విశాలంగా

జీవిత వృత్తం
నేలను పాదుగాజేసి సముద్రాన్ని చుట్టాలి
ఏ చుక్క ఎక్కడ్నించి రాలినా
తనలో యిముడ్చుకోవాలన్నంత ఆకాంక్షగా

పదమో వాక్యమో వృత్తమో
ఏమైనా
అది అక్షరమాత్రమైనా సరే
అది జీవితమైతే మాత్రం
అది వుండాల్సింది
పసిగుడ్డు ఏడుపు
పాలకోసమో జోలకోసమో
తల్లికి తెల్సినంత స్పష్టంగా........

"అదృశ్యం...."

'గౌతమ్'

నిన్న చెక్కిలిని ముద్దాడిన పెదాలు
ఇవాళ నెత్తురోడుతున్నాయి —
నిన్న చాలనం చేసిన కరాలు

ఇవాళ కన్నీటి దోసిళ్ళవుతున్నాయి —
నిన్న అగ్గి ముట్టించిన నేత్రాలలో
ఇవాళ హృదయాలు ముక్కలవుతున్నాయి —
నిన్న జలపాతాన్ని ధ్వనించిన నాలుక
ఇవాళ తెగిపడిన జ్వాలాతోరణం అవుతున్నది

పెదాల పైన చిరునవ్వు ఆకస్మాత్తుగా మాయమవచ్చు
కాని ఈ వేళ నవ్వుతున్న పెదాలే అదృశ్యమైపోయాయి —
నీకు తెల్సా ?
నీ భుజంపైన చెయివేసి నడుస్తున్న నీ మిత్రుడు
హఠాత్తుగా మాయమైపోతాడు —
తేరుకోని నీ కళ్ళని ఖాకీ దుమ్ము కప్పేస్తుంది
యిక నీ కళ్ళు - పెదాలు దేనికీ సాక్ష్యం కాదు

నువు పాట విని కోయిలను చూడాలనుకుంటావు
కాని కోయిల లేదు మిత్రమా !

ఆకాశం పగలలేదు
భూమి చీలలేదు
వేటగాడి బాణం గుండెని కోయలేదు

కాని కోయిల లేదు

ఎగిరిన చోటల్లా చిగురులు తొడిగించి
కూసిన చోటల్లా వసంతాన్ని పూయించిన
కోయిల జాడ తెలియదు తెలియదు —

నీ గతితోనో మరో గుండెతోనో నువు
ఒంటరితనాన్ని పంచుకునేటప్పుడు
జాడ తెలియని కోయిల పాడుతుంది
అప్పుడు
నెత్తురోడుతున్న పెదాల మీద
సూర్యోదయం అవుతుంది —

కన్నీటి దోసిళ్ళయిన కరాలలో
కత్తులు మొలకెత్తుతాయి —
ముక్కలవుతున్న హృదయాలు
వెన్నాడే నేత్రాల జ్ఞాపకాలవుతాయి —
అప్పుడే
తెగిపడిన జ్వాలాతోరణం
జలపాతాన్ని ధ్వనిస్తుంది

ఏ ఊరయినా...

నరుడో భాస్కరుడు

మీ వూరు అయినా - మా వూరు అయినా
మదనపల్లి - తిప్పాపూర్
లేదా మరొకటి - పేరేది ఐతేనేం
రాబందులు రెక్కలు విప్పడానికి
అడవుల్లో - తుప్పల్లో - కొండల్లో కాదు
ఇల్లు - ఇల్లు గాలించి
పడకటింట్లోనో - పశువుల కొట్టంలోనో
ఎవడి ఇంట్లో వాడినే ఎన్‌కౌంటర్ చేసే వ్యూహం
ఎస్పీదైతేనేం - ఏలినవారిదైతేనేం
ఎండుడొక్కలపై కవాతు చేస్తూ
బాంబు వేయబోయాడనో
గొడ్డలితో తిరగబడిందనో
ఏడుగురివో ఎందరివో ప్రాణాలు తీసి
వాళ్ళ వల్లకాదు చేస్తేనేకదా
వాడి విధానంలో స్పష్టత ఎంతో తెలిసేది
మీ వూళ్ళో ఐనా - మా వూళ్ళో ఐనా
దుక్కలైనవాళ్ళకి స్థూపం కడితేను

చట్టబద్ధంగా సభ పెడుతుంటేనూ
అభ్యంతరం లేదన్నాడంటే
జనం బీళ్ళు దున్నుతున్నంత అదనుగా
వాళ్ళను బాయెనెట్లతో దున్ని
ప్రజాస్వామ్య ఎన్‌కౌంటర్ల
వ్యవసాయం చేయడమని అర్థం.
వ్యవస్థ హైనాల్ని పోషిస్తే
తల్లుల ముందే అవి పిల్లల్ని తింటాయి
రాజ్యాంగం దొరవాడి ఇంట్లో
కావలికుక్క అయింతరువాత
మన వాళ్ళనీ్న మదనపల్లి - తిప్పాపూర్లే అవుతాయి
చచ్చినవాళ్ళ చేతుల్లో వాడు
ఆయుధాలు పెట్టినంత సులభంగా
మన చేతిలోకి అవి రాకపోవచ్చుగానీ
ప్రజలు తాము పంచాయితీమై
తమ కడుపుకోత తీర్పు అయింతరువాత
ఎంతకాలమని తుపాకులు హైనాల్ని రక్షిస్తాయి
వాడి పాఠాన్ని నేర్చుకునే క్రమంలోనే
గుణపాఠం చెప్పాలి మనం

అమరస్మృతి

గోదారి కోయిల

అడివిలోనా.... అన్నలు అహో....అడివి తల్లీ....గుండెలు అహో
అడివిలోనా అన్నలు అహో
అడవితల్లీ గుండెలు అహో
అల్లిబిల్లిగా అడివంత లెక్క
అల్లుకున్న ఆకు తీవెలురహో

ఆకాశాన రివ్వున ఎగిరే
రంగూ రంగుల గువ్వల్లాగ
గుమ్ముగుమ్ముల కొండలమీద
గంతూలేసిన జింకల్లాగ
జంగాల తోట రేవిల కోటల్లో
నాట్యాలాడిన నెమిలీలాగ
ఎదురుబడితె నిలబడి కలబడు
కొదమ సింగాలు సిందూగలాగ
పారుతున్న ఏలేరు మీదా
పడి పడి లేచిన కెరటంలాగ
ఆడివంత లెక్క ఆల్లిబిల్లిగ
అల్లుకున్న ఆకు తీవెలు రహో
॥అడివ॥

కొండదొరలా వాల్మీకులు
కోదులు కొరజలు కొండారెడ్లూ
రాగులు సాంబలు గంట్లూ బుడమలు
జొన్నల, కొర్రల, జావలు జుర్రీ
ఈరేడు, బండారు, శిల్పర, గుమ్మడి
ఇరుగుడ చేవా - చెట్లను గొట్టి
మంచిగంధం ఎర్రచందనం
మద్దిటేకు మానులు నరికి
అడివిలోన నరికిన చెట్లనూ
వరదల నడిలో ఒడ్డుకు దెచ్చి
రాజమండ్రిలో రంగుల మేడలో
చిత్రాల చిత్రాకి చిత్తరువులైన
చెలమల్లోన కొండన్నతోటి
చెలిమి జేసిన అన్నలు రహో
॥అడివ॥

కొండ్రాజుల పండుగనాడూ
కొండలు కొండలు సోపిడిజేసి
కొండ గొర్రెలు, అడిం పందులా
కణుజు కుందేలు మాంసాలు వండి
నల్లనేరేడు అల్ల నేరేడూ
గున్నమావిడి గుత్తులు దెచ్చి
వేరుపనసా పళ్ళను దెచ్చి
వెదురు బియ్యం వక్లాలు వండి
దోరచింతలా బుట్టలు దెచ్చి
పట్టుతేనెలా పుట్టలు బెడితే
వాళ్ల కొండదేముళ్లై కొలువు దీర
కొండజాతులా జాతరలహో
॥అడివ॥

అందమైనా అడివిలోనా
ఆకు కొమ్మా రెమ్మల్లోనా
చాలోసినట్టూ చక్కాని చిక్కాని
చల్లాని సింతల తోపుల మీన
జాబిల్లి నుండి జలజలా ఉరికిన
సార్లంక జలపాత సీమల్లోన
వెదురు కూపులా వనముల మీదా
విరగబూసినా వెన్నెల్లోనా
ఆలికోసం ఓలిదెచ్చినా
అడివి జాతులా పెళ్ళిళ్లోనా
జాముదేతిరి జాగరానా
జతలు గట్టినా జంటలు రహో
॥అడివ॥

సూరీడు కుంకని రాజ్యాలు ఏలిన
తెల్ల దొరలా పాలన మీదా
తెల్ల జాతీ జంతువుల మీదా
కొండ జాతులను కూడగట్టినా
కొమ్ముల నాగుల కొండల మీదా
వింటి బద్దలు ఎక్కుబెట్టినా

ఏరు పిదకల ఎండపుడకలా
చిచ్చులో ఉచ్చుల ఉరదాడులేసి
తాడు వాయీ లోయల్లోకి
తరుము వచ్చి తిప్పికొట్టినా
అల్లూరి సీతా రామ రాజుకూ
అచ్చూ అళ్ళూ తమ్ములు అహో
॥అడివ॥

అడ్డ తీవెల అధికారి వారిని
అడివిలోకి తీసుకు వచ్చి
పల్లెసీమలో పెద్దకాపులూ
కొండ కాపులై పోతుండేని
కొండల నంటిన కొండకాపులూ
పాలికాపులైన పైనం జెప్పి
జీడిపవ్వల ఉప్పాలు బెట్టి
జీడి యీ బలీ బ్రతుకులు జెప్పి
జీంగ కల్లా గీసి నంపుకూ
జెళ్ళల్లో గొట్టిన తీరూ జెప్పి
అం రిషైతే అమ్మొమ్మని
వణ్ణం బెట్టిన అన్నలు రహో
॥అడివ॥

కొకులు దూని కారడవి నంతా
దోచుకు తిన్నా కలప దొంగలూ
అన్నెంలోనా మాన్యాలు మింగి
కాకీ మూకల తండాలు దింప
మన్నెం మిన్నా మానగడలేనీ
అన్నెం పున్నెం ఎరుగని వాణ్ణీ

కొండపోడినీ - కొండపోళ్ళనూ
కొరివి దెయ్యాలై కోసుకుడింటే
అడివన్నాలా జాడలేవనీ
గుడిసెల గూడాలు మంటలు బెడితే
మతపరించినా మూకల మీదా
మండపాతర్ల యుద్ధాలు జేసి
వెదురు వనములో మాటు గాసిన
వేటగాని వింటి అలుగులహో
॥అడివ॥

గుత్తేడు కొండల కోనకొచ్చినా
కలకి పేర్లను ఎత్తుకువచ్చి
అడివి జాతులా దోపిడి జెప్పి
మన్నెం వీరుల గాథలు జెప్పి
కాకీ మూకలు కాల్చి సంపినా
ఎదురు కాల్పుల కల్పనజెప్పి
వెదురు గుబురులో సిగురులేసిన
గోదారి పోరాట గీతాలు పాడి
పొగరుబోయినా పోలీసు దొరలా
జోడు గుర్రాల దౌడు దీయించి
చెరసాల బెట్టిన చిన్నారి అన్నల
చేతబట్టుకొని తీసుకొచ్చిన
రైతుల కూలీ రాజ్యాల కోసం
చీమూ నెత్తురు చెల్లి రాసిన
రణం జేసిన పిడుగులు రహో
ధాడికల్లా పిల్లలురహో

సోపిడి : వేట
కొండ్రాజు : కొండ+రాజు
= కొండకు రాజు
= కొండ దేముడు

ప్రతీ రెండవపాదం కోరస్ రావాలి.

బాబ్రీ మసీదు - రామ జన్మభూమి

ఎన్. వేణుగోపాల్

"మత విచారం ఒకే సమయంలో నిజమైన విచారానికి వ్యక్తీకరణగానూ, నిజమైన విచారంపట్ల నిరసనగానూ ఉంటుంది. మతం అణచివేతకు గురయిన జీవి నిట్టూర్పు. హృదయం లేని ప్రపంచానికి హృదయం. ఆత్మలేని పరిస్థితుల ఆత్మ. అది ప్రజల పాలిటి మత్తుమందు. ప్రజల భ్రమా జనిత ఆనందంగా ఉన్న మతాన్ని రద్దు చెయ్యడమంటే వారి నిజమైన ఆనందాన్ని ఆకాంక్షించడమే. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితుల గురించి భ్రమలను వదిలెయ్యమని కోరడమంటే భ్రమలు అవసరమైన పరిస్థితులను వదిలెయ్యమని కోరడమే. అందువల్ల మతంమీద చేసే విమర్శ బీజరూపంలో కన్నీటి లోయపైన విమర్శే. మతం ఆ కన్నీటి లోయపైన కాంతి కిరీటంలా ఉన్నది.... సత్యానికి అతీతమైన ప్రపంచం అదృశ్యమైన వెంటనే ప్రాపంచిక సత్యాన్ని స్థాపించడం చరిత్ర కర్తవ్యం. మానవ స్వీయపరాయీకరణ ధరించిన పవిత్ర రూపం బట్టబయలు కాగానే చరిత్రకు సేవ చేసే తత్వ శాస్త్రపు తక్షణ కర్తవ్యమేమంటే, అపవిత్ర రూపాలలో ఉన్న స్వీయ పరాయీకరణను బట్టబయలు చేయడం. అట్లా దైవలోకం మీద విమర్శ భూమి మీద విమర్శగా మారుతుంది. మతం మీద విమర్శ చట్టం మీద విమర్శగా మారుతుంది. మతవాదం మీద విమర్శ రాజకీయాలమీద విమర్శగా మారుతుంది." — మార్క్స్

బాబ్రీ మసీదు - రామ జన్మభూమి వివాదం వంద సంవత్సరాలుగా సాగుతున్నప్పటికీ గత ఐదు సంవత్సరాలుగా తీవ్రరూపం దాల్చింది. హిందూ మతోన్మాదం, కాంగ్రెస్ (ఐ), భారతీయ జనతా పార్టీ, జనతాదళ్ పార్టీల ఎన్నికల అవకాశవాద రాజకీయాలు ఈ వివాదానికి ఆజ్యం పోస్తున్నాయి. ముస్లిం రాజకీయవేత్తల స్వార్థపర ఎత్తుగడలు, ఉదార ప్రజాస్వామిక వాదుల నిర్లిప్త, అస్పష్ట వైఖరి ఈ వివాదం రగుల్కొనడానికి తోడ్పడుతున్నాయి.

ఇట్లా వివాదంలో భాగస్తులైన అన్ని పక్షాలూ వివాదాన్ని పెంచి పోషించడానికే ప్రయత్నిస్తుండగా ఉత్తర భారతమంతా ఈ వివాదంతో మతకల్లోలాల నిలయమవుతోంది. దేశంలోని రెండు ప్రధాన మత వర్గాలయిన హిందువులకూ, ముస్లింలకూ మధ్య శత్రుత్వాన్ని సృష్టించడానికి, పెంచడానికి హిందూ, ముస్లిం మత సంస్థలు చేస్తూ వస్తున్న ప్రయత్నాలు ఈ వివాదంతో కొంతవరకు సఫలమవుతున్నాయి.

1947లో ఉత్తర భారతమంతటా మత కల్లోలాలు, హింసాకాండ చెలరేగినప్పుడు ప్రశాంతంగా ఉండిపోయిన ఫైజాబాద్ (అయోధ్య నుంచి 8 కి.మీ.)లో ఈ నలభై ఏళ్ళుగా 60 శాతం హిందువులు, 40 శాతం ముస్లింలు సహజీవనం సాగిస్తున్నారు. బాబ్రీ మసీదు - రామ జన్మభూమి వివాదంతో చెలరేగిన విద్వేష జ్వాలలు ఫైజాబాద్‌కు కూడ అంటుకుని గత అక్టోబర్‌లో ఇద్దరు ముస్లింల హత్యకూ, ఎనిమిది రోజుల కర్ఫ్యూకు దారి తీశాయి. ఉత్తర భారతంలో మరెన్నో చోట్ల మతకల్లోలాలకు ఈ వివాదం కారణమైంది. భాగల్‌పూర్, బదౌన్, కోట, మీరట్, వారణాసి వంటి ఎన్నో చోట్ల హింసాకాండ చెలరేగింది. 1984 తర్వాత సాధారణంగానూ, 1989 నుంచి ప్రత్యేకంగానూ దేశంలో అనేక మతకల్లోలాలలో రామ జన్మభూమి వివాదమే ప్రత్యక్ష ప్రేరణగా పని చేసింది.

రాముడి పేరిట రక్తహోళి జరుగుతున్న ఈ నేపథ్యంలో బాబ్రీ మసీదు - రామ జన్మభూమి వివాదాన్ని పరిశీలించాలి. ఇప్పటికే వందలాది మందిని బలిగొన్న, వేలాది మందిని నిరాశ్రితులను చేసిన ఈ వివాదం ఎటువంటి తప్పుడు చారిత్రక వ్యాఖ్యానాలమీద, రాజకీయ ఎత్తుగడల మీద, హింసా దౌర్జన్యాల మీద ఆధారపడి ఉందో తెలుసుకోవాలి.

శ్రీరామచంద్రుడు త్రేతాయుగంలో అయోధ్య రాజధానిగా కోసల రాజ్యాన్ని పాలించాడని వాల్మీకి రాసిన రామాయణ కావ్యం చెపుతోంది. అయోధ్య నగరంలో దశరథుని రాజ భవనాలలో కనక భవనంలో శ్రీరాముడు జన్మించాడని రామాయణం చెపుతోంది. పౌరాణిక కాలక్రమం ప్రకారం త్రేతాయుగం, ద్వాపర యుగం గడిచి పోయి, కలియుగం ప్రారంభమై ఐదువేల సంవత్సరాలు గడిచాయి. కలియుగం ప్రారంభమైన తర్వాత 2431 సంవత్సరంలో ఉజ్జయిని పాలకుడైన విక్రమాదిత్యుడు శ్రీరాముని జీవితానికి సంబంధించిన స్థలాలలో 360 ఆలయాలు నిర్మించాడనీ, వాటిలో రామ జన్మ స్థానం కూడ ఒకటనీ స్థానిక కథనాలుండేవని విశ్వహిందూ పరిషత్ అంటోంది. ఈ విక్రమాదిత్యుడు క్రీ.శ. ఐదో శతాబ్దానికి చెందిన చంద్ర గుప్త విక్రమాదిత్యుడు కావచ్చునని అలెగ్జాండర్ కనింగ్‌హామ్ రాశాడు. కాని పురావస్తు ఆధారాల ప్రకారం ఈ విక్రమాదిత్యుడు క్రీ.పూ. మొదటి శతాబ్దానికి చెందినవాడని చెప్పవచ్చునని విశ్వహిందూ పరిషత్ అంటుంది. ఈ ఆలయాన్ని ధ్వంసం చేసి క్రీ.శ. 1528లో మొఘల్ పాలకుడు బాబర్ ఆదేశం మేరకు మసీదును నిర్మిం

చాలని, హిందువుల పవిత్ర స్థలంపైన జరిగిన ఈ పాపకార్యాన్ని ఇప్పటికైనా సవరించాలని విశ్వహిందూ పరిషత్ వాదిస్తోంది. 1949 డిసెంబర్ 23 ఉదయానికల్లా ఈ మసీదులో సీతారాముల విగ్రహాలు వెలిశాయని, అందువల్ల ఆ మసీదును కూల్చివేసి, అక్కడే రామజన్మభూమి ఆలయం నిర్మిస్తామని విశ్వహిందూ పరిషత్ అంటోంది.

విశ్వహిందూ పరిషత్ చెపుతున్న చరిత్ర కొంత పుక్కిటి పురాణం, కొంత దుర్వ్యాఖ్యానం. అది సూచిస్తున్న పరిష్కారం మత దురహంకారాన్ని రెచ్చగొట్టి, మత విద్వేషాన్ని రగిల్చి, హింసాకాండకు దారితీసేదే. నిజమైన సమస్యల నుంచి ప్రజల్ని పక్కదారి పట్టించడం, ప్రజలలో తప్పుడు చైతన్యాన్ని ప్రేరేపించి దాన్ని వోట్లుగా మార్చుకోవడం విశ్వహిందూ పరిషత్ లక్ష్యాలు. అందువల్ల అంతిమ పరిశీలనలో విశ్వహిందూ పరిషత్ వాదనకు పునాదిగా ఉన్నది కుటిల రాజకీయాలే తప్ప రామభక్తి కాదు, ప్రజల ప్రయోజనాలూ కావు.

శ్రీరాముని గురించి మొట్టమొదటిసారిగా ప్రస్తావించినది 'రామకథ' అనే గాథ. దీని గురించిన వివరాలే తప్ప ఈ గాథ ఇప్పుడు లభ్యం కావడంలేదు. ఈ గాథనుంచి రాముని జీవితాన్ని కథగా తీసుకుని వాల్మీకి సంస్కృతంలో రామాయణ కావ్యాన్ని రాశాడు. ఇది కావ్యం గనుక ఇందులో స్థల కాలాలు, పాత్రలు కల్పితమైనవెన్నో ఉన్నాయి. అసలు దక్షిణాసియా, ఆగ్నేయాసియాల్లో అనేక భాషల్లో రామాయణ కావ్యాలు వెలువడ్డాయి. వాటిలో సీతారాముల సంబంధం దగ్గరినుంచి స్థలకాలాల వరకు ఎన్నో తేడాలున్నాయి. ఈ అన్నిటిలోకి వాల్మీకి రామాయణమే ప్రామాణికమనుకున్నా, ఆ సాహిత్య రూపానికి పురావస్తు ఆధారాలు సరిపోయినప్పుడే ఆయా స్థల కాలాలు, పాత్రలు చారిత్రకమైనవవుతాయి.

రామజన్మభూమి అనేక సంవత్సరాలుగా వివాదాస్పదంగా ఉన్నది గనుక ఈ ప్రాంతంలో విస్తృతంగానే తవ్వకాలు జరిగాయి. ఈ తవ్వకాల ఫలితంగా అయోధ్య నగరం గురించిన చారిత్రక అంశాలు వెలికివచ్చాయి. అయోధ్యలో క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దానికి ముందు మానవ నివాసం ఉన్నదనడానికి తగిన పురావస్తు ఆధారాలేమీ లేవు. ఆ ప్రాంతంలో దొరికిన తొలి మానవ ఆవాసాలయినా బ్రహ్మాండమైన రాజభవనాల శిథిలాలు కావు.

అసలు అయోధ్య నగర స్థలం గురించి కూడ నిస్సందేహమయిన చారిత్రక

ఆధారాలు లేవు. క్రీ.పూ. తొమ్మిదో శతాబ్దం నుంచి ఆరో శతాబ్దం మధ్యభాగంలో వాయవ్య ప్రాంతం నుంచి, దో ఆబ్ ప్రాంతంనుంచి తూర్పు దిశగా చొచ్చుకువచ్చిన ఆర్యులు కోసల రాజ్యాన్ని, వారాణసి ప్రాంతంలో కాశీ రాజ్యాన్ని స్థాపించారు. క్రమక్రమంగా కోసల రాజ్యం సమకాలీన రాజ్యాలలో బలోపేతమైనదిగా రూపొం దింది. కోసల రాజ్యంలో శ్రావస్తి, సాకేత నగరాలే పెద్ద నగరాలుగా ఇతర ఆధారాలు చూపుతున్నాయి. అసలు 'అయోధ్య' అంటే 'జయించడానికి వీలులేనిది' అనే అర్థం వున్నది గనుక ఈ నగరాలలోనే ఒకదాన్ని అయోధ్య అని ఉంటారనీ ఊహించవచ్చు. మహాభారతంలో 'దాశరథిపురి' అని వర్ణించినదీ, ఫాహియెన్ షాచి అని వర్ణించిన సాకేత, యువాన్‌చ్వాంగ్ విశాఖ అని వర్ణించిన విశాఖ కూడ అయోధ్యకు పర్యాయపదాలేనని విశ్వహిందూ పరిషత్ వ్యాఖ్యాతలు అంటున్నారు. క్రీ.శ. ఐదవ శతాబ్దంలో స్కందగుప్తుడు సాకేతను రాజధానిగా చేసుకుని దానికి అయోధ్య అని పేరు పెట్టాడని ఆధారాలున్నాయి.

కనుక రాముడు చారిత్రక వ్యక్తి అవునా కాదా, అయితే ఆయన జన్మించిన అయోధ్య ప్రస్తుత అయోధ్యేనా, ఒకవేళ అయోధ్య అదే అయినా ఆయన జన్మస్థలం ప్రస్తుత బాబ్రీమసీదేనా అనే ప్రశ్నలకు సందేహాతీతమయిన జవాబులు లేవు. ఈ వివాదంతో సంబంధం లేకుండానే, ప్రాచీన భారత చరిత్ర గురించి అధ్యయనం చేసిన ఎ.ఎల్. బాషామ్ మాటల్లో చెప్పాలంటే "హిందువు కానివారికి ఆయన (రాముడి) కథ మతానికి సంబంధించిన విషయంగాకాక సాహిత్యానికి సంబంధించిన విషయంగా ఉంటుంది....రాముడు క్రీ.పూ. ఎనిమిదో శతాబ్దంలోనో, ఏడో శతాబ్దంలోనో జీవించిన ఒక స్థానిక పాలకుడై ఉంటాడు. ఆయన కథ తొలి రూపాల్లో ఆయనకు దైవ లక్షణాలేమీ లేవు. ఆయనను కృష్ణుడికన్న తొలి అవతారంగా భావిస్తున్నప్పటికీ, రామపూజ మాత్రం కృష్ణపూజకన్న ఆలస్యంగానే ప్రారంభమైంది. రామపూజ ముస్లిం దండయాత్రల తర్వాతనే ప్రాముఖ్యతను సంతరించుకున్నదనేది ప్రధానమైన విషయం".

"తర్వాత కాలంలో ఎంతో ప్రముఖుడైన రాముణ్ణీ, అతని తండ్రి దశరథుణ్ణీ సమకాలీన సాహిత్య ఆధారాలు పూర్తిగా విస్మరించాయి. అంటే, ఇతరులతో పోల్చి చూసినప్పుడు వాళ్ళిద్దరూ అప్రధానమైన ప్రభువులని నిర్ధారించవచ్చు. వాళ్ళ వీర కృత్యాలు యాదృచ్ఛికంగా జ్ఞాపకం ఉండిపోయాయి. తదనంతర కాలపు వాగ్గేయ

కారులు ఆ వీరకృత్యాలను పెంచారు, విస్తరింపజేశారు. చివరకు క్రీస్తుశకం ప్రారంభంలో ఈ గాథలు అంతిమ రూపం పొందాయి. రాముడు కోసల రాజు అవునా కాదా అనే విషయం కూడ కచ్చితంగా తెలియదు. ఎందువల్లనంటే మనకు లభిస్తున్న తొలి గాథా రూపంలో రాముడిని వారాణసి పాలకుడిగా చెప్పారు. వారాణసి కొంతకాలం పాటు ప్రముఖ రాజ్యంగా ఉండేది. కాని క్రీ.పూ. ఆరో శతాబ్దానికల్లా వారాణసి రాజ్యాన్ని కోసల రాజ్యం జయించింది."

బాషామ్ చెప్పినట్టుగానే రామపూజ 13వ శతాబ్ది తర్వాత విస్తృతమయింది. "రామనంది" అనే పేరుతో రామపూజను ప్రచారంచేసే ఒక భక్తబృందం ఏర్పడి హిందీ భాషా ప్రాంతాలలో వ్యాపించింది. 'రామనందీ'లు 18వ శతాబ్దం తర్వాత అయోధ్యలో స్థిరపడడం ప్రారంభించారు. క్రమక్రమంగా అయోధ్యలో రామాలయాల నిర్మాణం ప్రారంభమైంది. "ఈ దేశంలో పాండవులు ఉందని గుహలా, సీతమ్మ వారు స్నానమాడని గుంటలా లేవు" అని గురజాడ ఎప్పుడో రాసినట్టు అయోధ్యలో కూడ ప్రతి ఆలయాన్నీ రాముకి జీవితంతో ముడివేసి చూపే ప్రయత్నం ప్రారంభమైంది. ఒకవైపు విశ్వహిందూ పరిషత్ బాబ్రీమసీదే రామజన్మభూమి అని దేశ వ్యాప్త కల్లోలం రేపుతుండగా, మరోవైపు ఇప్పటికీ అయోధ్యలోని కనీసం 15, 16 ఆలయాల పూజారులు నిజంగా తమ తమ ఆలయాలే రామ జన్మస్థలమని చెప్పుకుంటున్నారు!

ఇంతకూ ఈ రామజన్మభూమి వివాదంలోకి బాబ్రీమసీదును ఎందుకు, ఎట్లా తీసుకువచ్చారు? బాబ్రీ మసీదుపైన ఉన్న శిలాఫలకంలో "బాబర్ చక్రవర్తి ఆజ్ఞ ప్రకారం మీర్ బాఖీ ఈ కట్టడాన్ని నిర్మించాడు" అని రాసి వుంది. ఈ శిలాఫలకం మీది భాషగాని, లిపిగాని సరైన పర్షియన్ కాదని, కనుక ఈ ఫలకం కూడ బాబర్ కాలానిదయి వుండదని పర్షియన్ పండితులు అంటున్నారు. అది నిజంగా బాబర్ కాలానిదయినా కాకపోయినా, ఆ మసీదుకు ఉన్న కొన్ని స్తంభాలమీద హైందవ శిల్పం ఉన్నదని, మొఘల్ పాలకులు ముస్లింలు గనుక, ముస్లింలలో ఇతర మతాల ఆలయాలను ధ్వంసంచేసే సాంప్రదాయం ఉన్నది గనుక, ఆ మసీదును కూడ ఏదో ఒక ఆలయాన్ని కూల్చి నిర్మించి ఉంటారని విశ్వహిందూ పరిషత్ వాదిస్తోంది. ఆ 'ఏదో ఒక' ఆలయం కూడ కచ్చితంగా రామజన్మస్థలమేనని విశ్వహిందూ పరిషత్ అంటోంది.

అయితే ఈ అనుమాన బీజాన్ని సృష్టించి, పెంచి పోషించినవాళ్ళు బ్రిటిషు అధికారులు, చరిత్రకారులు. విశ్వహిందూ పరిషత్ వాదనను సమర్ధించే డా. ఎస్.పి. గుప్తా కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తూ "వాస్తవానికి, భారత పాలకులుగా బ్రిటిషువాళ్ళు రావడానికి ముందు రాసిన ఏ సాహిత్యాధారంలోను ఆ స్థలంలో ఆలయాన్ని కూలగొట్టారనే ప్రస్తావన లేదు" అని రాశాడు. ('రామజన్మభూమి కాంట్రవర్సీ : వాట్ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ సే?' ఆర్గనైజర్, రిపబ్లిక్ డే స్పెషల్ 1990).

జహీరుద్దీన్ బాబర్ 1526 ఏప్రిల్ 21న పానిపట్ యుద్ధంలోను, 1527 మార్చి 17న ఖానువా యుద్ధంలోను గెలుపొంది ఢిల్లీ సామ్రాజ్యం లోతట్టు ప్రాంతాలకు ప్రయాణించాడు. ఈ క్రమంలో బాబర్‌ను రాజపుత్రులు, పఠాన్‌లు ఎదుర్కొన్నారు. పఠాన్‌లమీద దండయాత్ర చేసే మార్గంలో 1528 మార్చ్ ప్రాంతంలో బాబర్ సరయూ తీరాన బస చేశాడని, అంటే అయోధ్య నగరాన్ని చూశాడని ఒక అస్పష్ట ఆధారం ఉంది. బాబర్ తన దండయాత్రా స్మృతులను 'తాజుక్-ఇ-బాబ్రీ' పేరిట తుర్కీలో గ్రంథస్తం చేశాడు. ఈ స్మృతులను రెండుసార్లు పర్షియన్‌లోకి అనువదించారు. ఒక పర్షియన్ అనువాదం ఆధారంగా బ్రిటిషు చరిత్రకారుడు జాన్ లీడెన్ 1813లో ఇంగ్లీషు అనువాదాన్ని ప్రచురించాడు. బాబర్ అయోధ్య మీదుగా వెళ్ళి ఉంటాడని లీడెన్ ఊహ చేశాడు. లీడెన్ ఊహ ఇక్కడితో ఆగిపోయినప్పటికీ, తదనంతర కాలపు బ్రిటిషు చరిత్రకారులు ఈ ఊహను మరింత ముందుకు తీసుకుపోయారు.

ఇక్కడ గుర్తించవలసిన చారిత్రక వాస్తవాలు కొన్ని ఉన్నాయి. బాబర్ అయోధ్య ప్రాంతానికి వచ్చినది హిందువులమీద దాడికి కాదు. ఆయన అప్పుడు హిందువులమీద ఆధారపడి పఠాన్‌లమీద దండయాత్రలు జరిపాడు. అంతకుముందు, ఆ తర్వాత అయోధ్య ప్రాంతం మొత్తంమీద అయిదు శతాబ్దాలపాటు ముస్లిం ప్రభావంలో ఉంది. 1856లో బ్రిటిషు పాలకులు అయోధ్య రాజు వాజిద్ అలీషాను అక్రమంగా కూలదోసి తమ రాజ్యం స్థాపించారు. యీ స్థితిలో అయోధ్య ప్రజలలో చీలికలు సృష్టించడం బ్రిటిషు పాలకులకు అవసరమైంది.

ఈ నేపథ్యంలోనే 1861లో బ్రిటిష్ ప్రభుత్వ అఫిషియేటింగ్ కమీషనర్,

సెటిల్‌మెంట్ ఆఫీసర్ పి. కార్నెగీ రాసిన 'ఎ హిస్టారికల్ స్కెచ్ ఆఫ్ ఫైజాబాద్ తహసిల్' వెలువడింది. ఆ పుస్తకంలో ఆయన "స్థానికంగా తెలుస్తోంది" అనే మాటతోనూ, తన ఊహలతోనూ కొన్ని నిర్ధారణలు చేశాడు. "అయోధ్యలో జన్మస్థానంలో కనీసం ఒక మంచి ఆలయం ఉండి ఉంటుంది...." అనీ "1528లో బాబర్ అయోధ్యను సందర్శించాడనీ, ఆయన ఆజ్ఞానుసారం ఆ ప్రాచీన ఆలయం ధ్వంసం చేయబడిందనీ అనిపిస్తుంది" అనీ రాశాడు. ఈ ఆధారాలే ఆ తర్వాత ఎచ్. ఆర్. నెవిల్ రాసిన 'ఫైజాబాద్ డిస్ట్రిక్ట్ గెజెటీర్'లోకి ఎక్కాయి.

అన్నిటికన్నా ముఖ్యమైన, ప్రమాదకరమైన, ఇప్పుడు ఎక్కువగా ప్రచారంలో ఉన్న ఆధారం 1922లో వచ్చింది. ఎ ఎస్ బివరిడ్జ్ బాబ్రీ నామాను తుర్కీ నుంచి ఇంగ్లీషులోకి అనువదించి, తాను కొన్ని పాదసూచికలు చేర్చి ప్రచురించింది. ఆ పాద సూచికల్లో ఆమె మసీదు నిర్మించాలనే ఆదేశాన్ని బాబర్ ఇచ్చి ఉంటాడని ఊహించింది. మహమ్మద్ ప్రవక్త ఇతర మతాల్ని సహించేవాడు కాదనీ, ప్రవక్త శిష్యుడుగా బాబర్ "ఆలయాన్ని మసీదుగా మార్చడం విధ్యుక్త ధర్మంగా భావించి ఉంటాడ"నీ బివరిడ్జ్ రాసింది.

ఆలయాలను పడగొట్టి మసీదులు నిర్మించడం అసహజమూ, అసాధారణమూ ఏమీ కాదు. నిజంగా రామ జన్మస్థాన ఆలయాన్ని పడగొట్టి మసీదు నిర్మించి ఉంటే బాబర్‌గాని, మరెవరయినా గాని ఆ విషయాన్ని గర్వంగా చెప్పుకుని ఉండే వారనడంలో కూడ సందేహం లేదు.

అసలు భారతదేశంలో ప్రతి మత సాంప్రదాయానికీ తనకంటె ముందున్న మత ఆలయాలను, ప్రార్థనా స్థలాలను, పవిత్ర స్థలాలను ధ్వంసంచేసిన చరిత్ర ఉంది. హైందవ మతం తనకంటె ముందరి బౌద్ధ ఆరామాలను ధ్వంసం చేసింది. బౌద్ధ స్థూపాలను కూలగొట్టింది. వాటిపైన దేవాలయాలు నిర్మించింది. జైన మందిరాలను ధ్వంసం చేసింది. అంతకన్న దుర్మార్గంగా గ్రామ దేవతలను, గిరిజన దేవతలను, గిరిజన మత సాంప్రదాయాలను ధ్వంసం చేసి, వక్రీకరించి, నీచస్థాయి ఇచ్చి తనలో భాగం చేసుకుంది. చివరికి బుద్ధుణ్ణి కూడ ఒక అవతారం చేసింది.

కనుక ప్రార్థనా స్థలాన్ని ధ్వంసం చేయడంలో, ఆ స్థలంలో తమ ప్రార్థనా

స్థలాన్ని నిర్మించడంలో, పాత ప్రార్థనా నిర్మాణపు శిథిలాలను తమ ప్రార్థనా స్థలానికి ఉపయోగించడంలో హిందూ మతానికిగానీ, ముస్లిం మతానికిగానీ ఏమీ తేడా లేదు. అయితే ఇక్కడ సమస్య బాబ్రీ మసీదు నిర్మాణం సరిగ్గా రామ జన్మస్థాన ఆలయం పైననే జరిగిందనడానికి ఆధారాలు లేవు సరిగదా, ఆ అభిప్రాయాలను పెంచి పోషించినవాళ్ళు బ్రిటిష్ అధికారులు, చరిత్రకారులు.

ఈ ఆధారాల పైన రామ జన్మభూమి వివాదం 1850ల తర్వాత రగలడం మొదలయింది. 1885 జనవరి 19న అప్పటి ఫైజాబాద్ సబ్ జడ్జి పండిట్ హరికిషన్ ముందు మొట్టమొదటి ఫిర్యాదు దాఖలయింది. జన్మస్థాన పూజారిగా చెప్పుకున్న రఘువరదాస్ బాబ్రీమసీదు ఆవరణలోని గద్దె మీద ఆలయ నిర్మాణానికి అనుమతించవలసిందిగా కోరాడు. 1885 ఫిబ్రవరి 24న ఇచ్చిన తీర్పులో సబ్ జడ్జి పూజారి వాదనను అంగీకరిస్తూనే, ఆలయ నిర్మాణానికి ఉద్దేశించిన స్థలం మసీదుకు మరీ సమీపంలో ఉన్నందువల్ల నిర్మాణానికి అనుమతించనన్నాడు. ఈ తీర్పుమీద ఫిర్యాది హైకోర్టుకు అప్పీలు చేసుకున్నాడు. 1886 మార్చ్ 17న ఫైజాబాద్ జిల్లాజడ్జి కర్నల్ జె.ఇ.ఎ. చాంబియెర్ వివాద స్థలాన్ని పరిశీలించి అప్పీలు కొట్టివేశాడు మార్చ్ 26న ఆయన ఇచ్చిన తీర్పులో "హిందువులు పవిత్రంగా ఎంచే ప్రత్యేక స్థలంపైననే ఒక మసీదు నిర్మించబడడం దురదృష్టకరం. కాని ఆ సంఘటన 356 సంవత్సరాల క్రితం జరిగిపోయింది గనుక, ఆ ఫిర్యాదును పరిష్కరించడానికి ఇప్పుడు చాల ఆలస్యమయిపోయింది. ఇప్పుడు చేయగలిగిందల్లా అన్ని పక్షాలనూ యథాస్థితిలో కొనసాగనివ్వడమే" అన్నాడు.

పూజారి ఇంకా పై అధికారి దగ్గరకు అప్పీలుకు వెళ్ళాడు. 1886 మే 25న ఈ అప్పీలు అవధ్ జుడిషియల్ కమీషనర్ ముందర విచారణకు వచ్చింది. జుడిషియల్ కమీషనర్ డబ్ల్యు. యంగ్ కూడ ఈ అప్పీలును తోసివేస్తూ నవంబర్ 1న తీర్పు ఇచ్చాడు.

ఐతే ఈ కోర్టు వివాదమంతటిలోనూ పూజారి గాని, కోర్టు రికార్డులు గాని చూపుతున్న రామజన్మస్థానానికీ, ఇప్పుడు విశ్వహిందూ పరిషత్ వాదిస్తున్న రామ జన్మస్థానానికీ తేడా ఉంది. 1885లో రఘువరదాస్ ఈ కోర్టు వివాదాన్ని లేపక ముందే, 'అయోధ్యా మహాత్మ్యం' అనే సంస్కృత పుస్తకానికి ఇంగ్లీషు అనువాదం

1876లో బెంగాల్ ఏషియాటిక్ సొసైటీ జర్నల్‌లో అచ్చయింది. దానిలోని వివరాలను బట్టి చూస్తే అప్పటికి రామజన్మస్థానంగా చెప్పబడేది మసీదుకు ఆగ్నేయ దిశలో ఉంటుంది. సరిగ్గా రఘువరదాస్ ఫిర్యాదులలో కూడ మసీదుకు ఆగ్నేయదిశలో ఉన్న గద్దెనే రామజన్మస్థానంగా చూపి, అక్కడ ఆలయ నిర్మాణానికి అనుమతించవలసిందిగా కోరాడు. అప్పటికి బ్రిటిష్ అధికారులు ఆ అనుమతిని నిరాకరించారు.

కాని ఐదు దశాబ్దాలు గడిచి, దేశంలో భయంకరమైన మత కల్లోలాలు జరిగి, హిందూ మతోన్మాదం పడగవిప్పిన దశలో రామజన్మస్థానం మసీదు మధ్య భాగంలోకి మారిపోయింది. హిందూ మతోన్మాదాన్ని ఏదో ఒక రకంగా సంతృప్తి పరచాలని భావించే "స్వతంత్ర" భారత ప్రభుత్వం ఏర్పడింది.

1946లో పరమహంస రామచంద్ర దాస్ స్థాపించిన అఖిల భారతీయ రామాయణ మహాసభ మసీదు బైట తొమ్మిది రోజులపాటు నిరంతర రాయమైన రామ చరిత మానస్ పఠన కార్యక్రమాన్ని 1949 డిసెంబర్‌లో ప్రారంభించింది. అంతకు నెల రోజుల ముందు నుంచే మసీదు ఆవరణలో ముస్లింల సమాధులు తవ్వేయడం, విద్వేష పూరితమైన ఉపన్యాసాలివ్వడం ప్రారంభమైంది. చివరికి తొమ్మిది రోజుల రామచరిత మానస్ పఠనం డిసెంబర్ 22న ముగిసింది. డిసెంబర్ 23 ఉదయానికల్లా సీతారాముల విగ్రహాలు మసీదు మధ్యభాగంలో వెలిశాయని విశ్వహిందూ పరిషత్ అంటోంది. కాని ఆ రోజు జిల్లా మెజిస్ట్రేటు కె.కె. నయర్ ముఖ్యమంత్రి గోవింద వల్లభపంత్‌కు, ఇతర అధికారులకు పంపిన రేడియో మెసేజ్‌లోగాని, అయోధ్య పోలీస్‌స్టేషన్‌లో మాతా ప్రసాద్ అనే కానిస్టేబుల్ నమోదు చేసిన ప్రాథమిక సమాచార నివేదికలో గాని చాలా స్పష్టంగా, బాబ్రీ మసీదు రాత్రివేళ నిర్జనంగా ఉన్నప్పుడు ఒక గుంపు గోడదూకి లోపలికి వెళ్ళిందని, ఆ గుంపే లోపల విగ్రహాలను పెట్టి అలంకారాలు చేసిందని రాశారు. ఈ దౌర్జన్యం పట్ల మొట్టమొదట నిరసన ప్రకటించిన వాళ్ళలో ఒకరు ఫైజాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అక్షయ బ్రహ్మచారి. ఆయన 1950లో రెండుసార్లు ఈ విషయంపై నిరాహారదీక్ష చేశాడు. లాల్‌బహదూర్‌శాస్త్రికి ఉత్తరం రాశాడు. 1950 జూన్ 12న రాసిన జవాబులో శాస్త్రి "అంతిమ నిర్ణయం కోర్టు తీర్పు తర్వాతనే తీసుకోవడం జరుగుతుంది" అన్నాడు. ఈ దౌర్జన్యం విషయమై నెహ్రూ కూడ కోపగించుకున్నాడని, వెంటనే యథాస్థితిని పునరుద్ధరించమని పంత్‌ను ఆదేశించాడని అంటారు. రాష్ట్ర ప్రభుత్వ

ప్రధాన కార్యదర్శి, ఐ జి.పి. ఇద్దరూ కూడా విగ్రహాలను తొలగించమని ఫైజాబాద్‌కు ఆదేశాలు జారీ చేశారు. కాని జిల్లా మెజిస్ట్రేటు కె.కె. నయర్ ఈ ఆదేశాలను ఖాతరు చేయలేదు. ఆయనే ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల్లో జనసంఘ్ అభ్యర్థి అయ్యాడు. ఇప్పుడు రామజన్మభూమి వివాద స్థలంలో సీతారాముల విగ్రహాలతో పాటు కె.కె. నయర్ నిలువెత్తు చిత్తరువు కూడ పూజలందుకుంటోంది!

ఈ విగ్రహాల దౌర్జన్యం గురించి రాజకీయ, అధికారిక స్థాయిలో ఈ కుట్ర సాగుతోండగా, న్యాయవ్యవస్థలో మరొక కుట్ర ప్రారంభమైంది. 1949 డిసెంబర్ 29న మెజిస్ట్రేటు ఒక ఆదేశం ఇస్తూ వివాద స్థలంలో శాంతికి భంగం కలగకుండా చూసేందుకు ఒక రిసీవర్‌ను నియమించాడు. భవనాలను ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని ఆదేశించాడు. నిజానికి ఆస్తి వివాదంలో మామూలుగా కోర్టు ఇచ్చే తీర్పు కన్నా ఇది భిన్నమైనది. ఎవరినైనా ఒక స్థలం నుంచి దౌర్జన్యపూరితంగా వెళ్ళగొడితే, వాళ్ళు నిజానికి ఆ స్థలపు హక్కుదార్లు కాకపోయినా, వాళ్ళకు తిరిగి ఆ స్థలంమీద హక్కులు ఇవ్వాలని, వాళ్ళను బేదఖలు చేసే అధికారం కోర్టుకు మాత్రమే ఉంటుందని మామూలుగా చట్టం అంటుంది. ఎన్నోసార్లు న్యాయమూర్తులు అటువంటి తీర్పులు ఇచ్చారు. కాని ఈ వివాదంలో మాత్రం అందుకు భిన్నమైన తీర్పు వెలువడింది.

ఈ తీర్పు కూడ ఆచరణలో మరింత దుర్మార్గంగా అమలయింది. ముస్లింలను మసీదులో ప్రార్థనలు చేసుకోకుండా నిషేధించారు. హిందువులు మాత్రం ఒక పక్క గేటునుంచి లోపలికి ప్రవేశించి విగ్రహాలను దర్శించేందుకు, పూజ చేసేందుకు అనుమతించారు. ఈ పూజలు జరిపేందుకు నలుగురు పూజారులను స్వయంగా రిసీవర్ నియమించాడు.

అక్కడితో కూడ ఆగిపోకుండా హిందూ మతోన్మాదం మసీదు స్థలం మీద తనకే పూర్తి హక్కులు ఉండాలని ప్రయత్నాలు ప్రారంభించింది. 1950 జనవరి 16న గోపాలసింగ్ విశారద్ అనే వ్యక్తి వేసిన సివిల్ దావాలో తమ పూజా హక్కులను నిర్ధారించవలసిందిగా కోరాడు. సివిల్ జడ్జి వెంటనే విగ్రహాలను తొలగించగూడదని, "ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతిలో" పూజలో జోక్యం చేసుకోగూడదని ఆదేశం ఇచ్చాడు. నిజానికి మసీదు ఎవరి అధీనంలో ఉండింది, ఆ మసీదులో

దొంగతనంగా పెట్టిన విగ్రహాలను తీసివేయాలా లేదా, మసీదును ముస్లింలకు తిరిగి ఇవ్వాలా లేదా అనే విషయాలు చర్చించే బదులు, హిందువులకు పూర్తి పూజా హక్కులున్నాయా, నియంత్రిత పూజా హక్కులున్నాయా అనే చర్చ మొదలయింది. ఈ చర్చను సమర్థించుకుంటూ 1951 మార్చి 3న ఇచ్చిన తీర్పులో సివిల్ జడ్జి "ఈ దావా వేసేనాటికి శ్రీ భగవాన్ రామచంద్రుని విగ్రహం, ఇతర విగ్రహాలు ఆ స్థలంలో ఉన్నాయనేది నిస్సందేహమైన వాస్తవం" అని రాశాడు. మొత్తం మీద వివాదస్థలపు సింహద్వారం తాళాలు వేసి, ముస్లింలను లోపలికి రానివ్వకుండా, హిందువులను పక్కదారి నుంచి రానిచ్చే పరిష్కారంతో దశాబ్దాలపాటు కాలం గడిచింది.

1970ల తర్వాత దేశ రాజకీయాలు, సామాజిక జీవనం మత విద్వేషపూరిత మవుతున్న వాతావరణంలో 1980ల తర్వాత కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ ఎవరికివాళ్ళు తామే హిందువుల ప్రతినిధులమని చూపుకోవాలని తాపత్రయపడుతున్న స్థితిలో 1984 అక్టోబర్ 7న రామ జన్మభూమి అక్షన్ కమిటీ ఏర్పడింది. ఆ రోజు నుంచి అది 'తాళాఖోలో' ఆందోళన చేపట్టింది. ఈ వివాదాన్ని ప్రచారం చేస్తూ రథ యాత్ర చేపట్టింది ఇందిరాగాంధీ హత్యతో ఈ ప్రచారాన్ని ఒక సంవత్సరం వాయిదా వేసి, 1985 అక్టోబర్ 23న దేశంలోని 25 చోట్లనుంచి అయోధ్యకు రథ యాత్ర కార్యక్రమాన్ని ప్రకటించారు. 1986 మార్చి 9 నాటికి అయోధ్య చేరి తాళాలు తెరిపిస్తామని విశ్వహిందూ పరిషత్ ప్రకటించింది.

ఒకవైపు ఇట్లా ఆందోళన కార్యక్రమానికి పూనుకుంటూనే, మరోవైపు మళ్ళీ కోర్టు వివాదాన్ని ముందుకు తెచ్చారు. 1986 జనవరి 25న పూజ మీద పరిమితులు ఎత్తివేయమని కోరుతూ మున్సిఫ్ కోర్టులో అభ్యర్థన దాఖలయింది. 1950లో పెట్టిన అసలు కేసు ఫైలు ఇంకా హైకోర్టు విచారణలోనే ఉన్నప్పుడు, తాను మళ్ళీ ఈ విచారణ చేపట్టలేనని మున్సిఫ్ మెజిస్ట్రేట్ అన్నాడు. వెంటనే, జనవరి 31న జిల్లా కోర్టులో అప్పీలు దాఖలయింది. ఫిబ్రవరి 1ననే విచారణ జరిగింది. తమను కూడ విచారణలో భాగం చెయ్యాలని కోరుతూ మహమ్మద్ హాషిం అనే వ్యక్తి పెట్టుకున్న దరఖాస్తును జిల్లా జడ్జి తోసిపుచ్చాడు. ఆ రోజునే మెయిన్ గేటు తాళాలు తెరవవలసిందిగా ఆయన ఉత్తర్వులిచ్చాడు. గత 35 సంవత్సరాలుగా హిందువులు అక్కడ పూజ చేసుకుంటూనే ఉన్నారు గనుక, గేటు తాళాలు తెరవడం

వల్ల కొంపలు మునిగిపోవనే కుటిల తర్కంతో ఆయన తన తీర్పును సమర్థించు కున్నాడు. ఆయన పేరు కె. ఎం. పాండే. సీతారాముల విగ్రహాలతోపాటు, కె. కె. నయర్ చిత్తరువుతోపాటు ఆయన చిత్తరువు కూడ రామజన్మ భూమిలో పూజలు అందుకుంటోంది!

ముస్లిం మహిళా బిల్లు ద్వారా ముస్లిం వోట్లను ఆకర్షించడానికి ప్రయత్నించి నట్టుగానే, బాబ్రీ మసీదు మీద విశ్వ హిందూ పరిషత్‌కు అధికారం ధారాదత్తం చేసి హిందూ వోట్లను ఆకర్షించడానికి రాజీవ్‌గాంధీ ప్రయత్నించిన ఫలితమే ఈ తీర్పు. ఈ రాజకీయ కుట్ర పర్యవసానంగా ఉత్తర భారతమంతా మత ప్రాతిపదిక మీద చీలిపోయింది. ఎన్నికలలో నిత్యజీవిత సమస్యల పరిష్కారం కన్న మతమే ప్రధానపాత్ర వహించింది.

ఈ మతోన్మాద మహమ్మారి ఏదో ఒక బలితో ఆగిపోదు. అది ఇంకా ఇంకా బలుల్ని కోరుతూనే ఉంటుంది. మసీదు బైట గద్దెమీద గుడి కట్టుకుంటామన్న కోర్కె ఒక శతాబ్దం తిరిగేసరికల్లా మసీదును కూల్చి రామాలయం నిర్మించాలన్న కోర్కెగా మారిపోయింది. గేటు తాళాలు తెరిచి సంతృప్తి పరచగలమనుకుంటే అసలు మసీదు కూలిస్తేనేగాని సంతృప్తి పడబోమని విశ్వహిందూ పరిషత్ ప్రకటిస్తోంది.

గేటు తాళాలు తెరవాలనే ఆదేశం తర్వాత బాబ్రీమసీదు ఆక్షన్ కమిటీ ఏర్పడి ఈ వివాదంలో ముస్లిం మతస్తుల ప్రయోజనాలు కాపాడడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. కోర్టు వివాదాలు, చర్చలు తీవ్రతరమయ్యాయి. మూడు సంవత్స రాల పాటు చాపకింది నీటిలా మత విద్వేషాన్ని ప్రచారం చేసిన విశ్వహిందూ పరిషత్ 1989 ఫిబ్రవరిలో మళ్ళీ రంగంమీదికి వచ్చింది. విశ్వహిందూ పరిషత్, సాధువులు కలిసి రామాలయ నిర్మాణం జరిపించవలసిందేనని పిలుపు ఇచ్చాయి.

ఈ వివాదానికి సంబంధించిన ఐదు దావాలను కలిపి ఒకేసారి విచారణకు తీసుకుని 1989 ఆగస్ట్ 14న అలహాబాదు హైకోర్టుకు చెందిన లక్నో బెంచి ఒక తీర్పు ఇచ్చింది. తుది తీర్పును వాయిదా వేస్తూ, మధ్యంతర ఆదేశంగా "ఈ దావాల లోని అన్ని పక్షాలూ వివాద స్థలం స్వభావాన్ని మార్చకుండా ఉండాలి" అని ప్రకటించింది. అప్పటికి ఈ దావాలలో ఉన్న పక్షాలు సున్నీ వక్ఫ్ బోర్డ్, రాష్ట్ర ప్రభుత్వం, రామజన్మ భూమి న్యాస్ ప్రతినిధి అశోక్ సింఘాల్, విశ్వహిందూ

పరిషత్ నాయకుడు దేవకీనందన్ అగర్వాల్, ఇతర హిందూ, ముస్లిం మత నాయకులు. ఈ మధ్యంతర ఆదేశం వచ్చిన వెంటనే విశ్వహిందూ పరిషత్ దాన్ని అంగీకరించనని ప్రకటించింది. ఈ వివాదం చట్ట పరిమితులకు అతీతమైనదని తాను భావిస్తున్నానని కనుక, ఏ కోర్టు ఆదేశానికీ లోబడనని అది ప్రకటించింది. నవంబర్ 9న రామశిలాపూజ జరుపుతానని, ప్రపంచం నలుమూలల నుంచీ తీసుకొచ్చిన రామ శిలలను ఆ రోజు శంకుస్థాపన చేసి, ఆలయ నిర్మాణం ప్రారంభిస్తానని విశ్వహిందూ పరిషత్ ప్రకటించింది. ఏ స్థలంలోనయితే శంకుస్థాపన జరుపుతానని విశ్వహిందూ పరిషత్ ప్రకటించిందో ఆ స్థలాన్ని 1961లో సున్నీ వక్ఫ్ బోర్డ్ శ్మశానంగా చూపుతూ కోర్టుకు వెళ్ళి ఉంది.

ఇంత స్పష్టంగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తానని, వివాద స్థలంలో నిర్మాణం చేపడతానని విశ్వహిందూ పరిషత్ బహిరంగ ప్రకటనలు చేస్తోంటే, ఏ చట్టపరమైన చర్యా తీసుకోలేదు సరిగదా, ఆ నాయకులతో చర్చలు జరుపుతూ బుజ్జగించడానికి ప్రయత్నించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున బూటాసింగ్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎన్.డి. తివారి విశ్వహిందూ పరిషత్ నాయకులను కలసి వారిని సంతృప్తి పరచడానికి ప్రయత్నించారు. రామశిలా యాత్రకు అంగీకరిస్తామని, కాని అది తాము పెట్టే షరతులలోపు జరగాలని ఒక కుంటి వాదన చేశారు. "రామ శిలలను ఇక్కడికి రానిచ్చిన తర్వాత పరిస్థితి మన చేతిలో ఉండదు అని మేం చెప్పిన మాట ఎవరూ పట్టించుకోలేదు" అని ఫైజాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ ఆర్.ఎస్. శ్రీవాస్తవ అన్నాడు. అయినా బూటాసింగ్ విశ్వహిందూ పరిషత్‌తో చర్చలు జరిపి లక్నో హైకోర్టు తీర్పును పాటిస్తామని సంతకం చేయించుకున్నాడు. సంతకం చేసిన మరుక్షణం నుంచీ విశ్వహిందూ పరిషత్ నాయకులు హైకోర్టు ఆదేశాన్ని ఉల్లంఘించే క్రమంలో వేగం పుంజుకున్నారు. నవంబర్ మొదటి వారానికల్లా లక్షన్నర ఇటుకలు అయోధ్యకు చేరాయి.

పరిస్థితి ఇంత దూరం వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరమైన లొసుగులు వెతికి అటు ముస్లింలను, ఇటు హిందువులను కూడ సంతృప్తి పరచడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. విశ్వహిందూ పరిషత్ శంకుస్థాపన తలపెట్టిన ప్లాట్ కన్న పక్క ప్లాట్ వివాద రహితమైనదని, అది రామ్‌గోపాల్‌దాస్ అనే వ్యక్తికి చెందినదని, కావలిస్తే అది కొని ఇస్తానని, అక్కడ శంకుస్థాపన జరుపుకొమ్మని ప్రభుత్వం

విశ్వహిందూ పరిషత్‌ను బతిమిలాడింది. కాని నవంబర్ 2న బజ్‌రంగ్‌దళ్ కార్య కర్తలు వివాద స్థలంమీదనే కాషాయజెండా ఎగరేసి పని ప్రారంభించారు.

అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించి ఆ స్థలం వివాద స్థలం అవునో కాదో వివరణ యిమ్మని కోరింది. తన ఆధారాల ప్రకారం ఆ స్థలం వివాద స్థలమేనని ప్రభుత్వం తరపున న్యాయవాది ప్రకటించాడు. హైకోర్టు ఆ స్థలం వివాద స్థలమేనని ప్రకటించింది. విశ్వహిందూ పరిషత్ ఆ స్థలం నుంచి పైదొలగేది లేదని భీష్మించింది. అప్పుడు మళ్ళీ తీర్పును, దావాలను జాగ్రత్తగా చదివి, లొసుగుల ఆధారంగా ముందుకు సాగమని బూటాసింగ్ ఆదేశించాడు. అట్లా తీర్పు చివరి పేరా లోని అస్పష్టతను ఆధారం చేసుకుని, ప్రభుత్వం ఆ స్థలం వివాద స్థలం కాదని ప్రకటించింది. ఒక్కరోజు ముందు అదే కోర్టులో ఏ స్థలాన్నయితే తానే వివాద స్థలంగా వాదించి ఉన్నదో, ఆ స్థలాన్నే ఆ మర్నాడు వివాదరహిత స్థలంగా ప్రక టించింది! అట్లా అయోధ్యలోని ఆ 15,800 చదరపు మీటర్ల స్థలంలో ఏడు అడుగుల పొడవు, ఏడు అడుగుల వెడల్పు, ఏడు అడుగుల లోతుతో శంకుస్థాపన గొయ్యి తవ్వడం ప్రారంభమైంది. నవంబర్ 9న ఆ స్థలంలోనే శంకుస్థాపన జరిగింది.

ఆ తర్వాత విశ్వహిందూ పరిషత్ తన వాదనను మరింత మార్చి, తాను శంకుస్థాపన చేసింది సింహద్వారానికేనని, అంటే ఆలయం అక్కడ మొదలయి లోపలికి సాగుతుందని అంటోంది. అంటే బాబ్రీ మసీదును పూర్తిగా కూల్చకుండా ఆలయ నిర్మాణం జరగదన్నమాట.

తర్వాత ఎన్నికలు జరిగి, ఎన్నికలలో మత విద్వేషాలు రగిలి భారతీయ జనతాపార్టీ అతి ఎక్కువ సీట్లు గెలుచుకుంది. కేంద్ర ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చెయ్యగలిగే స్థితికి ఎదిగింది. ఈ స్థితిలో ఫిబ్రవరి 14న ఆలయ నిర్మాణం ప్రారం భిస్తామని బెదిరించి, వి. పి. సింగ్‌తో చర్చలు జరిపి అప్పటికి వాయిదావేసి, మళ్ళీ ఇప్పుడు అక్టోబర్ 30న ప్రారంభిస్తానని అంటోంది.

ఈ వివాదంలో ప్రవేశించిన చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు విడివిడిగా దీన్ని చరిత్ర సమస్యగానో, ఆధారాల సమస్యగానో, రాజకీయాల సమస్యగానో చూశారేగాని, సమగ్రంగా అర్థం చేసుకోలేకపోయారు. మతవాదం మీద విమర్శ

రాజకీయాల మీద విమర్శగా మారాలని, దైవలోకం మీద విమర్శ భూమి మీద విమర్శగా మారాలని గుర్తించలేక పోయారు. దేశవ్యాప్తంగా ప్రజలు అనేక ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యల మీద పోరాటాలకు ఉద్యమిస్తున్న సమయంలో ఆ ప్రజలను పక్కదారి పట్టించడానికి, వారిలో తప్పుడు చైతన్యాన్ని పెంచడానికి పాలకవర్గాల చేతుల్లో మతతత్వం మంచి ఆయుధంగా పనిచేస్తుంది. మతానికీ, సాంస్కృతిక అంశాలకూ ప్రజలలో ఉన్న పట్టును గుర్తించి, ఆ పట్టును వక్రీకరించి వాడుకునేందుకు జరుగుతున్న రాజకీయ కౌటిల్యమే ఇవాళ మతతత్వ రూపం ధరించింది. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోకపోతే మతతత్వాన్ని ఎదిరించడం సాధ్యం కాదు.

మతతత్వాన్ని ఇట్లా సమగ్రంగా అర్థం చేసుకోకపోవడం వల్లనే ఈ వివాదంలో అభిప్రాయాలు ప్రకటించిన ప్రగతిశీల మేధావుల్లో కొందరు అసాధ్యమైన, అన్యాయమైన పరిష్కారాలు సూచించారు.

బాబ్రీ మసీదును యథాతథంగా ఉంచి, దాని పక్కనే రామాలయాన్ని నిర్మించాలనేది ఒక సూచన. భారత ప్రభుత్వం ప్రకటించే అవకాశవాద సెక్యులరిజానికి ఇది మంచి ఉదాహరణ. సర్వమత సహనం సెక్యులరిజం కాదు సరిగదా, నిజానికి సర్వమత సహనమనేది ఆచరణ సాధ్యమైనదే కాదు. తన మతం గొప్పదని అనుకోకపోతే మత విశ్వాసానికే అర్థం ఉండదు.

బాబ్రీమసీదును జాతీయ చిహ్నంగా ప్రకటించాలనేది మరొక సూచన. చరిత్రకారుల దగ్గరి నుంచి సి.పి.ఐ, సి.పి.ఐ (ఎం) వ్యాఖ్యాతల వరకు మొత్తం మీద ఉదార, ప్రజాస్వామిక వాదులమనుకునే వాళ్ళందరూ ఈ సూచనను సమర్థిస్తున్నారు. ఈ సూచన దానికదిగా సరైనదిగానే కనబడవచ్చును గాని ఇందులో ఆలోచించవలసిన అంశాలు రెండు ఉన్నాయి. మొదటిది, ఏదో ఒక మతవర్గం మరో మతవర్గపు ప్రార్థనా స్థలంపైన వివాదం రేపినప్పుడల్లా ఆ ప్రార్థనా స్థలాన్ని జాతీయ చిహ్నంగా మార్చాలనడం సరైనదేనా? అట్లా అయితే ప్రతి ముస్లిం ప్రార్థనా స్థలం మీద హిందువులు, ప్రతి హిందూ దేవాలయం మీద బౌద్ధులు, జైనులు, గిరిజనులు

వివాదం రేపగలిగే అవకాశం ఉంది. ప్రతి మతపు ప్రార్థనా స్థలమూ ఆ స్థలంలోని శిథిలాలను వాడుకుంటూనే ఉంటుంది. ఆ శిథిలాలను చూపి, ఆ స్థలం ఎప్పుడో పూర్వకాలాన తమదని నిరాధారమైన వాదనలు చేసి ఒక మతవర్గం దౌర్జన్యం సాగిస్తోంటే, ఆ సమయంలో జాతీయ చిహ్నంగా ప్రకటించడమనేది ఆ మత వర్గానికే ఉపయోగపడుతుంది.

రెండు, ఒక మతవర్గం తన పవిత్ర స్థలంగా భావించి ప్రార్థనలు జరుపుకునే చోటును ప్రభుత్వం ఏకపక్షంగా, నిరంకుశంగా జాతీయ చిహ్నంగా ప్రకటించ వచ్చునా? 1949 డిసెంబర్ 22 వరకూ ప్రార్థనలు జరుగుతున్న చోట, ఆ ప్రార్థనలను దౌర్జన్య పూరితంగా ఆపి, నాలుగు దశాబ్దాల తర్వాత ఆ స్థలాన్ని 'జాతీయ చిహ్నంగా' ప్రకటించడమంటే అంతిమంగా ఎవరికి ప్రయోజనం కలిగినట్టు?

విశ్వహిందూ పరిషత్ ఇప్పుడు చేస్తున్న వాదనలను అంగీకరించినా, కనీసం జాతీయ చిహ్నం వంటి రాజీకి సిద్ధపడినా, తన అమ్ముల పొదిలో మధుర శ్రీ కృష్ణ జన్మస్థానం నుంచి తాజ్‌మహల్ వరకూ ఎన్నో ఉన్నాయని విశ్వహిందూ పరిషత్ స్పష్టంగానే ప్రకటిస్తోంది.

1947 ఆగస్ట్ 15న దేశంలోని రెండు ప్రధాన మతవర్గాల ప్రార్థనా స్థలాలు ఏ స్థితిలో ఉన్నాయో ఆ స్థితినే కొనసాగించాలని మరో సూచన ఉంది. ఈ సూచన కొంతవరకు న్యాయమైనదే.

ఏమైనా మతం గురించి, మతతత్వం గురించి, సెక్యులరిజం గురించి వివరమైన చర్చ జరగకుండా, ఇటువంటి వివాదాలకు సులభ సాధ్యమైన పరిష్కారాలుండవు. మోప్లా తిరుగుబాటులోనూ, తెభాగ, తెలంగాణ పోరాటాల లోనూ రెండు ప్రధాన మతవర్గాలకూ సంబంధం ఉంది. మతవర్గాల మధ్య ఐక్యత-ఘర్షణ సమస్యను వర్గపోరాటమే న్యాయంగా పరిష్కరిస్తుందని ఆ పోరాటాలు రుజువు చేశాయి. బాబ్రీమసీదు-రామజన్మభూమి వివాదంలోనూ తక్షణమే అంగీకార యోగ్యమైన పరిష్కారాలు దొరకక పోవడానికి ఆ ప్రాంతంలో వర్గపోరాటం ఉన్నత స్థాయికి ఎదగక పోవడం కూడ ఒక కారణమే. ఇన్ని భిన్నమైన ప్రవాహాలు కలగలిసి ఏర్పడి, కొనసాగుతున్న వివాదమైనందువల్లనే దానికి తక్షణ పరిష్కారాలు లేవు. ఒక చర్చాక్రమంలో పరిష్కారం తేలుతుంది. ఆ చర్చ సవ్యంగా నడిచేట్టు చూడవలసి ఉంది.

చైనీస్ కథ :

ముగ్గురు సైనికులు

లియూ పాయి-యూ

సాధారణ ప్రజలు మా సైనికుల గురించి చాలా తక్కువ అభిప్రాయం కలిగి వుంటారు. మేం చేస్తే పోరాటం చేస్తాం లేకపోతే నిద్రపోతాం అనుకుంటారు. కానీ ఈ అభిప్రాయం అన్నివేళలా నిజంకాదు.

సైన్యంలో మా జీవితం ఇంటి దగ్గరలాగే వుంటుంది. కాకపోతే 'ఇల్లు' అనే దాని స్వరూపం మాత్రం మారిపోతుంటుంది మంచెలమీదా, చెట్లపైనా మా నివాసం. అంతేకాదు మా సైనిక కుటుంబానికీ అన్ని సాధారణ కుటుంబ సమస్యలలాగే దాని కష్టాలు దానికుంటాయి, సుఖాలలాగే.

ఉదాహరణకి మా దళాన్నే తీసుకోండి. ఈ మధ్యే మా మధ్య ఓ సమస్య తలెత్తింది. దళంనించి అనారోగ్య కారణాల వల్ల బైటకి వెళ్ళి తిరిగి దళంలోకి వస్తున్న ఓ సాయుధ సహచరుడికి స్వాగతం చెప్పే సందర్భంలో ఆ సమస్య ఎదురైంది. నిజానికి తీవ్రమైన గాయాలతో వెళ్ళి సడలని దీక్షతో దళాన్ని చేరిన ఆ మిత్రుడి పునరాగమన సందర్భంలో చిన్న వేడుక చెయ్యడం చాలా బాగుంటుందనే అనుకున్నాం. కానీ మా ప్రయత్నం రసాభాసగానే ముగిసింది.

మేం స్వాగతించదల్చిన కామ్రేడ్ నిజంగా కాకలుతీరిన యోధుడు. ప్రజ్వలించే ఆశయబలం కలవాడు. తన గాయాలు పూర్తిగా సాంతం మానకుండానే రణరంగం చేరిన ఆ మిత్రుడి పునరాగమనానికి వేడుక జరపడం సమంజసమనే మా అభిప్రాయం. ఆ సాయంత్రం మొత్తం దళమంతా 'కాంగ్' మీద అతన్ని చుట్టుముట్టి కూర్చున్నాం. దారి పొడుగూతా అతను దళాన్ని తిరిగి చేరతానో లేదో అనే ఆదుర్దాతోనే గడిపేడు. చివరికి ఎలాగైతేనేం మా మధ్యకు చేరాడు. మీరే వూహించుకోండి అతను ఎంత సంతోషంతో ఉండి ఉంటాడో. మెరుస్తోన్న కళ్ళతో, ఉద్వేగం నిండిన గొంతుతో తను దళం వీడిన దగ్గర్నించీ జరిగిన సంఘటనల్ని చెప్తుంటే మేం సంభ్రమంగా వింటున్నాం. తన తిరుగు ప్రయాణంలో ఓ భూస్వామిని తుద ముట్టించడానికి కదలిన పీడిత రైతాంగానికి తను చేసిన సాయం గురించీ....ఇంకా అనేక విషయాలు చెప్పేడు. మేమూ ఉద్వేగంతో అతను వెళ్ళిన తర్వాత జరిగిన

దళానికి సంబంధించిన విశేషాలన్నిటినీ చెప్పేం. చివరగా ఓ కామ్రేడ్ యిలా అన్నాడు :

"నేస్తమా మేం తరచూ నీ గురించి ఆలోచించేవాళ్ళం. నువ్వెళ్ళిన తరువాత నీ ధైర్యసాహసాల గురించి మన రెజిమెంట్‌లో అందరూ చెప్పుకునేవారు. ఇక మన రెజిమెంట్ కమాండర్ అయితే మమ్మల్ని నిన్ను ఆదర్శంగా తీసుకోవాల్సిందిగా చెప్పేవాడు. నువ్వు నిజమైన యోధుడివి అని అనేవాడాయన."

మా మధ్య సాయుధ మైత్రి పూలు పూస్తూన్న వేళ. మా మధ్యనే వున్న మా దళ సభ్యుడొకరు తన మాటలతో మొత్తం దృశ్యాన్ని రసాభాస చేసేసేడు.

* * *

పైన పరిచయం చేసిన యోధుడి పేరు యన్ చుంగ్-ఫూ. అతనే ఈ కథలో ప్రధాన పాత్రధారి కూడాను. అతను ఏ కుటుంబాల నించి వచ్చేడో అయితే మాకు తెలీదుగానీ, మేమ్మాత్రం మా అందరిలాగే పేద కుటుంబాల్నించే వచ్చేడనే అనుకునే వాళ్ళం. అతను నిరంతరం అద్భుతమైన విప్లవ స్ఫూర్తితో జ్వలించేవాడు. యుద్ధ రంగంలోనూ అంతే స్ఫూర్తితో శత్రువు నెదుర్కొనేవాడు. అతను యుద్ధరంగంలో తీవ్రంగా గాయపడ్డ తర్వాత కొంతకాలం హాస్పటల్‌లో వున్నాడు. తర్వాత సెలవు మీద ఇంటికి పంపబడ్డాడు.

అతను ఆ సమయంలో పోరాటపు అద్భుతమైన ఫలితాల్ని చూసేడు. ఒంటి నిండా గుడ్డలు కట్టుకున్న రైతుల్ని, కూలీల్ని చూసేడు. ఎవరికివారు వారివారి కొట్టాల్లో సొంత పశువుల్ని కలిగి ఉండడాన్ని చూసేడు. ప్రతి మనిషికీ సొంతానికి కొంత భూమి వుండడం చూసేడు. పీడిత ప్రజల మహోజ్వల పోరాటాల ఫలితాన్ని, అనేక త్యాగాలుచేసి సాధించిన విజయాన్ని ఆనందం తొణికిసలాడే నేత్రాలతో చూసేడు. సంతోషంతో పొంగిపోయాడు. అతను తన గ్రామానికి చేరిన రోజు సాయంత్రం రైతుకూలీ సంఘం సభ్యులు కొందరు తమ విముక్తికై జరుగుతోన్న పోరులో ముందు వరుస నిల్చి పోరుతూన్న, గాయపడిన ఆ యువకుడ్ని తమ గ్రామంలోకి స్వాగతించడం కోసం వచ్చేరు. యన్ వాళ్ళతో చాలా స్ఫుటంగా స్పష్టంగా చెప్పేడు.

"ఒక విషయం మాత్రం స్పష్టం. మన పోరాటం అద్భుతంగా నడుస్తోంది.

అందులో ఏమాత్రం సందేహం లేదు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పీడిత వర్గం భూస్వామ్యాన్ని చాపచుట్టి సముద్రంలోకి విసిరి పారేసింది. నేను మరోసారి మీ ముందు ప్రతిజ్ఞ చేస్తున్నా నేను యుద్ధరంగం చేరి దోపిడీపై జరుగుతున్న ఈ పోరాటంలో ఎన్ని కష్టాలు ఎదురైనా సరే ముందుకే పోతాను."

కొంతకాలం నడిచిన తర్వాత యన్ గ్రామం నించే బయల్దేరి హాస్పటల్ చేరేడు. అక్కడ గాయపడి చికిత్స పొందుతున్న కామ్రేడ్లని పరామర్శించి యుద్ధ రంగం చేరేడు.

అతను దళం వదలి వెళ్ళినప్పట్నించీ అతని వీరత్వం గురించి విపరీతంగా చెప్పుకునేవాళ్ళు. నిజానికి అతను ఆ పొగడ్తలకి అర్హుడనే అనుకొనేవాళ్ళం కూడా.

అతను దళాన్ని విడిచి వెళ్ళడానికి కారణమైన గాయాలు తగిలిన ఆ సంఘటన నాకింకా కళ్ళకి కట్టినట్టు కన్పిస్తూనే వుంది. శతృవుతో మేం జరిపిన ఆ దాడిలో యన్ అద్భుతమైన సాహసంతో శతృవు నెదుర్కొన్నాడు. శతృమూకల్ని చీల్చుకొని మునుముందుకు వెళ్ళిపోయాడు. క్రమంగా దళానికి దూరమైపోయాడు.

యుద్ధం భయంకరంగా నడుస్తోంది. ఇరు వైపులా తూటాలు నిరంతరంగా కురుస్తున్నాయి. మెషిన్‌గన్లు నిప్పులు కురుస్తున్నాయి. యన్ జాడ లేదు. మేమైతే విప్లవ రంగస్థలం మీద అతని పాత్ర ముగిసిందనే అనుకున్నాం. నెత్తురు నిండిన కళ్ళతో మా కమాండర్ మమ్మల్ని వీరోచితమైన దాడికి పురిగొల్పుతున్నాడు. సరిగ్గా అప్పుడేమైందో మీరు ఊహించగలరా? చాలా క్లిష్టమైన పరిస్థితిలో మేం ముందుకు దూసుకు పోతున్న వేళ శతృకూటమి మధ్య కలకలం మొదలైంది. శతృవు పై వెనక నించే దాడి ప్రారంభమైంది. ఇటు మేం విసుర్తున్న బాంబుల్నించీ, బుల్లెట్ల నించీ కాచుకుంటున్న శతృవు ఈ వెనక దాడితో డంగై పోయేడు. ఆ దాడి నిర్వాహకుడెవరో తెల్సా....యన్. మా ఎదుట మోహరించి వున్న శత్రువుల మధ్యలో పేలిన బాంబు వెలుగులో యన్‌ని మేం గుర్తించేం. అప్పటికే యన్ శతృవు ప్రధాన స్థావరాన్ని కూల్చివేస్తున్నాడు. అదే సమయంలో మేం వాడి చెయ్యడంతో కన్‌ఫ్యూజ్ అయిన శతృవు గందరగోళంలో వుండగానే ఓ లావుపాటి పెద్ద చెవుల ఆఫీసర్‌ని ఒకడిని బందీగా పట్టుకొన్నాడు. వాడే ఈ దాడి నిర్వహించిన ఆఫీసరు. యన్ వాణ్ణి మా స్థావరం చేర్చి తిరిగి దాడికి సిద్ధమైపోయాడు. సరిగ్గా ఆ దాడిలోనే

యన్ దారుణంగా గాయపడ్డాడు. స్పృహ కోల్పోయిన యన్‌ని అతి కష్టంమీద తర లించగలిగేం. తరవాత హాస్పటల్‌కి పంపేం.

*   *

చీమిడిముక్కోడు అనేది లిఫా-హోకి మేం పెట్టిన మారుపేరు. మేమంతా దాదాపు అతన్ని అదే పేరుతో పిలుస్తాం. అతని అసలు పేరు మర్చేపోయాం. ఆఫీసర్లు కూడా స్నేహపూర్వకంగా అతన్ని ఆ పేరుతోనే పిల్చేవాళ్ళు. అతను చాలా పాత సైనికుడు. కొందరైతే అతన్ని "పాత వెనకబడ్డవాడు" అని పిల్చే వాళ్ళు. కారణం అతన్తోపాటు వచ్చిన వాళ్ళంతా ఉన్నత స్థాయిల్లోకి వెళ్ళిపోయారు. లిఫా మాత్రం అలాగే ఉండిపోయాడు. అతను మాత్రం ఈ పరిహాసాలనేం ఖాతరు చేసేవాడు కాదు. అతని స్థితి గురించి ప్రశ్నిస్తే -

"పైకి పొయ్యేవాళ్ళంతా అదృష్టవంతులు. నేను కాదులే" అని నవ్వేసేవాడు.

లిఫా మూర్తీభవించిన వ్యక్తివాది. క్రమశిక్షణ అనేది అతనికి తెలియని పదం. అతి చిన్న చిన్న నియమాల్ని సైతం ఉల్లంఘించేవాడు. ఐనప్పటికీ నాల్గయిదు సంవత్సరాల్నించీ అతను సైన్యంలో కొనసాగుతూనే వున్నాడు. దాదాపు వంద చర్యలలో పాల్గొని ఉంటాడు. విచిత్రం, ఒక్క చిన్న గాయమైనా తగలలేదు అతనికి. ఒక విధంగా చూస్తే అతను సమర్థుడైన సైనికుడే. క్లిష్టమైన పరిస్థితుల్నించి తప్పుకొని, బైటపడడం అతనికి కరతలామలకం. దూసుకెళ్ళు - అడ్డొస్తే నరుకు అనే సూత్రం పాటించేవాడు. ఏదేమైనా రాజకీయంగా మాత్రం వెనకబడి ఉండేవాడు. యాంత్రికంగా పన్జేస్తాడు. అతని దారిలో ఎన్నడూ ఒక ప్రశంసాపత్రం గానీ, మెడల్‌గానీ రాలేదు.

సరే, మనం మళ్ళీ కథలోకి వెళ్దాం. ఆ రాత్రి మేం యన్ స్వాగతం నిమిత్తం ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా ముగియడానికి కారణం లిఫానే. సమావేశం నడుస్తూండగా లిఫా సిగరెట్ తాగుతూ గమనిస్తూన్నాడు. ఎప్పుడైతే మా మిత్రు డొకడు యన్‌ని పొగుడుతూ మాట్లాడేడో వెంటనే లిఫా తన మొరటు గొంతుతో నిర్లక్ష్యంగా-

"నేననుకోడం నీకా మెడల్ అదృష్టంకొద్దీ వచ్చిందని" అన్నాడు.

యన్ చురుగ్గా అతనికేసి చూసి-

"అదృష్టం అంటే ?" అడిగాడు.

లీఫా తనదైన పద్ధతిలో నిర్లక్ష్యంగా యన్ మొహంలోకి చూసి-

"పెద్దవో చిన్నవో నేను దాదాపు వంద యాక్షన్లలో పాల్గొన్నాను. చిన్న మెత్తు గాయం కూడా నాకు అవలేదు. అదే నిజమైన ప్రతిభ. బహుశా నువ్వు ధైర్యస్తుడివే కావచ్చు. కానీ నీకు యుద్ధంలో మెళకువలు తెలీవు" అన్నాడు.

ఒక్కసారి ఈ మాటలతో అందరికీ ఆ చలికాలంలో చన్నీటి స్నానం చేసినట్టయింది. మా దళ నాయకుడు సమావేశాన్ని ముగించి మమ్మల్ని పంపేసేడు. సరిగ్గా ఆరోజు నించే యన్, లీఫా ఒకర్ని ఒకరు గుర్తించనట్టు ప్రవర్తించసాగేరు.

• • •

సరే గొడవ వాళ్ళిద్దరి మధ్యనే అయితే పెద్ద విశేషమేం లేకపోను. కాని కుర్ర ఛో ఇందులో వేలుపెట్టి ఆ గొడవని పెద్దది చేసాడు. ఛోకొమింటాంగ్ సైన్యంలో సైనికుడుగా ఉండేవాడు. ఎర్రసైన్యం జరిపిన ముట్టడి తర్వాత మాలో కల్సిపోయేడు. అతని వయస్సు కేవలం పందొమ్మిది సంవత్సరాలే. అతన్ని సైన్యం లోకి తీసుకోడానికి కారణం అతని వయస్సే. అంత చిన్న వయస్సులో అతని బుర్రని శతృవు సొంతం చెడగొట్టి ఉండదని పైవాళ్ల భావించడంచేత అతన్ని ఎర్రసైన్యంలోకి తీసుకున్నారు.

యవ్వనం తొణికిసలాడుతూ తిరుగుతూ ఉండేవాడు. అతనికి తనదైన చిన్న "విధానం" వుండి. మా మధ్య జరిగే సమావేశాల్లో ఎన్నడూ నోరు తెరిచేవాడు కాదు. కళ్ళు మాత్రం తెరచి పరిస్థితిని అంచనా వేసేవాడు సమావేశాల్లో ఎవరన్నా ఇద్దరు గట్టిగా వాదించుకుంటూ వుంటే రెండు పులులు దెబ్బలాడుతుంటే చూసినట్టు చూసే వాడు. వాదనలో ఎవరు గెలిస్తే వారితో తిరిగేవాడు. ఈ సూత్రంరీత్యా అతను మాలో చురుకైన సైనికుడనిగానీ, మందకొడి అనిగానీ అనలేని పరిస్థితి కల్పించాడు. ప్రతి చిన్న విషయాన్ని ఫిర్యాదు చెయ్యడం అతనికి మరో అలవాటు.

మా దళానికి మంచి పేరుండేది, క్రమశిక్షణ కల్గిన దళంగా. మా దళ నాయకుడు ఆ పేరు కాపాడడానికి పాటుపడేవాడు. కానీ ప్రతి రాయికీ పగిలిపోయే తత్వం వున్నట్టే మాలోనూ ఈ మధ్య కొన్ని సమస్యలు తలెత్తాయనుకోండి. కుర్రాడు ఛో తనలోవున్న లిబరలిజం వలన సహజంగానే లీఫావైపు మొగ్గేవాడు.

ఆ రాత్రి సంఘటనలో అతని సుకుమార హృదయం గాయమైంది. యన్ లిబరలిజం గురించి, భూస్వాముల్ని నరికేయడం గురించి మాట్లాడిన మాటలు అతన్ని ఆ రాత్రి నిద్రపోనివ్వలేదు.

దాంతో అతను మర్నాడు లేవగానే లీఫాతో స్నేహం చెయ్యడం ప్రారంభించేడు. లీఫాకి ఈ కుర్రాడితో పెద్దగా స్నేహం చెయ్యాలనే కోరికైతే ఏంలేదు. అతని ఉద్దేశం అయితే ఇది.

'నేనా పలికిమాలినవాళ్ళ జాబితాలో వున్నవాణ్ని. నువ్వా మాజీ ఖైదీవి'. దీన్నే ఛోతో చెప్పేసేడు.

దాంతో యన్ దగ్గర చేరేడు. లీఫా గురించి ఉన్నవీ లేనివీ చెప్పసాగేడు. యన్ లీఫాని గురించి ఛో చెప్పే తేలిక మాటల్ని విని ఆనందించసాగేడు. దాంతో వాళ్ళిద్దరి మధ్య అంతంత మాత్రంగా వున్న సంబంధాలు కూడా బెడిసిపోయాయి. నిజానికి యన్‌కి ఛోమీద పెద్ద అభిప్రాయమేం లేదు. తను విముక్తి ప్రాంతంనించి వచ్చిన సైనికుడు. ఛో చాంకైషేక్ ప్రాంతంలో పట్టుబడ్డ ఖైదీ అనే తేలిక భావం అతని కంఠంలో వినబడేది. ఆ ఆధిక్యతని అపార్థం చేసుకునేవాడు ఛో.

ఇలా అయిదు రోజులు గడిచేసరికి మా నమూనాదళం కాస్తా అంతర్గత గొడవల్లోపడి చితికిపోయే పరిస్థితికి వెళ్ళింది.

* * *

లీ చాంగ్ హూ మా దళ నాయకుడు. మా దళాన్ని అతని స్వహస్తాలతో నిర్మించాడు. దీన్నో మోడల్‌గా తీర్చిదిద్దేడు. అతను దళంలో చోటు చేసుకొన్న ఈ సందిగ్ధ పరిస్థితిని సహించలేకపోయాడు. దీన్ని తొలగించడం కోసం తన ప్రయత్నాలు తాను మొదలెట్టేడు.

లీ చాలా మంచి నాయకుడు. ప్రతి సమస్యను తనదిగా భుజానేసుకుంటాడు. నిజానికి ఒక దళానికి నాయకత్వం వహించడం అంత తేలికైన వ్యవహారమేం కాదు. దళంలో ఉన్న పదిమందికీ పదిరకాల అభిప్రాయాలు ఉంటాయి. ఈ పది అభిప్రాయాల్ని ఒకటిగా నడపడమే దళ నాయకుడి పని.

లీ చున్-హూ చాలా హుందాగా వుండేవాడు. అతని కళ్ళెప్పుడూ ప్రశాం

తంగా వుండేవి. అనుభవజ్ఞుడైన సైనికుడు. అతను ఎవరి సమస్యనైనా సానుభూతితో అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేసేవాడు. అందుకే మా అందర్లో అతనంటే అంత గౌరవం. ప్రస్తుతం తలెత్తిన ఈ గొడవ వలన దళం యుద్ధ రంగంలో వైఫల్యం పొందుతుందేమో అనేదే అతని ఆరాటం. ఛో, యన్, లీఫా ముగ్గురూ ఎవరూ ఎవర్తోనూ మాట్లాడటంలేదు. గార్డు డ్యూటీలు మార్చుకునేప్పుడు కూడా, తిండి దగ్గరా, పడక దగ్గరా కూడా ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు.

దళ నాయకుడు లీ ఇక లాభం లేదని ముగ్గురితో నిర్మొహమాటంగా మాట్లాడాలని నిర్ణయించాడు. యన్‌తో మొదలెట్టాడు. చాలా దీర్ఘంగా చర్చించేడు.

'నేను జనం కోసం పన్జేయదల్చుకున్నాను, అదే చేస్తున్నా' అన్నాడు యన్. 'అంతేగానీ అడ్డమైనవాడూ చేసే అవమానాల్ని సహించలేను. తొందరేముంది రేపు జరగబోయే యుద్ధమే నిర్ణయిస్తుంది ఎవరి పాత్ర ఏమిటో' అని లేచి వెళ్ళి పోయేడు....

తరవాత లీఫాతో మాట్లాడేడు. సిగరెట్ తాగుతూ నిర్లక్ష్యంగానే లీ చెప్పేది విన్నాడు లీఫా. విని "నేను జనంకోసం పోరాడదల్చుకున్నా జనంకోసం పన్జెయ దల్చుకున్నా, వన్నలా లెక్కేస్కో" అని వెళ్ళిపోయేడు.

కుర్ర ఛో సమాధానం కూడా అదే. 'జనం కోసమే నేపన్జేస్తున్నా' అనే. కాకపోతే అతను 'నేను మీతో కలవకముందు పెద్దగా ఈ విషయాలన్నీ అర్థం చేస్కోలేదు కానీ ఇప్పుడు అర్థమౌతున్నాయి. నేను జనం కోసమే పన్జేస్తున్నా' అన్నాడు.

మొత్తం మీద ముగ్గురూ చెప్పిన సమాధానం ఒక్కటే 'జనంకోసం పన్జేస్తాం' అని. దాంతో లీ ఆందోళన అసహనంగా మారింది. లీ తనలో తనే ఇలా గొణుక్కున్నాడు.

"వీళ్ళు ముగ్గురూ తమని తాము గొప్పవాళ్ళు అనుకుంటున్నారు. జనాన్ని నిర్లక్ష్యం చేసి" అని.

సరిగ్గా అదే సమయంలో రెజిమెంటల్ కమాండర్ 'హృదయాలు విప్పండి'

ఉద్యమం మొదలు పెట్టేడు. అప్పటికే చాలా దళాల్లో మొదలైంది. అంతరంగ మథనాలు బైటపడి చెప్పిన వాళ్ళూ, వాళ్ళ మాటల్లో చోటుచేసుకున్న వాళ్ళూ కూడా ఏడ్చేయడం మొదలెట్టారు. మా రాజకీయ శిక్షకుడు మాతో మమ్మల్ని విమర్శ-ఆత్మ విమర్శ సమావేశం కోసం తర్ఫీదు చెయ్యటానికి వచ్చి మాలో ఏర్పడ్డ ఈ కొత్త పరిస్థితిని గమనించి బాధపడ్డాడు. దళ నాయకుడు లీ మూడు రోజుల్లో పరిస్థితిని చక్కపరుస్తానని రాజకీయ శిక్షకుడికి మాటిచ్చేడు.

ఏం చెయ్యాలి? అనేది పాపం లీకి కూడా తెలీదు. లీ వాళ్ళ ముగ్గుర్నీ ఒకచోటికి పిల్చి అడిగేసేడు. ఎందుకు మీరు కల్సి వుండలేకపోతున్నారు? అని. సమాధానం మామూలే. చాలా సేపు మాట్లాడి దళానికి వున్న మంచి పేరు నిలపండని కోరి ముగించాడు. కాని మర్నాటి నుంచీ పరిస్థితి షరా మామూలే. ఎడమొహాలూ, పెడమొహాలూ. సరిగ్గా ఇంతలోనే మేం యుద్ధరంగంలోకి వెళ్ళాల్సొచ్చింది. ఈ గొడవలన్నీ మరుగున పడ్డాయి. ఏమైనా ఈ అనైక్యతకి పరిష్కారం అంత త్వరగా దొరకదనే అనుకున్నాం.

యుద్ధం మొదలైంది. మూడో రోజు నడుస్తోంది. ఆ రోజు ముసురు పట్టి వుంది. మేం ఒక గ్రామ ఉమ్మడి స్మశానం లోంచి నడుస్తున్నాం. లీ అందరి కంటే ముందు నడుస్తున్నాడు. ఇంతలో అతని చూపులు ఒక ఎముక మీద పడ్డాయి. అతను ఆగి దాన్ని తీసి పరిశీలించసాగేడు. అందరూ ఆగి ఉత్కంఠగా గమనించసాగేరు.

'ఈ ఎముక ఎవరిదో చెప్పగలరా?' అని ప్రశ్నించాడు.

కొందరు అది ధనవంతునిదని అంటే మరి కొందరు అది పేదవాడిదన్నారు.

చివరగా లీ తన అభిప్రాయం చెప్తూ

"ఇది పేదవానిదే అయి వుంటుంది. ఎందుకంటే గొప్పోళ్ళ ఎముకలు సమాధుల్లో వుంటాయి. పేదోళ్ళ ఎముకలే ఇలా వాళ్ళ జీవితాలలాగే వానకి తడిసి ఎండకి ఎండుతుంటాయి" అన్నాడు.

తరవాత మేం మా క్యాంప్‌కి చేరాం. ఎవరి పన్లు వాళ్ళు చేసుకుని నిద్రకుపక్రమించారు. ఛో ఒక్కడూ కాంగ్ మీద పడుకోడం గమనించిన లీ అతన్తో మాట కలిపాడు.

'మానవ స్వభావమే అంత. ఎప్పుడైతే కలిసివుంటామో అప్పుడే దెబ్బలాటలు పుడతాయి. రా.....నన్ను ఎదుర్కో' అని ఛోతో మల్లయుద్ధం చేసి అతన్ని కింద పడేసేడు. కింద పడ్డ ఛో లీతో స్వచ్ఛంగా మాట్లాడనారంభించేడు. తన కన్నీళ్ళకీ కష్టాలకి కారణం అన్నీ మాట్లాడసాగేడు. అప్పటిదాకా చెప్పని విషయాలు. ఈ కుర్రాడి కథంతా రాజకీయ శిక్షకుడికి చెప్పేడు లీ. ఆయనా చలించిపోయేడు. లీ ఛో కోసం రెండు గుడ్లు తెచ్చి ఇచ్చాడు. ఛో ఆ పాత్రని అందుకుని ఎక్కిళ్ళు కొట్టసాగేడు.

అయితే, ఛో లీకి చెప్పిన కథ తరవాత చెప్పుకుందాం.

* * *

యన్ మెదడు తీవ్రమైన ఆలోచనల్తో నిండివుంది. అతను ఏకాంతాన్ని కోరుకుంటున్నాడు. చాలా నెమ్మదిగా ధాన్యం నిలువచేసిన పురివైపు నడవసాగాడు. సరిగ్గా అదే సమయానికి మరోవైపు నించీ లీఫా కూడ అక్కడకే చేరేడు. ఇద్దరూ ఒకరితో ఒకరు కలబడ్డారు. నడిఒడ్డున చేరి ఇద్దరూ ఒకర్తో ఒకరు కలబడి కొట్టుకోసాగేరు. దళ నాయకుడు లీ వాళ్ళకోసం వెతుకుతూ అక్కడికి చేరేడు. ఇద్దర్నీ విడదీసి కాంప్‌కి తీసుకువచ్చాడు. ఆ రాత్రి ఇద్దరూ ఖాళీ కడుపుల్తోనే పడుకున్నారు.

* * *

ఒక రాత్రి దళనాయకుడు లీ సభ్యులందరూ పడుకుని వున్న సమయంలో దీపం వెలుగులో అందరి బూట్లూ పరిశీలించి, బాగులేని వాటిని బాగుచెయ్యసాగాడు. నిదానంగా ఛో లేచి సాయం చెయ్యబోయేడు. లీ నవ్వుతూనే వారించేడు. తర్వాత యన్, లీఫా ఇద్దరూ కూడా సాయం చెయ్యబోయి లీ తో తిట్లుతిని పడుకున్నారు. లీ వాళ్ళతో 'మీరంతా అలసి వున్నారు. దయచేసి నిద్రపోండి. ఎవరూ మీవి కాని పన్లలో వేళ్ళు పెట్టకండి' అని చెప్పి తన పని తాను చేసుకోసాగేడు. నిజానికి అప్పటికి ఎవరూ నిద్రపోవడం లేదు. కానీ అంతా నిశ్శబ్దంగా వుంది. వున్నట్టుండి నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ ఛో పెద్దగా ఏడ్వసాగాడు. ఎక్కిళ్ళమధ్య తన కథని మా అందరికీ చెప్పసాగాడు.

'నా తండ్రి పశువుల కాపరి. ఓ రోజున ఓ పంది తప్పిపోయిందని యజమాని ఆయన్ని కొట్టాడు నా తండ్రి చనిపోయాడు. ఆయన్ని మేం సమాధి చెయ్యాలనుకుంటున్న సమయంలోనే నన్ను బలవంతంగా కొమింగ్‌టాంగ్ ఆర్మీ ఎత్తుకొచ్చే

సింది. నేను వాళ్ళతో చాలా సార్లు దెబ్బలాడేను మా నాన్న శవం చూస్తానని. కాని వాళ్ళు ఏముంది అక్కడ చూడడానికి అనేవాళ్ళు. నన్ను కొట్టేవాళ్ళు. ఇదంతా నడిచి రెండేళ్ళు దాటిపోయిందనుకోండి, నా కిప్పటికీ ఓ సందేహం మా నాన్న శవం ఏమైందో అని. ఎండకి ఎండి వానకి తడిసి ఎముకలు...."

ఇక చెప్పడం అతనివల్ల కాలేదు. కిందపడి ఏడుస్తున్నాడు. యన్ తన చేతుల్తో అతన్ని కౌగలించుకుని తల నిమరసాగాడు.

"నన్ను క్షమించు చిన్నారి ఛో....నన్ను క్షమించగలవా?" అని గొణుగుతున్నాడు యన్ "నేనూ కౌమింగ్‌టాంగ్ ప్రాంతం నించి వచ్చినవార్ని అసహ్యించుకునేవాణ్ణి. కానీ అదే సమయంలో అక్కడా పేదలున్నారని, బాధితులున్నారనీ గుర్తించలేదు. నేను మూర్ఖుడ్ని" అని గట్టిగా అరిచాడు. యన్ కళ్ళు వర్షిస్తున్నాయి. అతని గుండెల కానుకుని ఛో ఏడుస్తున్నాడు. వున్నట్టుండి యన్ గొంతు స్ఫుటంగా పలికింది.

'ఒక పశువుల యజమాని, ఒక భూస్వామి నీ తండ్రిని చంపేసేడు కదూ! నా తండ్రినీ ఓ కామందు రాక్షసుడు చంపేసేడు. అప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు. నా తండ్రిని బలవంతంగా బానిసగా లాక్కెళ్ళిపోయాడు వాడు. నా తల్లిని చెరిచి విషం పెట్టి చంపేసాడు వాడే. నా సోదరుడ్ని చంపేసాడు. నేనివన్నీ ఈ కళ్ళతో చూసేను బతుకుకోసం పారిపోయాను. చచ్చిపోదాం అనుకున్నా—కానీ....నేను చచ్చిపోతే 'యన్' కుటుంబంలో మిగిలిన ఒక్కడ్ని లేకుండాపోతాను. మరి ఆ భూస్వామి మీద పగెలా తీర్చుకోవాలి? అందుకే ముష్టెత్తుకుని బతికాను. పశువుల కొట్టాల్లో పడుకున్నాను. జనం దీపాలు తగ్గించేదాకా అగి వాళ్ళ పశువుల కొట్టాల్లోకి జొరబడి నిద్రపోయేవాణ్ణి...."

ప్రతి ఒక్కరూ ఏడుస్తున్నారు. లీఫా తప్ప. మేమంతా కల్సే వుండేవాళ్ళం గానీ మేమెప్పుడూ ఇప్పటిలా దగ్గరితనాన్ని అనుభవించలేదు. యన్ ఛోని తన తమ్ముడిలాగా నిమిరి "నువ్వు నీ గురించి చెప్పినప్పుడే నాకు తెల్సింది ఈ భూమ్మీద అంతటా దోపిడీకి గురైయ్యేవాళ్ళ జీవితాలన్నీ ఒకేలా వుంటాయని" అన్నాడు.

'అవును నువ్వన్నది నిజమే'-ఛో. 'నువ్వు మాట్లాడిన తర్వాతనే నాకర్థమైంది. పేదలే పేదల్ని విముక్తి చేస్తారని మన ఎర్రసైన్యం పేదలదే. మనమంతా పేదలమే" దాదాపు అరచి చెప్పేడు ఛో.

"అవును మనం అంతా పేదలమే మన బాధలు మనతో మనం కాక ఎవరు పంచుకుంటారు?" అడిగేడు మా దళ నాయకుడు లీ.

ఆ అర్ధరాత్రి చాలామంది సుఖంగా నిద్రపోతూండవచ్చు. కానీ మేం మాత్రం మా గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న బాధల్ని, కన్నీళ్ళని, నెత్తుటిని కలబోసుకున్నాం.

* * *

లీఫా మెదడుపై కూడా పెద్ద భారముంది. కాని అతను దాన్ని దింపుకోడానికి సిద్ధంగా లేడు. రాత్రంతా తన సహచరులు చెప్తున్న విషయాల్ని వింటూన్నపుడు తనమీద తనకే అసహ్యమేసింది. తను ఏమి చెప్పలేదంటే తాను వాళ్ళకంటే గొప్ప వాణ్ణయినా అయివుండాలి. లేదా తన జీవితం పూల పాన్పు అయినా అయుండాలి.

నిజానికి అతను చిన్నతనం నించే చాలా స్వేచ్ఛగా జానపద పాటలు పాడు కుంటూ, డాన్సులు చేస్తూ బాధ్యతారహితంగా పెరిగేడు. అలాంటి లీఫాని అప్పు లున్నాయని ఆస్తి లాక్కుని బికారిని చెయ్యటం ఏమంత కష్టం కాలేదు అతని ఊరి భూస్వామికి. కట్టు గుడ్డలు కూడా లేకుండానే రోడ్డు మీదకు చేరేడు. దరిద్ర దేవతకి తన భార్యని అప్పజెప్పేసేడు. అప్పట్నించీ అతను మానసిక ఒత్తిడికి లోనై స్తబ్దంగా బతుకుతున్నాడు. ప్రతీకార ధోరణి కూడా సన్నగిల్లింది అతన్లో. ఎర్రసైన్యానికి సంబంధించీ, కమ్యూనిస్టు పార్టీ కి సంబంధించీ అతను దాదాపు లేడు.

దాదాపు ఇన్ని సంవత్సరాల సైనిక జీవితంలో మొదటిసారిగా లీఫా తను విప్లవానికి ద్రోహం చేస్తున్నానని అనుకున్నాడు. తనకి తానే ద్రోహంచేసుకుంటున్నా ననుకున్నాడు. రాత్రంతానిశ్శబ్దంగా వున్నాడు. అతనికిప్పుడు అనిపిస్తోంది ఒకటే. "నా జీవితం ఇప్పటికే చాలా హీనమైపోయింది. ఇప్పటికైనా ఏదో ఒకటి చేయక పోతే నా జీవితం నాకు దక్కదు" అని.

అన్నీ గుర్తు రాసాగేయి. తన పై కామ్రేడ్లు తన్ని మార్చడానికి పాపం ఎంత శ్రమ పడ్డారు. తల్చుకుంటే చాలా బాధేస్తోంది. ఛో పిచ్చికుర్రాడు వాడి జీవితం చూడు ఎంత క్రూరంగా వుందో. యస్.... యస్.... ప్రియమిత్రుడా అని అతని చేయిని తన చేతిలోకి తీసుకోవాలన్పించింది.

"తొందరేంలేదు. చూద్దాం— చూద్దాం—" అని గొణుక్కుంటూ మగత లోకి జారిపోయేడు.

* * *

కొద్ది రోజుల తర్వాత మేం మళ్ళీ రణరంగం చేరేం. ఎదురుగా శత్రువు విజృంభిస్తున్నాడు. నాల్గో నంబర్ స్క్వాడ్ దెబ్బతింది. దాంతో మేం ముందుకు రావాల్సి వచ్చింది. మా దళ నాయకుడు లీ మమ్మల్ని ఉద్దేశించి

"కామ్రేడ్స్ ! మర్చిపోకండి మనం ఆరోజు రాత్రి కలబోసుకున్న జీవితాల్ని. రండి పగ తీర్చుకుందాం. మన జీవితాల్ని మనకు కాకుండా చేసిన ద్రోహులపై— రండి సోదరులారా !" అని అరిచేడు.

వింటి నుండి ఒకేసారి వెలువడ్డ పది బాణాలలాగే మేం శత్రువుపై పడ్డాం. మా పొలిటికల్ ఇన్స్ట్రక్టర్ శీ తో "మనం సాధించాం" అన్నాడు. దానికి సమాధానంగా లీ "అంతేకాదు మేం కల్సి పగ తీర్చుకుంటున్నాం" అన్నాడు.

యస్ నిర్మూలనా దళానికి నాయకత్వం వహిస్తూ శత్రువుపై విరుచుకుపడుతున్నాడు. దళం కళ్ళన్నీ అతని మీదే వున్నాయి. వున్నట్టుండి యస్ తన పేలుడు సామాగ్రితో శత్రుదళంలో చొరబడ్డాడు. అతనితోపాటు వెళ్ళిన ఛో తో సహా యస్ శతృవలయంలో చిక్కుకున్నాడు. గాలి బుల్లెట్లతో బరువెక్కింది. పరిస్థితిని గమనించిన లీఫా లీ వంక చూసి 'రా నా కొక మిషన్‌గన్ ఇవ్వు నే వెళ్తున్నా తిరిగి రావడం అంటూ వుంటే వాళ్ళిద్దరితోనే' అంటూ లీ వంక చూసేడు. లీ అప్పటికే ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దర్ని గురించి ఆలోచిస్తూ లీఫా రిస్కుని ఒప్పుకోలేదు. లీఫా ఎదురు చూడలేదు. దూకుడుగా తన టామీ గన్‌తోనే వెళ్ళి కిందపడి దొర్లి యస్ వైపు చేరేడు. లీ వాళ్ళనే చూస్తున్నాడు.

ప్రస్తుతం ఆ ముగ్గురు సైనికులూ చుట్టూ బుల్లెట్లతో బంధింపబడి ఉన్నారు. ఒక్క బుల్లెట్ గనక తగిలి ఎవరి తుపాకి అయినా చెడిపోయినా, కింద పడినా వాళ్ళు బైట పడడం సాధ్యంకాని విషయం. అప్పటికే ఓ బుల్లెట్ యస్ భుజాన్ని గాయపర్చింది. గుండెల దగ్గర బాంబుల్ని తడిమి చూసుకొని ముందుకే పోతున్నాడతను. ఆ సమయంలో లీఫా యస్ ఒకొర్నొకరు చూసుకున్నారు. ఆ ఒక్క చూపుతో వాళ్ళు ఎంతో మాట్లాడుకున్నారు.

లీఫా అరిచేడు.

"ఎలా వుంది ?"

యస్ పళ్ళ బిగువున బాధను అణచుకుంటూ "రా ముందుకు పోదాం వెనక్కి తిరగవద్దు" అన్నాడు.

సరిగ్గా ఇంతలో ఛో తొడలో దిగిందో బుల్లెట్. గాయం పెద్దదే నెత్తురు స్రవిస్తుంది. లీఫా వెంటనే అతన్ని చేరేడు. ఛోని ఎత్తుకుని కొంచెం ముందుకు కదిలాడు.

"ఎలా వుంది పరిస్థితి" అడిగేడు లీఫా

"నా కాలు కదిలే పరిస్థితిలో లేదు" - ఛో

"నువ్వు తుపాకీ కాల్చగలుగుతావా?"

"ఊఁ—"

"అయితే నిన్నిక్కడ కూర్చోబెడతాను. నువ్వట్నుంచి కాల్పులు జరుపు నేనటువెళ్తా. ఒకవేళ మనం చచ్చినా యన్ పని పూర్తి చేస్తాడు ఏమంటావ్?"

కుర్ర ఛో, లీఫా ఇద్దరూ చెరోవైపు నించీ కాల్పులు జరుపుతున్నా నిలవడం కష్టంగానే వుంది. బుల్లెట్లు తెప్పలు తెప్పలుగా వస్తున్నాయి. మెషీన్ గన్లు నిప్పులు కక్కుతున్నాయ్. అక్కడ ప్రతి అంగుళం నేల మండుతోంది. లీఫా వేసుకున్న డ్రస్‌కి నిప్పంటుకోవడం మాకు కనిపించింది. ఛో జుట్టు వాలిపోవడం చూసాం.

మేమున్న చోటినుంచే వారి కదలికలు ఏమీ కనబడలేదు. హృదయాలు రోదించేయి. మా దళ నాయకుడు లీ మరో 'నిర్మూలన దళాన్ని' తయారుచేస్తూ లీఫా, యన్, ఛోలు అంతిమ శ్వాస విడిచి వుంటారనే భావించాడు. కాని, అంతలో—

లీఫా టామీ గన్ అరుపులు వినబడ్డాయ్ మాకు. సరిగ్గా మేం అక్కడికి చేరే సరికే యన్ తన ఒంటికున్న బాంబుల్తో సహా శత్రు కూటమిలోకి వెళ్ళి బాంబింగ్ చెయ్యసాగేడు. మంటలు ఆకాశంలోకి చేరుతున్నాయి. పొగ ఆ ప్రాంతమంతా ముట్టేసింది. శత్రుకూటమి బ్లాస్ట్ అయిపోతుంది.

* * *

ఆ విజయంతో ఒక శత్రు డివిజన్‌ని ధ్వంసం చేశాం. యాభై ఎనిమిది మందిని ఖైదీలుగా పట్టుకున్నాం. ఆ అపూర్వ విజయానికి గుర్తుగా చిన్న వేడుక జరిపాం. మా పొలిటికల్ ఇన్స్‌స్ట్రక్టర్ యన్‌ని, లీఫానీ, ఛోనీ వేదిక మీదికి పిల్చి ఎర్ర బాడ్జీలతో అలంకరించాడు:

ఆ అజేయ సైనికులు ముగ్గురూ ఒకర్నొకరు చూసుకున్నారు. మాలో ప్రతి ఒక్కడూ ఆనందంతో చప్పట్లు చరిచాం. వాళ్ళు ముగ్గురూ కల్సి

కన్యాశుల్కం - రసచర్చ

హరి

'కన్యాశుల్కం' తొలి కూర్పుకూ, మలి కూర్పుకూ ఉన్న ముఖ్యమైన భేదం ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం ఒక ముక్కలో చెప్పొచ్చు: ప్రపంచం. తొలి 'కన్యాశుల్కం'లో ఇతివృత్తమూ, కథా....రెండో 'కన్యాశుల్కం'లో కూడా ఉన్నాయి. అయితే రెండో 'కన్యాశుల్కం'లో కథతోపాటు, ఇతివృత్తంతోపాటు, పాత్రలతోపాటు విస్తృతమైన ప్రపంచం కూడా ఉంది. రెండో 'కన్యాశుల్కం'లోని పాత్రలు సమకాలీన ప్రపంచంలోని పాత్రలు. మొదటి 'కన్యాశుల్కం'లోని పాత్రల కంత ప్రపంచ స్పర్శ లేదు. 'కన్యాశుల్కం' ప్రత్యేకత ఆ ప్రపంచంనుంచి సంక్రమించినదే. ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే 'కన్యాశుల్కం'లోని పాత్రలనూ, సన్నివేశాలనూ విశ్లేషించడం సులువే. అలాకాక 'కన్యాశుల్కం' ఒక నాటకం మాత్రమేనని భావించినప్పుడు దానిని సమర్థించేవారూ, దానిని ఖండించేవారూ ప్రమాణాలు అలంకార శాస్త్రాలలో లభించుతాయని ఆశపడడం సహజం.

సరిగ్గా అలాగే జరిగింది. 1920 ప్రాంతాల నుంచి 1955 వరకూ 'కన్యాశుల్కం' స్థానాన్ని నిర్ధారించే ప్రయత్నం చేసిన వారందరూ అలంకారశాస్త్ర పరిధిలోనే ఆలోచించారు. 'కన్యాశుల్కం' అసలు నాటకమే కాదని స్థాపించిన కేతవరపు రామకోటిశాస్త్రిగారు దానిలో రసం మాత్రం హాస్యరసమేనని ఉదారంగా అంగీకరించారు. 1945లో అయ్యల సోమయాజుల నరసింహశర్మగారు 'తెలుగుతల్లి'లోనూ, శ్రీశ్రీ 'ఆనందవాణి' (వారం వారం)లోనూ 'కన్యాశుల్కం' బీభత్సరస ప్రధానమని రాశారు. అ. న. శర్మగారు అలంకారశాస్త్ర పరిధిలో 'కన్యాశుల్కం'

"ఈ గొప్పంతా మన దళ నాయకుడు లీ డి" అని ఒకే గొంతుతో అరిచారు.

వెంటనే లీ లేచి నిలబడి

"మనందరం పేదలం, మనందరం బాధితులం. కాని, మన బాధల్ని, గాథల్ని శక్తిగా మార్చుకుందాం. కలిసి కదులుదాం. అప్పుడు మనం అజేయులం అవుతాం" అని చెప్పేడు.

(అను: భరద్వాజ)

బీభత్సరస ప్రధానమని వ్యాఖ్యానించారు. బీభత్సరసం స్థాపించడానికి అవసరమైన ఉద్దీపకాలు కన్యాశుల్కంలో ప్రత్యక్షంగా లభించకపోయినా ఆ రసపు స్థాయీ భావమైన జుగుప్సను మాత్రం రామప్పంతులు, లుబ్ధావధానులు మొదలైన పాత్రలు కలుగజేస్తాయని ఆయన తీర్మానించి బీభత్సరసమే కన్యాశుల్కంలోని రసమని నిర్ణయించారు.

శ్రీశ్రీ అలవోకగా "శిథిలమైపోతున్న ఒక సమాజం కలిగించే నిర్వేదం బీభత్సరసమే"నని చెప్పి వూరుకున్నాడు. శ్రీశ్రీ ఈ "బీభత్సరసాన్ని" అ. న. శర్మ గారి వద్ద నుంచి తస్కరించాడని అప్పటినుండి ఇప్పటిదాకా అంటున్న పెద్దలు అనేకులు.

శ్రీశ్రీకి బీభత్సరసానికి ఉన్న 'సాన్నిహిత్యం' మహాప్రస్థానం, ఖడ్గసృష్టి మొదలైన రచనలు చదివిన వారికి సుస్పష్టమే. రెండు ప్రపంచ యుద్ధాలు, వాటిమధ్య వచ్చిన ఆర్థిక మాంద్యం, ఫాసిజం-నాజీజం ఉధృతి, యుద్ధానంతర శిథిల ప్రపంచమూ జీవితాన్ని నిజంగానే బీభత్సం చేశాయి. ఈ బీభత్సానికి ప్రతిస్పందనలుగా వచ్చిన అనేక కళావాదాలు డాడాయిజం, సర్రియలిజం, ఎక్స్‌ప్రెషనిజం వగైరా. ఇవన్నీ చూసిన, "అనుభవించిన" శ్రీ శ్రీకి బీభత్సరసమంటే ఉండే దృష్టి అలంకార పరిధిలోనిది కాదు. "కన్యాశుల్కం" గ్రంథాన్ని బీభత్సరస ప్రధానమైన విషాదాంత నాటకంగా ఇప్పటికీ అభివర్ణించడం మానలేను. ఇందులోని బీభత్సం మన జీవితాల లోనిదే ఇందులోని విషాదం మన జీవితాలదే. అయితే గ్రీకు ట్రాజెడీల్లాగా, షేక్స్ పియర్ ట్రాజెడీల్లోలాగా తెర ఆఖరుసారిగా పడిపోయేసరికి స్టేజినిండా శవాలు నిండే ట్రాజెడీకాదు 'కన్యాశుల్కం'— అంటాడు శ్రీశ్రీ. 'ఇరవై కొమ్ముల అరవై కోరల.... కర్కాటక కర్కోటకుల' బీభత్స రూపాలను చూసిన శ్రీశ్రీ 'కన్యాశుల్కం'లో బీభత్సరసాన్ని గుర్తించడం ఆశ్చర్యమూ కాదు. అతిశయోక్తీ కాదు. సర్రియలిస్టిక్ చిత్రాలనూ, పదచిత్రాలనూ దర్శించిన శ్రీశ్రీకి కన్యాశుల్కం బీభత్సరస ప్రధానంగా కనబడడం సహజమే. క్షణక్షణానా అగచాట్లు పడుతూ, పూటకూళ్ళమ్మ దగ్గర నుండి, శిష్యుడు మహేశం వరకూ....అందరూ "హింసించే" రామప్పంతులుది విషాదం కాదా! అతని జీవితమే ఒక బీభత్సం కాదా? శుభమా అని మూడో పెళ్ళి చేసుకున్న లుబ్ధావధాన్లుకు పెళ్ళికూతురి (?) మొదటి మొగుడు (?) కలలో కనపడి

పేక పిసుకుతాననడం బీభత్సమే. జటాంతస్వాధ్యాయి అగ్నిహోత్రావధాన్లు, రామప్ప పంతులు వెంట వీధుల గుండా తిరుగుతూ ఆఖరికి సానికొంపకు కూడా వెళ్ళడం విషాదమే కదా! ఈ లెక్కన వరుసపెట్టి పరిశీలించుతూ పోతే సౌజన్యారావు పంతులు, కరటకశాస్త్రి, గిరీశం, వెంకటేశం మొదలైన ముఖ్యపాత్రలన్నీ ఎక్కడో ఒకచోట 'అడకత్తెర'లో చిక్కుకున్న పాత్రలే. అందుకే శ్రీశ్రీ దాన్ని బీభత్సరస ప్రధానం అన్నాడనిపిస్తుంది. కాదూ! అ. న. శర్మగారి దగ్గర 'తస్కరించిన ప్రకారమే' 'కన్యాశుల్కం' బీభత్సరస ప్రధానమని శ్రీశ్రీ అని ఉంటే తప్పుకాదు డబ్బిల్ తప్పు. అ.న. శర్మగారు అలంకారశాస్త్ర పరిధిలో 'కన్యాశుల్కం' బీభత్సరస ప్రధానం అనడంలో మరో చిన్న పొరపాటు ఉంది. బీభత్సరసానికి స్థాయి జుగుప్స అని కదా సూత్రీకరణ. జుగుప్స కొన్ని పాత్రల ప్రవర్తనపట్ల కలుగుతుంది అని కదా ప్రతిపాదన! ఆయా పాత్రలపట్ల జుగుప్సతోపాటు లేశమంత జాలి, కరుణ కూడా కలుగుతున్నాయి కదా! జుగుప్స ఆ మేరకు తొలిగిపోతుంది కూడా. అందు వలన 'కన్యాశుల్కం'లో బీభత్సరసం వేరే తరహాకి చెందింది కావాలి.

అయినా ఆధునిక సాహిత్య ప్రక్రియను దేన్నైనా విశ్లేషించేటప్పుడు అలంకారశాస్త్రం సరియైన పరికరం కాజాలదు. ఎందుకంటే రచయిత ఆ పరిధిని లక్షణంగా భావించి తన రచన కొనసాగించాడా లేదా అన్న సమస్య ఉండనే ఉంటుంది. 'కన్యాశుల్కం' నాటకాన్ని 1897లో అచ్చువేసినప్పుడు అలాంటి అలంకారిక నియమాలేవన్నా ఉండి ఉంటే గింటే, 1909 నాటి కన్యాశుల్కంలో ఆ నియమాలన్నింటినీ విశాలమైన జీవితం తుడిచిపెట్టేసిందని చెప్పాలి. తొలి కన్యాశుల్కం స్వరూపం మార్చుకుని రెండో కన్యాశుల్కంగా ఆవిష్కారం కావడానికి అలంకారశాస్త్రాలిలా, కళాసిద్ధాంతాలా కారణం కానే కావు జీవితంపట్ల అనురక్తి, జీవితంపట్ల నిబద్ధత....ఆ నాటక విన్యాసానికి మూలకారణాలు. కథకూ, ఇతివృత్తానికీ సంబంధం లేనట్లు కనబడే పేకాట దృశ్యం, సారా అంగడి దృశ్యం, కోర్టుసీనూ, ఆ జీవితాన్ని సమగ్రంగా చూపడానికే గురజాడ సృష్టించాడు. (కాదు చిత్రించాడు). బహుముఖమైన జీవితంలో ఒక రసం మాత్రమే ఉండదు. ఎన్ని రసాలైనా ఉండొచ్చు, ఉంటాయి. అయితే ఒక మహాకావ్యాన్నో, నాటకాన్నో, నవలనో చదివి నప్పుడు మాత్రమే ఒక సమగ్ర జీవితాన్ని - సమగ్ర సత్యాన్ని దర్శించిన అనుభూతి కలుగుతుంది. మనకు కలవరం కూడా కలుగుతుంది. 'కన్యాశుల్కం' చేసే పని అదే.

అభివృద్ధి - వెలుగు నీడలు

ఎస్. ఆర్కె

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత వలస పాలన నుంచి విముక్తి చెందిన దేశాల్లో జరుగుతున్న "అభివృద్ధి"ని గురించి దాని స్వభావాన్ని గురించి ఇంగ్లీషు భాషలో వందల కొద్దీ పుస్తకాలు వచ్చాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను శాశ్వతమైనదిగా భావించి దానికి సంబంధించిన అంశాలు మూడో ప్రపంచ దేశాల్లో ఏ మేరకు అభివృద్ధి అయ్యాయో బేరీజు వేస్తూ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు చాలా పుస్తకాలు రాశారు వీటి గురించి ప్రస్తుతం మనం పెద్దగా పట్టించుకోనవసరం లేదు. వాటికి భిన్నంగా 1965 సంవత్సరం తర్వాత అనేక మూడో ప్రపంచ దేశాల్లో అక్కడి స్థానిక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాలు ప్రజ్వరిల్లిన అనంతరం అక్కడి "అభివృద్ధి క్రమం-అభివృద్ధి స్వభావం" అన్న అంశాలపై మార్క్సిస్టు మేధావుల మధ్య చర్చలు ఆరంభమైనాయి. ఈ చర్చలు అనేక అంశాలపై చాలా తీవ్రంగా కొనసాగాయి ఇంకా కొనసాగుతున్నాయి కూడా. మూడో ప్రపంచ దేశాల్లోకి సామ్రాజ్యవాద దేశాల నుంచి వస్తున్న పెట్టుబడి ప్రవాహం; ఆర్థిక వ్యవస్థలపై దాని ప్రభావం; వెనకబడిన దేశాల్లో జరుగుతున్న పారిశ్రామిక వ్యవసాయక అభివృద్ధి స్వభావం; వ్యవసాయ రంగ సర్వతోముఖ అభివృద్ధికి అవరోధంగా నిలచిన సంప్రదాయక ఉత్పత్తి సంబంధాలు; ఆధునిక శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక ప్రగతికి అటంకంగా వున్న మధ్య యుగ సామాజిక భావ జాలం; విదేశీ రుణాల ఊబిలో ఆర్థిక వ్యవస్థలు కూరుకుపోవటం; ఆర్థిక రాజకీయ

ఒక మహాప్రవాహం ముఖ ద్వారం దగ్గర నుంచుంటే వచ్చే అనుభూతి 'కన్యాశుల్కం' ఆఖరి దృశ్యం ముగిసినప్పుడు మనకు కలుగుతుంది.

హాస్యం, కరుణ, విషాదం, భయం ఇలా రకరకాల అనుభవాలు పాత్రలకు ఎదురౌతుంటే పాఠకుడికి నానావస్థ కలుగుతుంది. కన్యాశుల్కంలో ఏ పాత్రస్థానాన్ని మనం స్వీకరించినా జీవితం మధ్యనున్న అనుభూతి కలగక తప్పని స్థితిలో పడతాం. కన్యాశుల్కం నాటకం కాదు. నవల.

సంక్షోభాల నుంచి సైనిక నియంతృత్వాలు ఏర్పడటం - వీటన్నింటికీ ప్రతిస్పందనగా సామాజిక ఆర్థిక న్యాయాన్ని డిమాండు చేస్తూ తిరుగుబాటు ఉద్యమాలు తలెత్తటం లాంటి విషయాలన్నీ ఈ చర్చల్లో చోటు చేసుకున్నాయి. దురదృష్టం ఏమిటంటే ఈ చర్చల సారాంశం గాని వివరాలు గాని తెలుగు పాఠకులకు ఇంతవరకు తగినంతగా లభ్యం కాలేదనే చెప్పాలి. ఆర్. ఎస్. రావు రాసిన "అభివృద్ధి - వెలుగు నీడలు" అనే ముప్పయి పేజీల చిరు పుస్తకం ద్వారా ఈ కొరత తీరింది అని అనుకోవటం దురాశే అవుతుంది. అయితే ఈ పుస్తకం గొప్పతనం ఏమిటంటే మనం అభివృద్ధికి విఘ్నాలుగా భావించే అంశాలపై పీడిత ప్రజల ప్రయోజనాల నుంచి చర్చలు జరప టానికి ఒక ప్రాతిపదికను సమకూర్చటం.

ప్రాతిపదికను అందిస్తోందని ఎందుకంటున్నానంటే సమాజ ఆర్థిక జీవితంలో కీలక పాత్ర వహించే పారిశ్రామిక - వ్యవసాయ రంగాల్లో జరుగుతున్న "అభి వృద్ధి"కి ఇతర రంగాల్లో వస్తున్న పరిణామాలకి వున్న సంబంధాలను చూపటంలో ఈ పుస్తకానికి చాలా ప్రాధాన్యత వుంది. పుస్తకంలో నుంచి కొన్ని వాక్యాలు ఉటంకిస్తే ఈ విషయం ఇంకా బాగా అర్థం అవుతుంది. "ఇటీవల కాలంలో మన దేశంలోనూ, రాష్ట్రంలోను జరిగిన అనేకానేక సంఘటనలు ఏదో ఒక రూపంలో అభివృద్ధి కార్యక్రమంతో ముడిపడినవే భోపాల్‌లో పురుగుల మందు తయారుచేసే ఫ్యాక్టరీలో విషవాయువు వేలాదిమంది ప్రజల్ని హత్య చేసింది. ఆ క్రిమిసంహారక మందు మనదేశంలో వ్యవసాయ ఉత్పత్తి అభివృద్ధిలో అనివార్యమైన భాగం— దళితులపై అమానుష హత్యకాండ జరిగిన కారంచేడు మన రాష్ట్రం సాధించిన వంద సంవత్సరాల అభివృద్ధికి ప్రతీక. ఇరిగేషన్ సౌకర్యాలు, కొత్తరకం ఉత్పత్తి సాధనాలు, వ్యాపార పంటలో ఫలితంగా జనించే అదనపు మొత్తం (Surplus) తో ఇతర ప్రాంతాలకు ప్రవహించిన పెట్టుబడి - యెన్నో స్థూలమైన పరిణామాలను మనం సూక్ష్మంగా కారంచేడులో చూడవచ్చు. అయితే ఈ అభివృద్ధికి ఆ ఊళ్ళో దళితులు నోచుకోలేదు— హీరాకుడ్ బహుళార్థక ప్రాజెక్టు చుట్టు ఇంకా కరెంటు రాని గ్రామాల్లో బతికే గిరిజనులు, భోపాల్‌లో హరిత విప్లవం హత్యచేసిన ప్రజలు, కారంచేడులో ఇంకా గౌరవప్రదమైన జీవితానికి, ప్రాథమిక స్వేచ్ఛకు నోచు కోని దళితులు, విజయవాడలో కుల రాజకీయ ముఠాతగాదాల్లో బలి అయ్యే ప్రజలు" ఇవి అన్నీ మన అభివృద్ధి క్రమం నుంచి వచ్చినవే ఏమిటీ అభివృద్ధి క్రమం అన్న

ప్రశ్నకు జవాబు చెప్పుకోవాలంటే వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో 1947 తర్వాత వస్తున్న పరిణామాలను స్థూలంగానైనా అర్థం చేసుకుంటే జవాబు దొరుకుతుంది. పారిశ్రామిక అభివృద్ధి అనగానే చాలామందికి వివిధ రకాల ఉత్పత్తుల పరిమాణం పెరగటం వాటిని ఉత్పత్తిచేసే పరిశ్రమల సంఖ్య పెరగటం గానే కన్పిస్తోంది. అలాగే వ్యవసాయరంగం అభివృద్ధి అనగానే 170 మిలియను టన్నులకు చేరుకున్న ఆహారధాన్యాలు, రసాయనిక యెరువులు, పురుగు మందులు వాడకం పెరగటం, ఆధునిక వ్యవసాయ పరికరాల ఉపయోగం పెరగటం, కొత్త పంటలు రావటం లాంటి అంశాలన్నీ ఏకరువు పెడతారు. అకడమిక్ పండితులు, బ్యూరాక్రాట్లు ఇచ్చే గణాంక వివరాలతో మనకి పెద్దగా పేచీ ఉండనక్కరలేదు. మనకి కావల్సిందల్లా ఏమిటంటే వ్యవసాయ రంగంలోనూ, పారిశ్రామిక రంగం లోనూ ఈ పెరుగుదల యెట్లా సాధించేరు? ఈ పెరుగుదల అభివృద్ధి స్వభావం యేమిటి? వాటి ఫలితాలు యే వర్గాల ప్రజలకి అందాయి? జరిగిన అభివృద్ధి అనేది యెట్లాంటి సామాజిక - రాజకీయ శక్తులని సృష్టించింది? యే సంస్కృతి భావ జాలాన్ని పెంచి పోషిస్తోంది? అన్న ప్రశ్నలకు జవాబులను సాధించుకోవటం

ఒక రంగంలో ఏదైనా అభివృద్ధి జరిగితే దాని ప్రభావం వివిధ వర్గాల ప్రజలమీద రాజకీయాల మీద ఎలా పడింది అన్నదాన్ని విశ్లేషించకపోతే సామాజిక మార్పుకి కావాల్సిన జ్ఞానాన్ని సమకూర్చుకోలేం. మన వ్యవసాయ రంగంలో ఏ రకమైన ఉత్పత్తి విధానాలు ఉన్నాయి అన్న అంశంమీద జరిగిన చర్చల్లో ఈ విశ్లేషణ పెద్దగా కనపడదు. మార్క్స్-లెనిన్ పెట్టుబడిదారీఉత్పత్తివిధానంలక్షణాలను చెప్పటానికి ఇచ్చిన అమూర్త నిర్వచనాలను (Abstract definitions) ఆధారం చేసుకుని వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాల గురించి అన్వేషణలు జరిపారు. అలాగే ఫ్యూడలిజానికి సంబంధించిన నిర్వచనాలు ఆధారం చేసుకొని వ్యవసాయ రంగంలోని ఉత్పత్తి విధానాలను తేల్చి చెప్పటానికి ప్రయత్నించారు. సామాజిక మార్పు కోసం ఉద్యమించేవాళ్ళవైపు నుంచి చూస్తే ఈ చర్చలవల్ల ఒనగూడిన ఫలితం పెద్దగా లెక్కలోనికిరానిది. ఈ ధోరణులకు భిన్నంగా ప్రభుత్వ జోక్యంతోను ఇతరత్రాను వస్తున్న మార్పుల గురించి రాజకీయార్థిక విశ్లేషణను ఇవ్వటం తెలుగులో ఇటీవలే ప్రారంభమైంది.

దేశంలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి స్వభావాన్ని మన అనుభవం

నుంచీ సులభంగా అర్థం చేసుకోవచ్చు. మార్కెట్‌లో ప్రస్తుతం మనకి ముప్పయి రకాల ద్విచక్ర వాహనాలు కొనుక్కోటానికి అందుబాటులో వున్నాయి. యాభై రకాల టి.వి.లు దొరుకుతాయి. ప్రతి పట్టణంలోను అధునాతనమైన సూపర్ స్పెషల్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇవన్నీ మన అభివృద్ధికి ఒకవైపు చిత్రాలు మాత్రమే. మరోవైపు లక్షల గ్రామాల్లో రోడ్లు, రవాణా, మంచినీటి సౌకర్యాలు లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వుండవు. అక్షరాస్యత వుండదు. డెబ్బయి శాతంగా వున్న మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి కావల్సిన చిన్న, మధ్యతరహా నీటి ప్రాజెక్టులు కట్టటానికి ఉక్కు, సిమెంట్ దొరకదు ఇవి మన అభివృద్ధికి మరోవైపు చిత్రం. ఉన్న వనరులను పట్టణ ప్రాంతాల్లో వున్న ఇరవై శాతం ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో పది శాతం ప్రజలకు కావల్సిన అవసరాలను తీర్చటానికే వినియోగిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి ఏటా యెంత శాతం పెరుగుతోంది అన్నదాన్ని తెలుసుకోవటం కంటే యెలాంటి పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందనేది ముఖ్యం. పోనీ జరిగిన పారిశ్రామిక అభివృద్ధి వ్యవసాయానికి భారంగా వున్న అధిక జనాభాను తనలో ఇముడ్చుకోగలవా అంటే అదీ లేదు. పరిశ్రమల స్థాపనకు భారీ ప్రాజెక్టులకు ప్రాణాధారమైన దేశీయమైన శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఇక్కడ జరగటంలేదు. యెవరు ఇస్తామంటే వారి దగ్గర నుంచి అరువు తెచ్చుకొని పరిశ్రమలను స్థాపించటమే ప్రధానం అయిపోయింది. విదేశీ పెట్టుబడి, శాస్త్రసాంకేతిక విజ్ఞానంతో పారిశ్రామిక అభివృద్ధిని సాధిస్తున్న పాలకులకు విజ్ఞాన అభివృద్ధికి అవరోధంగా వున్న ఫ్యూడల్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన చారిత్రక అవసరం వుండదు. దేశీయమైన పెట్టుబడి సమీకరణకు అవరోధంగా వున్న భూ సంబంధాలను మార్చాల్సిన అగత్యం వుండదు. వ్యవసాయ రంగాన్ని చూడండి బ్రిటిష్‌వాళ్లు కట్టిన ప్రాజెక్టులు వున్న ప్రాంతాల్లోనే ప్రధానంగా అభివృద్ధి అంతా పరిమితమై వుంది. తర్వాత వచ్చిన కొన్ని భారీ ప్రాజెక్టులవల్ల మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఆధునిక వ్యవసాయం ఆరంభం అయ్యింది. వ్యవసాయం ఆధునీకరణం కోసం నిర్మాణమైన భారీ సేద్యపు నీటి ప్రాజెక్టులవల్ల యెన్ని లక్షల మంది నిర్వాసితులు అయ్యారో ఇంతవరకు సరైన అంచనాలు లేవు. విదేశీ సహకారంతో ప్రారంభమైన హరిత విప్లవం వల్ల దేశవ్యాప్తంగా ఒక కొత్త ధనిక రైతాంగం పుట్టుకువచ్చింది. వాళ్ళకి ప్రజాస్వామిక హక్కులన్నా సమానత్వం అన్నా యెక్కడలేని ద్వేషం. మాటకి

మాట అన్నందుకు కారంచేడులో దళితులమీద దాడి జరిపారు. రాజకీయ రంగంలో వాళ్ళ ఆకాంక్షలకు ప్రతినిధి అయిన దేవీలాల్ మహిళలకు ఆ స్తిహక్కు అనేది శుద్ధ వ్యర్థం అన్నాడు. రాష్ట్రాల రాజకీయ రంగాలని ఏలే నాయకులు ఈ నయా ధనిక వర్గం నుంచే పుట్టుకు వచ్చారు. ఒకవైపున వ్యవసాయ రంగం వేరేవైపున చిన్న పరిశ్రమలు, సినిమాలు, పెద్ద హోటళ్లు, కంట్రాక్టులు, వివిధ వ్యాపారాలు వాళ్ళ కార్యక్షేత్రాలు. కులాలపరంగా ప్రాంతాలపరంగా విడిపోయివున్నవాళ్ళకు తమ బలాబలాలు ప్రదర్శించటానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి చెందిన యెన్నికలు కావాలి. అభివృద్ధి క్రమంచేత జీవనోపాధి కోల్పోయిన వారికి తమ నిరసనను తెలిపే ప్రజాస్వామిక హక్కులు ఉండకూడదు.

ప్రజలు చైతన్యయుతంగా పాల్గొని "అభివృద్ధి"ని సాధించటానికి అధిక సంఖ్యలో అనుత్పాదక ఉద్యోగి వర్గాన్ని సృష్టించాల్సి వుంటుంది. మనదేశంలో ఏటా సర్వీసు సెక్టరు అభివృద్ధి చూస్తే ఈ విషయం అర్థం అవుతుంది. అభివృద్ధి - వెలుగునీడలు పుస్తకంలో పైన చెప్పిన విషయాల ప్రస్తావనలు సరళమైన భాషలో స్పష్టంగా వున్నాయి. ఆర్. యస్. రావు పుస్తకాన్ని చదివారా? అని ఒక మిత్రుడిని అడిగినప్పుడు అతను అన్న విషయాన్ని చెబితే ఇక్కడ బాగుంటుంది. "ఓ పెద్ద పుస్తకానికి రాసిన ఉపోద్ఘాతంలా వుంది అభివృద్ధి – వెలుగునీడలు" అని అన్నాడు. ఈ పుస్తకాన్ని చదివిన వారికి యెవరికైనా అన్పించేది ఇదే.

అభివృద్ధి - వెలుగునీడలు - ఆర్. ఎస్. రావు, పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ, 32 పేజీలు, 1/8 డెమీ, 5 రూపాయలు, ప్రతులకు : పర్‌స్పెక్టివ్స్, 3-6-252, శిల్ప అపార్ట్‌మెంట్స్, ఎర్రమంజిల్ కాలనీ, హైదరాబాద్ లేక నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదురు సందు, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.

విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వం

మాగ్జిం గోర్కీ

(గత సంచిక తరువాయి)

అటువంటి నిరుత్సాహకరమైన నాటకాలు ఈ విధంగానే రూపొందుతాయని నేననుకుంటాను. తమను తాము భూమి మీద అత్యున్నతులుగా భావించిన వాళ్ళను, సంపూర్ణ మానసిక జీవనాన్ని గడపాలని ప్రగాఢంగా ఆకాంక్షించిన వాళ్ళను గుర్తు తెచ్చుకోండి. ఈ వాంఛను అణచివేసుకుంటూ వాళ్ళు రైతుల మధ్య జీవించడానికి వెళ్ళారు. వెనుకబడిన, అజ్ఞానం నిండిన వాతావరణంలోకి వెళ్ళారు. ఆ పరిసరాలు అపరిచితమైనవి. ఈ "గుణవంతులైన" మనుషులకు అవి ఆదినుంచీ బహిరంగంగానో, ప్రచ్ఛన్నంగానో శత్రుపూరితమైనవి. తమ చుట్టూ ఉన్న వాతావరణంలో హేళనాత్మకమైన కుతూహలం, అనుమానం, దురభిప్రాయాలు నిండి ఉండగా వాళ్ళు తడబడ్డారు. సంకుచితమయ్యారు. ఈ కొత్తగా వచ్చినవాళ్ళు శారీరక శ్రమ చేసేందుకు బలహీన ప్రయత్నాలు చేస్తుంటే రైతుల ముఖాలమీద వేళాకోళం నిండిన చిరునవ్వులు కనబడేవి. తద్వారా వీళ్ళలో కోపం పెరిగేది. వాళ్ళ శారీరక అశక్తతను, ఏ విషయమూ వ్యక్తం చెయ్యని రైతు హృదయంలో ప్రవేశించలేని వాళ్ళ అసమర్థతను చూసి కూడ రైతులు చిరునవ్వు నవ్వేవాళ్ళు. ఆదిమ మొరటుదనంతో, సంసిద్ధతతో నిండిన ఈ జీవితాన్ని యాంత్రికంగా రోజు తర్వాత రోజు గడుపుతూ ఉంటే మేధావి చాల అణగిపోయాడు. సున్నితమైన అతని ముఖం గరుకుదేరింది. అతని హృదయంలోంచి యూరోపియన్ అభిజాత్యాన్ని అది మెల్ల మెల్లగానైనా కచ్చితంగా తొలగించడం ప్రారంభించింది. వేసవి కాలమంటే ఒళ్ళు అలసిపోయే శ్రమగా, నిప్పులుచెరిగే ఎండతో పోరాటంగా ఉండేది. చలికాలం పోషకాహార లోపాన్నీ, వ్యాధులనూ తెచ్చేది. తాగుడు పెరిగిపోయేది. సెలవు రోజుల్లో తగాదాలు సాధారణమయిపోయేవి. ఎల్ల వేళలా, అన్నిచోట్లా మేధావి కళ్ళముందర మొరటయిన, మూఢ నమ్మకాలు నిండిన రైతు కనబడ్డాడు. ఒకచోట భయంగొలిపే భిక్షగాడు, మరోచోట పేచీకోరు, జులాయి. ఇక ఈ పేచీకోరులూ జులాయిలూ అయితే తరచుగా అమానుషంగా ఉండేవాళ్ళు. కాని హఠాత్తుగా ఏదో ఒక జ్ఞానవంతమైన మాట అని చూసే వాళ్ళను ఆశ్చర్యపరిచేవాళ్ళు. లోకం నడుస్తున్న తీరు గురించో, తన గురించో, నిజమైన అభిప్రాయం ప్రకటించే వాళ్ళు. తద్వారా రైతు అతని హృదయపు లోలోతు

ల్నించి హఠాత్తుగా వెలువడిన మానవగౌరవ స్పృహతో వెలిగిపోయేవాడు. గుర్తించ శక్యం కాకుండాను, అర్థం కాకుండాను మేధావి మనస్సులో పిరికితనాన్ని, భయాన్ని అనిర్వచనీయమైన, కాని తప్పనిసరిగా తనపట్ల ప్రశంసనీయం కాని భావాలను రైతు రేకెత్తించాడు. వలసవాదులు తామేదో తప్పుకు బలిఅయిపోయినట్టు భావించారు. కాని తమ గర్వంవల్ల వాళ్ళు దాని మూలాన్ని తెలుసుకోలేకపోయారు. ఒకే ఆవరణలోపల ఒదిగివుంటూ వాళ్ళు ఏకాంతాన్ని అనుభవించలేకపోయారు. తాను తనకోసం ఏర్పరచుకొన్న కర్తవ్యంలోనూ, దాన్ని నిర్వహించే సమర్థతలోనూ నిరుత్సాహం పెరిగిపోతోంటే దాన్ని పొరుగువాళ్ళనించి దాచుకోడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించారు. మొత్తానికి నైతిక పతనం సాధారణమైపోయింది. అందువల్ల ఈ నిరుత్సాహ భావనలు తోటివాడిమీద పరీక్షించడం మొదలైంది.

ఒక నిశ్శబ్దమైన ఉమ్మడి అంగీకారం ద్వారా ప్రతిఒక్కరి ప్రవర్తన, ఆలోచనలు కష్టభరితమైన నిఘాకు గురైయ్యాయి. అంగీకరించిన నైతిక స్మృతికి ఎక్కడ ఉల్లంఘన జరిగినా నేరస్తుణ్ని మిత్రులే ఆర్భాటంగా విచారించేవారు. తమ ఆనందం కొద్దీ నేరస్తుడ్ని శిలువెక్కించేవారు. ఇటువంటి విచారణల తరవాత సంబంధాల స్వభావం మరింత వక్రీకరించబడేది. మరింత ఎక్కువ కపటత్వం పోగుపడేది. బైటకి కనబడే మెత్తదనం వెనుక రగులుతున్న పెరిగిపోయిన శతృత్వం ద్వేషంగా మారుతుంది.

మన మేధావుల వ్యక్తివాదం అనివార్యంగా వాళ్ళను ఉన్మాదానికి సమీపమైన దుర్భర స్థితిలోకి తీసుకువెళ్తుంది.

ఈ అపసవ్యధోరణి లక్షణాలను ప్రస్తుతకాలపు వ్యక్తివాద సిద్ధాంతవేత్తలందరిలోనూ చూడొచ్చు. వాళ్ళు మార్మికవాదులైనా, అరాచకవాదులైనా, ఏ తెగకు చెందిన క్రైస్తవులైనా అందరికీ అతితీవ్రమైన మానసిక ఉద్రిక్తత, మనఃస్థితిలో త్వరితమైన మార్పులు, తప్పుడు ఆలోచనలు, సాంఘిక మొండితనం వుంటాయి. వీటితోపాటుగా ఇటువంటి వ్యాధిపీడితులు మూలగాలనీ, కేకలుపెట్టాలనీ ఆకాంక్షిస్తుంటారు. తద్వారా తమపట్లా తమ బాధలపట్లా ఇతరులను ఆకర్షించాలని ప్రయత్నిస్తారు. అయితే ఆ బాధలన్నీ పూర్తిగా భ్రమాజనితమైనవే.... ఎనభైలకూ ప్రస్తుత కాలానికీ

పోలికను కొనసాగిస్తే ఒక వాస్తవాన్ని గుర్తించాను. ఏమంటే ఆ రోజుల్లో మేధావుల అహం నైతికంగా ఎక్కువ హుంవాగా వుండేది. ఆరోగ్యవంతమైన యవ్వనాదర్శాలు గుర్తించదగినట్లుగా వుండేవి. వికృత లైంగిక ప్రవర్తన, హింసవంటివి ఆమోదం పొందేవికావు. స్త్రీత్వాన్ని చెడగొట్టడమనే భావన ఆమోదయోగ్యమయ్యేది కాదు. ఈ అహం మితవాదం వైపు ఒక వికృతమైన అసంతృప్తితో జరగడం మొదలెట్టి పూర్తిగా మితవాద పక్షానికి చేరింది.

ఆ రోజుల మేధావి వికృతత్వాన్ని, తననుతాను వ్యక్తం చేసుకోడానికి వ్యతిరేకతని ఒక సంఘటనలో గుర్తించవచ్చు. 1892 లో ప్రాబ్లమ్స్ అఫ్ ఫిలాసఫీ అండ్ సైకాలజీ అనే పుస్తకం వెలువడింది. దానిలో నీషే గురించి లొపాటిన్, గ్రోట్ తదితరులు రాసిన వ్యాసాలున్నాయి. అటువంటి సిద్ధాంత వ్యతిరేకి, సోషలిస్టు వ్యతిరేకి భావాలను చదవాలనే తమ కోర్కెను దాచుకుని ఉన్న చాలమంది యువకులు ఆ పుస్తకాన్ని రహస్యంగా చదివారు. రహస్యంగా ఎందుకంటే, చెర్నిషెవ్‌స్కీ, లావ్రావ్, మిఖయిలోవ్‌స్కీ, ప్లెఖనోవ్ వంటి వాళ్ళను చదివేందుకు తమను పురికొల్పిన పాత రాడికల్స్‌ను నొప్పించడం వాళ్ళకు ఇష్టం లేకపోయింది. వాళ్ళ స్వీయ గౌరవ స్పృహ, అంతరంగిక స్వేచ్ఛ ఎంత తక్కువగా ఉన్నాయో ఈ విషయం చూపింది గనుక ఇది హాస్యాస్పదమైనదేననుకోండి. బహుశా దీని అర్థమేమంటే, ప్రజల పక్షం వహించే పాత మార్గపు సంపూర్ణత్వం పట్ల, వ్యక్తిత్వాన్ని నిర్మించగల సమూహాన్ని సృష్టించడం పట్ల ఒక సహజత్వ స్పృహ—ప్రజాస్వామ్యం నుంచి సోషలిజానికి వెళ్ళే రాచమార్గం - ఆ రోజుల మనిషి హృదయంలోకి నిరాశామయ జీవిత శిథిలాల లోనుంచి ఇంకుతుండేది.

గతంలో లాగనే ఆ కాలపు మేధావి కూడ చాల స్పష్టంగా దేశం తప్పుడు పద్ధతిలో నడుస్తున్నదని గుర్తించగలిగాడు. సాంఘిక సమస్యలకు ఒక తక్షణమైన, శక్తివంతమైన పరిష్కారం కావలసి ఉన్నదనే అస్పష్ట భావన ఒకటి అతనిలో ఇంకా మిణుకు మిణుకు మంటూ ఉండింది. దేశపు మేధోశక్తులను ముందుకు తీసుకుపోగలిగినది తాను మాత్రమేనని కూడ అతను గతంలో లాగనే భావిస్తుండేవాడు.

జీవితపు అంగడిలో మాత్రం, ఇవాళ్టికన్న ఎక్కువగా, అతను నిలువ సరుకుగా ఉండేవాడు. ప్రభుత్వం అంతకంతకూ ఎక్కువ శత్రుత్వంతో అతణ్ణి దూరం

కొట్టింది. పరిశ్రమల అభివృద్ధి, రైతాంగపు సాంస్కృతిక అవసరాల అభివృద్ధి వంటి మారిన జీవన పరిస్థితులు ఏ స్థాయిలో ఈ మేధాశక్తులను ఉపయోగించవలసి ఉన్నదో పెట్టుబడిదారులు ఆ స్థాయిలో ఉపయోగించుకునేందుకు సిద్ధంగా లేరు.

ఎనభై లదశకం ప్రశాంతతకూ, నిరాశకూ, నిస్పృహకు చెందిన కాలమనే అభిప్రాయం కొంచెం అతిశయోక్తి అనుకుంటాను. కాని, బహుశా మన "ఇవాళ" నిన్నటికంటె ఇంకా ఘోరంగా ఉన్నది గనుక, మనకు అందినదాన్నంతా ఒక నీచమైన, అనాగరికమైన నిహిలిజం గూండాయిజంగా మారిపోయి పెంచేసింది గనుక అలా చిత్రించడం జరుగుతున్నది.

ఐతే ఇవాళ్టిలాగే అప్పుడు కూడ, చిన్నచిన్న భేదాభిప్రాయాలను పైకెత్తి పట్టడం జరిగేది, శత్రువును విస్మరించడం జరిగేది. ప్రతి ఒక్కరూ తానొక్కడు మాత్రమే గుంపుకన్న భిన్నంగా కనిపించాలని అనుకునేవారు. కాని ఆ ప్రయత్నం కూడ ఇవాళ జరుగుతున్నంత అరాచకంగా, అసహ్యకరంగా జరిగేది కాదు. ఈ మాటను ఏదో అలవోకగా చెప్పడం లేదు. ఆ కాలపు సాహిత్యాన్నీ, ప్రస్తుత సాహిత్యాన్నీ పోల్చి చేసిన విశ్లేషణ మీద ఆధారపడి చెపుతున్నాను.

మెన్షికోవ్‌ను చూద్దాం. నైతికంగా అతని లాగానే తయారవుతున్నవాళ్ళే అతణ్ణి నీచంగా నిందిస్తున్నారు. తమ మధ్య పోలిక పెరుగుతున్నందువల్లనే ఈ నిందలు సాగుతున్నాయి. మెన్షికోవ్ ఇవాళ ఏమయినా అయి ఉండవచ్చు గాని, ఆ కాలంలోని అయిన రచనలలో నిస్సందేహమైన సాంస్కృతిక విలువలున్నాయి. నైతికంగా ఎక్కువ సవ్యమైనవాళ్ళు, కష్టపడి పనిచేసేవాళ్ళు అయిన ఆ కాలపు విద్యావంతులయిన వర్గపు, పట్టణ, గ్రామీణ ఉపాధ్యాయ వర్గపు - అవసరాలను అవి తీర్చాయి..... మెన్షికోవ్‌కు నిజాయితీ, ప్రతిభ, తన ప్రజల మనఃస్థితి పట్ల అవగాహన అనే అవకాశాలు ఉండినాయి.

....రష్యన్ వ్యక్తివాదం తన అభివృద్ధి క్రమంలో ఒక రకమైన వ్యాధి లక్షణాన్ని సంతరించుకుంది. వ్యక్తి సాంఘిక, నైతిక ప్రమాణాలలో కొట్టవచ్చినట్టు కనబడే పతనానికి దారితీసింది. మేధకు ఉండే క్రియాశీల శక్తులు సాధారణంగా పతనమయి పోవడంతో ఇది కలగలిసింది....

ప్రస్తుతకాలపు రచయితకు దేశపు భవిష్యత్తు గురించి ఏ మాత్రమైనా శ్రద్ధా

పక్షుబన్నాయని మనం అనుమానించనవసరం లేదు. మన ప్రముఖ రచయితలు కూడ, తమ మాతృదేశం ద్వితీయ స్థాయిలోకన్న పైన లేదంటే ఖండించరు. వ్యక్తి అస్తిత్వపు నిగూఢత్వం వారిలో ఎంత సృజనాత్మక ఆకాంక్షను రేకెత్తిస్తుందో అటు వంటి ఆకాంక్షను సాంఘిక సమస్యలు రేకెత్తించలేవని వాళ్ళంటారు. వాళ్ళకు కళే ప్రధానమైన విషయం అంటారు. ఆ కళ స్వేచ్ఛాయుతమైనదని, వస్తుగతమైనదని దేశపు భవిష్యత్తుకన్న, రాజకీయాల కన్న, పార్టీలకన్న మించినదని, తత్కాలీన అవసరాలతో సంబంధంలేనిదని వాళ్ళంటారు. అటువంటి కళ సాధ్యమేనా అని ఊహించడం కష్టమే, ఎందుకంటే, మన భూమిమీద తెలిసి గాని, తెలియకగాని ఏదో ఒక సామాజిక బృందంతో కలసిపోని వ్యక్తి ఉంటాడా అనేది కష్టమైన విషయం -ఆ బృంద ప్వప్రయోజనాలతో తనను తాను ముడివేసుకుని, తన స్వంత ఆకాంక్షలకు సన్నిహితమైన సాంఘిక ప్రయోజనాలను సమర్థిస్తూ, తనకు వ్యతిరేక మైన బృందాలతో పోట్లాడని వ్యక్తి ఉండడు. పుట్టుకతోనే చెవిటి, మూగగా పుట్టిన వ్యక్తి ఇందుకు మినహాయింపు కావచ్చు. పిచ్చివాళ్ళు ఈ పరిధిలోకి రాకపోవచ్చు. నేనింతకు ముందే చెప్పినట్టు గూండాలు ఈ పరిధి దాటిపోవచ్చు. అయినా వీధి గూండాలు, మురికివాడల గూండాలు తమ స్వంత బృందాలను, సంస్థలను కలిగి ఉంటారు. దాన్నిబట్టి తెలిసేదేమంటే, సాంఘిక బృందాలు ఏర్పడడం అనేది అత్యవ సరమనే ఎరుక చివరికి గూండా హృదయంలోంచి కూడ చెరిగిపోలేదు.

వాదనకోసం, పూర్తిగా స్వేచ్ఛాయుతమైన, పూర్తిగా వస్తుగతమైన కళ ఉన్నదని అంగీకరిద్దాం. ఆ కళకు అన్నీ ఒకటేననీ, అందరూ సమానమేనని అంగీ కరిద్దాం.

కాని ఇవాళ్టి రచయిత విప్లవ మనస్తత్వమనే దానినుంచి నిర్లిప్తంగా ఉండ డం మాత్రమే కాదు, దూరంగా ఉన్నాడని, వ్యతిరేకంగా ఉన్నాడని చూపేందుకు ఏ రుజువులూ చూపనవసరం లేదు.

అటువంటి మనస్తత్వాన్ని తాము ఇష్టపడమని, తమ స్వంత పద్ధతిలో దానితో పోరాడుతున్నామనీ, మన కాలంలోని ప్రముఖ రచయితలలో చాలమంది నిరాకరించ రనుకుంటాను....వాళ్ళ వైఖరి ఎంత "వస్తుగతంగా" ఎంత "అంతరంగిక స్వేచ్ఛ"తో ఉన్నదో పరిశీలిద్దాం.

టాల్‌స్టాయ్, తుర్గేనెవ్, గొన్‌చారొవ్, చివరికి లెస్కొవ్, పిసెమ్‌స్కీలు కూడ విప్లవకారుడి మానసిక లక్షణాల ఔన్నత్యాన్ని పాఠకుడికి తెలియజెప్పేందుకు ప్రయత్నించారు....

ఈ రచయితలందరి ప్రకారం విప్లవకారుడంటే నీచమైన మనసు లేనివాడు, దృఢమైన విశ్వాసాలు గలవాడు. గొప్ప ఆత్మవిశ్వాసం గలవాడు. అరివీర భయంకరుడు, సాయుధుడు.

కాని, కూడబలుక్కున్నట్టుగా ప్రస్తుత రచయితలందరూ ఒక భిన్నమైన వ్యక్తిని చిత్రిస్తుంటారు. డార్క్‌నెస్ (లియోనిద్ అంద్రెయెవ్ రచన)లో ప్రధాన పాత్ర నిస్సందేహంగా బలహీన మనస్కుడు. దృఢచిత్రం లేని ఆ వ్యక్తి ఏ చిన్న గందరగోళానికైనా తబ్బిబ్బయి పోతాడు. ఎ టేల్ ఆఫ్ ది సెవెన్ హాంగ్‌డ్ మెన్ (లియోనిద్ అంద్రెయెవ్ రచన) లోని ప్రధాన పాత్రలు తాము ఎందుకు ఉరికంబం ఎక్కుతున్నారనే విషయంపై కనీస శ్రద్ధను కూడ చూపరు. మొత్తం కథ అంతటిలోనూ వారిలో ఏ ఒక్కరూ తమ ఉమ్మడి లక్ష్యం గురించి ప్రస్తావించరు. అత్యంత విసుగుదలతో కూడిన జీవితం గడిపి, జైలుగోడల బయటితో ఏ సజీవ సంబంధమూ లేక, ఇక ఆశలేని రోగి మందుమింగినట్టుగా మృత్యువును స్వీకరిస్తున్నట్టుగా కనబడుతారు వాళ్ళు.

తమ నాయకుల అడుగుజాడల్లో నడిచే చిన్నాచితకా రచయితలు కూడ విప్లవకారుడి పాత్రను దిగలాగడం ప్రారంభించారు. ఏ మాత్రం ప్రతిభలేని వీళ్ళ రచనల్లో విప్లవకారుడి నైతిక స్థాయి మసకబరిచే, మలినపరిచే ప్రతిదాన్నీ నొక్కి చెప్పడం ప్రారంభమైంది.

ఇటువంటి దూషణ కార్యక్రమాన్ని వాళ్ళు పూర్తి వస్తుగతత్వంగా అభివర్ణిస్తారు. విప్లవకారుడి మీద యదాలాపంగా, అనుద్దేశపూరితంగానే బురద జల్లుతున్నామంటారు. విప్లవకారుణ్ణి మొరటయినవాడిగా, మూర్ఖుడిగా, క్షుద్రుడిగా చిత్రించేటప్పుడు తమ వెన్నుపోటు స్వభావాన్ని ఈ రచయితలు సానుభూతి ప్రకటనల వెనుక దాచుకుంటారు. సరిగ్గా ఇది తన రక్షణలో ఉన్న రోగిపట్ల అసహ్యాన్ని ప్రదర్శించే ముసలి రోగిష్టి నర్సు ప్రవర్తనలా ఉంటుంది....

ఈ విషాద స్థితికి ఒకటే వివరణ ఉంది. మన రచయితలు అనుద్దేశపూర్వకం

గానే క్షుద్రవాదం మాయలో పడిపోయారు. క్షుద్రవాదం అంటిన ప్రతి ఒక్కరు, ప్రతి ఒక్కటి విషపూరితమై పోతుంది. క్షుద్రవాదానిదే పైచేయి అవుతుంది. ఇక మనకు మిగిలింది సాంఘిక నీతి పతనమైపోయిన స్థితి. రష్యన్ రచయిత అనబడే వాడే దిగజారిపోయిన స్థితి.

మన నూతన సాహిత్యం యూరోపియన్ సాహిత్య అభివృద్ధి చరిత్రలోనే ఒక ఆశ్చర్యకరమైన క్రమాన్ని కలిగివుంది. పాశ్చాత్య దేశాలలో మరి ఏ సాహిత్యం లోనూ ఇంత శక్తితో, వేగంతో జీవం తొణికిసలాడడాన్ని, ప్రతిభ ఇంత శక్తి మంతంగా ఉజ్వలంగా వెల్లుబుకడాన్ని చూడలేమంటే అతిశయోక్తి కాదు. ఇంతగా వర్ణించ శక్యంగాని దుర్భర పరిస్థితులలో నుంచి అంత మహోన్నతమైన, ప్రపంచ ప్రఖ్యాతమైన పుస్తకాలనుగాని, అద్భుతమైన సౌందర్యాన్నిగాని యూరప్‌లో మరెవరూ సృష్టించలేదు. మిగిలిన పాశ్చాత్య దేశాల సాహిత్య చరిత్రలను మనదేశ సాహిత్య చరిత్రను పోల్చిచూస్తే ఈ తిరుగులేని వాస్తవం స్పష్టమవుతుంది. దాదాపు వంద సంవత్సరాల వ్యవధిలో రష్యాలో రూపొందినటువంటి మహోన్నత రచయితలు మరే దేశంలోనూ అంతే వ్యవధిలో రూపొందలేదు. మనకున్నంతమంది అమర రచయితలు మరెవరికీ లేరు.

మన సాహిత్యం మన గర్వకారణం. ఒక జాతిగా మనం సాధించిన అద్భుతం అది. దానిలోనే మన తత్వశాస్త్రం అంతా ఇమిడివుంది. మనసు వికసించిన సుదూర తీరాలకు అది సూచిక. ఒక విచిత్ర వేగంతో రూపొందించిన అద్భుత ఆలయంలో ఇవాళ్టికీ మహాశక్తిమంతమైన, పవిత్ర సుందరమైన మేధలు, హృదయాలు జ్వలిస్తు న్నాయి. అవన్నీ నిజమైన కళాకారుల మేధా హృదయాలు. అవన్నీ మనకు బోధించే దొకటే. వాళ్ళందరూ దేన్ని గుర్తించారో, దేన్ని జీవించారో దాన్నే వాస్తవికంగా, నిజాయితీతో మనకు బోధిస్తున్నారు. "మేం ఈ రష్యన్ కళా ఆలయాన్ని ప్రజల మౌన సహకారంతో నిర్మించాం. మేం ప్రజలనుంచే ప్రేరణ పొందాం. అందువల్లనే ప్రజలను ప్రేమించండి".

మానవజాతి కంతటికీ ఉపయోగపడే ఇతివృత్తాలు అతి తరచుగా, అతి గాఢంగా మిగిలినచోట్లకన్నా ఎక్కువగా మన ఆలయంలోనే ప్రతిధ్వనించాయి. రష్యన్ సాహిత్యపు శక్తి సౌందర్యాలను చూసి ఆశ్చర్యపోయిన ప్రపంచం దాని ప్రాముఖ్యతను గుర్తించింది. పాశ్చాత్య ప్రపంచానికి తెలియని ఒక అద్భుతమైన

విషయాన్ని ఈ సాహిత్యం పరిచయం చేసింది. ఆ అద్భుతమేమంటే రష్యన్ స్త్రీలు. పురుషుడి గురించి అనంతమైన, అంకితమైన మాతృప్రేమతో మాట్లాడిన ఏకైక సాహిత్యం రష్యన్ సాహిత్యం.

మన సాహిత్యం గురించిన ఈ అంచనాకు మన విద్యావంతులకు మధ్య వైరుధ్యం ఉన్నట్టుంది. అయితే అది కనబడే వైరుధ్యం మాత్రమే. పాత రష్యన్ సాహిత్యపు మన స్తత్వం అప్పుడు విద్యావంతులు అమోదించిన రాజకీయ బోధనల కన్నా విశాలమైనది; ఉన్నతమైనది ....ఎప్పుడైనా ఒక రాజకీయ బోధన తన కళాత్మక శక్తికి అడ్డుతగిలితే ఆ రోజుల్లో రచయిత రాజకీయాల కన్నా పైకి ఎదగ గలిగేవాడు. మన రోజుల్లోలాగ లొంగిపోయేవాడు కాదు. మరో మాటలో చెప్పాలంటే పాత సాహిత్యం రష్యన్ విద్యావంతులందరి మనఃస్థితులను, ఉద్వేగాలను, ఆలోచనలను స్వేచ్ఛగా ప్రతిఫలించింది. ప్రస్తుత కాలపు సాహిత్యం సంకుచిత, క్షుద్ర బృందాల ఆజ్ఞలకు లొంగిపోతోంది. ఆ బృందాలు తమ శ్రేణులను పెంచుకొనే వ్యాపారంలో మునిగివున్నవి. లోపల లోపల కుళ్ళిపోయి అడ్డువచ్చిన ప్రతిదానిని గబగబా సంగ్రహించేవి. ఇదంతా 1880వ దశకం నాటి స్థితి. వాళ్ళు పాజిటివిజం నుంచి మార్మికవాదం వైపు, భౌతికవాదం నుంచి భావవాదం వైపు కదులుతూ ఒక పాత స్థావరాన్నుంచి మరో స్థావరానికి పరిగెడుతున్నారు. ప్రతి స్థావరమూ తమ విముక్తికి సాధనం కాలేదని గుర్తిస్తున్నారు ఇప్పుడు వాళ్ళు ఒక కొత్త స్థావరాన్ని నిర్మిస్తున్నారు. దాని పేరు అవసరవాదం. కాని లోలోపల విధ్వంసం పూర్తి అయింది కనుక వాళ్ళు అక్కడ కూడా శరణాగతి పొందలేరు.

ప్రస్తుత కాలపు రచయితలు క్షుద్రుల తప్పుడు అడుగుజాడలనే యథాతథంగా అనుసరిస్తూ, నినాదాలను, భావాలను జేబుదొంగ చేసిన వాడు చేరుమాళ్ళ మార్చినట్టుగా మారుస్తున్నారు. అయితే ఇవాళ్టి రచయిత మనసులో గుయ్యిమంటూ తిరుగుతున్న పెద్ద పురుగు ప్రజాస్వామ్య వ్యతిరేకత............ రష్యాలో ప్రతి రచయిత నిజంగా కొట్టవచ్చినట్టుగా ఒక వ్యక్తి. కాని మన రచయితలందరూ ఒక ప్రధానమైన ఆకాంక్షలో ఐక్యంగా వుండే వాళ్ళు. దేశపు భవిష్యత్తుపట్ల, ప్రజల పట్ల, ప్రపంచంలో దేశం నిర్వహించవలసిన పాత్ర పట్ల స్పృహ, అవగాహన వుండేది.

ఒక మనిషిగానూ, వ్యక్తిగానూ రష్యన్ రచయిత జీవితంపట్ల, సాహిత్యం

పట్ల, కష్టజీవులైన ప్రజలపట్ల, దుఃఖభాజనమైన తన మాతృభూమి పట్ల ప్రగాఢ మైన, ఉద్వేగ పూరితమైన ప్రేమను కలిగి వుండేవాడు. అతను ఒక నిజాయితీగల యోధుడిలా వుండేవాడు. సత్యంకోసం ప్రాణం ఇచ్చేవాడు. కష్టాలను సహించేవాడు. ఇతరులతో ప్రవర్తించేటప్పుడు పసిపిల్లవాడై పోయేవాడు. అతని హృదయం కన్నీటి బిందువంత మృదువుగా వుండేది. నిర్మల రష్యన్ ఆకాశంలోని తారలంత ఉజ్వలంగా వుండేది.

తన జీవితాంతమూ అతను తన హృదయగత సర్వశక్తులనూ సత్య విజయం కోసం, ఉద్వేగపూరితమైన పిలుపు వచ్చినపుడు వెచ్చించాడు. తన ప్రజల కడగండ్ల పట్ల పరితాపాన్ని ప్రకటించాడు. కాని ఎప్పుడూ జర్మన్‌ల విషయంలో ఫ్రెన్సెన్‌లాగా, బ్రిటిష్ వారి విషయంలో కిప్లింగ్‌లాగా, ఇటాలియన్‌ల విషయంలో డి' అనుంజియో లాగా తన ప్రజలను ప్రపంచ ప్రజలనుంచి వేరుగా చూడలేదు.

రష్యన్ రచయిత హృదయంలోని ప్రేమ ఒక ఘంటలాగా మారుమోగి దాని శక్తి మంతమైన ప్రవక్త వంటి ధ్వనితో,దేశంలోని సజీవ హృదయాలన్నింటినీ ప్రతి స్పందింప చేసింది.

"ఇదంతా నాకు తెలుసు" అని పాఠకుడు అనవచ్చు.

నా కందులో సందేహంలేదు. కాని నేను రచయితల నుద్దేశిస్తున్నాను. రచయితలు అందిన కీర్తిలో మునిగిపోయారని, ఆ కీర్తి వారిని కావలించుకొని ముంచె త్తిందని, ఒక అసహ్యకరమైన క్షుద్ర స్త్రీ తన లావాటి మోటు వేళ్ళు రచయితల చెవులకు అడ్డం పెట్టిందని నాకనిపిస్తుంది. క్షుద్రత్వం గురించి చేసే హెచ్చరికలను ఆవేళ్ళు వినకుండా చేస్తున్నాయి. తొలి రోజుల్లో పాఠకుడు రచయితను తన స్నేహి తుడిగా భావించడం నాకు తెలుసు. ఫలానా రచయిత తాగుబోతయ్యాడంటే పాఠకుడు విచారంగా తల వేలాడేసుకోవడం, తన స్నేహితుడు, గురువు అయిన ఆ రచయిత గురించి బాధపడడం నాకు తెలుసు. ఆ రచయిత మద్యంలో ప్రశాంతి పొందేందుకు వెయ్యి కారణాలుండవచ్చునని పాఠకుడు బాధతో గుర్తించేవాడు.

ఇవాళ్టి పాఠకుడైతే అటువంటి వదంతులు విన్నప్పుడు సహిస్తున్నట్టుగా ఒక చిరునవ్వు నవ్వుతాడు. అదే పదివేలు.

ఆ రోజుల రచయిత చెప్పినదీ, బోధించినదీ ఏమిటి ?

"శక్తి మంతమయిన రష్యన్ భాషను సృష్టించిన ప్రజలమీద నమ్మకముంచండి. వారి సృజనాత్మక శక్తులమీద నమ్మకముంచండి. మోకాళ్ళమీద పాకుతున్న వాళ్ళకు సాయపడండి. లేచి నిలిచేట్లు చేయండి. వాళ్ళ దగ్గరకు వెళ్ళి వాళ్ళతో కలిసి కవాతు చేయండి. ఉత్తములైన రష్యన్ మహిళలకు నివాళులర్పించండి. రష్యన్ భూమిని నిర్మించే కష్టభరితమైన కర్తవ్యంలో ఆమెను ఒక స్నేహితురాలిగా, సహచరిగా ప్రేమించడం నేర్చుకోండి".

వేలాది మంది యువకులు ఈ పిలుపుకు జవాబు ఇచ్చారు. తరతరాల బాధ్యతను భుజాల కెత్తుకున్నారు. ప్రజలలోని అమృతమైన, ప్రగతి శీలమైన శక్తులను కూడగట్టారు. శత్రువును సాయుధంగా ప్రతిఘటించారు. ఆ పోరాటంలో వారిలో చాలా మంది నేలకొరిగారు. కాని లక్ష్యం జయప్రదమైంది. ప్రజలు లేచి నిలిచారు. తమంతట తాము ముందుకు కదిలారు. అనివార్యమైన పోరాటం గురించి ఆలోచిస్తూ నాయకులకోసం వెదికారు. జ్ఞానవంతమైన నాయకుల గళాల్ని వినడానికి ఎదురు చూస్తున్నారు.

కాని నాయకులు, ప్రజల ప్రవక్తలు మద్యపుశాలలలో వున్నారు. వేశ్యావాటికలో వున్నారు.

ఈ మాటలు అని నేనెవరినీ నొప్పించదలచలేదు. నేనెందుకు నొప్పించాలి? అందరికీ తెలిసిన విషయాన్నే, రుజువులు అవసరంలేని విషయాన్నే మన కాలపు పుస్తకాల్లో రాసిన విషయాన్నే, విమర్శకులు, పత్రికలు ఒప్పుకొన్న విషయాన్నే నేను చెప్తున్నాను. సిగ్గు పడవలసిన ఆ వాస్తవాన్ని వక్రీకరించకుండా మరో మాటల్లో చెప్పగలిగితే తప్పకుండా నేనలా చేసేవాణ్ణే.

కవి హృదయం ఇప్పుడింకెంత మాత్రమూ కలగూర గంపకాదు. జీవిత ధ్వనులన్నింటికీ-ఆనందానికి, కన్నీళ్ళకు-ప్రతిస్పందించి స్వర మిచ్చేతంత్రి కాదు. మనిషి అంతకంతకూ ఎక్కువగా తన గురించిన అనుభూతులకు తక్కువ చలిస్తున్నాడు. అంతకంతకూ తక్కువగా వినబడుతున్న అతని ఆనందం ఒక వ్యాధి పీడిత అలసటను ధ్వనిస్తోంది. అతని పవిత్ర విచారం నిరాశారణ్యం అయిపోయింది.

కవికూడ అక్షరాల మనిషి అయిపోతున్నాడు. సత్యాల, పరిశీలనల ఉన్నత

శిఖరాల నుండి అతను సంకుచిత జాగ్రత్తల మైదానాలలోకి జారిపోతున్నాడు. అతని చూపులు విసుగెత్తించే సంఘటనలమీద స్థిరపడుతున్నాయి. వాటిని అరువు తెచ్చుకొన్న పరాయి భావాల సాయంతో వివరించాలనీ తనకు విదేశీయమైన అర్థాన్నిచ్చే పదాలతో వర్ణించాలనీ అతను ప్రయత్నిస్తున్నాడు. రూపమనేది అంతకంతకూ ఎక్కువ నిశిత మౌతోంది. ఎక్కువ విలువైంది అవుతోంది. పదజాలం నిర్లిప్తం అవుతోంది. వస్తువు అంతకంతకూ తగ్గిపోతోంది. ఆవేశ తీవ్రత చెరిగిపోతోంది. ఉత్తేజం అనేదే లేదు. రెక్కలు కోల్పోయి ఆలోచన స్ఫూర్తిరహితంగా యాంత్రిక ఊబి లోకి దిగజారుతోంది. ఛిద్రపలైపోతోంది. రోగిష్టిదైపోతోంది మళ్ళీ ఒకసారి మనం నిర్భయత్వానికి బదులు విస్తృత హింసను చూస్తున్నాం. ఆవేశం స్థానంలో నోరుపట్టని నిందలొచ్చాయి. ద్వేషం కటువైన గుసగుసల్లో వ్యక్తమౌతోంది. ఎల్లెడలా అనుమాన దృక్కులు వ్యాపిస్తున్నాయి.

పాత రచయితలకు విస్తృతమైన భావవ్యాప్తి ఉండేది. సమన్వయపూరిత మయిన ప్రాపంచిక దృక్పథం ఉండేది జీవనకాంక్ష ఉండేది మన అనంత ప్రపంచం సొంతం వాళ్ళ దృక్పథం లోపల ఉండేది. ప్రస్తుత కాలపు రచయిత "వ్యక్తిత్వం" అతని రచనా పద్ధతిలోనే ఉంటుంది. కాగా అతని నిజమైన వ్యక్తిత్వం అంటే అతని ఉద్వేగాలు, ఆలోచనలు మొత్తం అంతకంతకూ ఎక్కువగా గుర్తించరానివై పోతున్నాయి. అస్పష్టమైపోతున్నాయి. నిజం చెప్పాలంటే దయనీయమైపోతున్నాయి. రచయితనేవాడు ఇంకెంత మాత్రమూ ప్రపంచానికి దర్పణం కాడు. ఒక చిన్న ముక్క. సామాజిక చిత్రాన్ని మొత్తంగా ప్రతిఫలించిన సంకీర్ణత చెరిగిపోతోంది. ఒక వీధిలో పడివున్న ఈ అద్దంముక్క దుమ్ముతో అస్పష్టమైపోయి ప్రపంచంలోని జీవన ఔన్నత్యాన్ని ప్రతిఫలించలేకపోతోంది. వీధిజీవిత శకలాలను, ధ్వంసమైపోయిన హృదయపు ముక్కలను మాత్రమే ప్రతిఫలిస్తోంది.

మన నేలమీద ఒక కొత్తరకం రచయిత తలఎత్తాడు. అతను పబ్లిక్ విదూషకుడు. వినోదానికి చెవికోసుకొనే క్షుద్రుల అభిరుచులను ఆకర్షించే బహ్రూను. అటువంటి మనిషి తన దేశానికి సేవ చేయడు. పబ్లిక్‌కు సేవ చేస్తాడు. పరీక్షించి తీర్పు చెప్పవలసిన నిర్ణేతలా ప్రవర్తించలేడు. ధనవంతుని సేవకోసం నిలిచి ఉండే వాడిలా ప్రవర్తిస్తాడు. అతను బహిరంగంగా తనను తానే వేళాకోళం చేసుకొంటాడు. అతనికి ప్రజలు చూపే గౌరవంకన్నా వారి వహ్వాలు, శిరఃకంపాలూ ప్రియమైనవిగా

ఉంటాయి. తన యజమానికి సంతోషం కలిగించేందుకు కుళ్ళు పరిహాసాలు వినిపించేందుకు సిద్ధంగా వున్న రచయితను చూసి క్షుద్రుడికి తన సేవకుడిపట్ల అసహ్యం కలుగుతుంది.

ఒక మనిషి ఆత్మగౌరవం కొలిచేందుకు ఇతర ప్రమాణాలతోపాటు క్షుద్రత్వం పట్ల, మామూలుతనంపట్ల అతని అసహ్యాన్ని కూడా ప్రమాణంగా తీసుకోవచ్చు. రష్యాలో సమకాలీన "ప్రజాభిప్రాయ నాయకుడు" క్షుద్రత్వంపట్ల అసహ్యాన్ని కోల్పోయాడు. అంతేకాదు రష్యన్ సాహిత్య ఆలయంలోకి క్షుద్రత్వాన్ని తీసుకొచ్చాడు. అతనికి తన స్వంత పేరంటే గౌరవంలేదు. చేతులారా బురదలో పడదోస్తాడు. నీతినియమాలు లేనివాడిలా నిర్లజ్జగా సాహిత్య గందోళిగాళ్ళ పక్కన, గారడీవాళ్ళ పక్కన తన సంతకం చేస్తాడు. అతను నిష్పూచీగా రాయడం నేర్చుకొన్నాడు. పదాలతో గారడీ చేయడం నేర్చుకొన్నాడు. తన గురించి తానే ప్రగల్భాలు పలకడం నేర్చుకున్నాడు.

కొన్నిసార్లు అతను చిలకలాగ ముద్దుముద్దు మాటలతో క్షుద్రులను విమర్శిస్తాడు. క్షుద్రుడు చిరునవ్వుతో ఈ విమర్శను ఆలకిస్తాడు. ఎందుకంటే ఈ దుర్భాషలన్నీ కేవలం పెంపుడు కుక్క మూల్గులలాంటివని అతనికి తెలుసు. వీపుమీద మరోసారి నిమిరితే అవే కృతజ్ఞతా స్వరాలవుతాయనీ అతనికి తెలుసు.

పాత సాహిత్యం నుంచి భయంగొలిపే సింహనాదాలని గుర్తుతెచ్చుకొని క్షుద్రుడు నిట్టూర్పు విడుస్తాడు. తనవంక తాను గర్వంగా చూసుకొంటాడు. అతని రాజ్యం వచ్చింది. ప్రవక్తలు మరణించారు. వారి స్థానాన్ని బఫూన్లు స్వీకరించారు. ఈ అసహ్యకరమయిన క్షుద్రుడు సత్యాన్నీ, సౌందర్యాన్నీ, ప్రేమనూ తొక్కివేస్తున్నప్పుడు అతన్ని ఆనందభరితుడ్ని చేయడమే బఫూన్ల కర్తవ్యంగా ఉంటున్నది.

"అన్ని రంగాలలో విస్తృత పరిజ్ఞానంలేకుండ పొందగలిగిన బహుమతివంటిది కాదు కళ అనేది. అనుభవాన్ని సంతరించుకోవాలి. అన్వేషించాలి. ఎంతో జీర్ణించుకోవాలి. చాల ప్రేమించాలి. బాధపడాలి. అదే సమయంలో అవిశ్రాంతంగా, ఆగిపోకుండా పనిచేయాలి. కమ్మకత్తి వాడేముందు కంచె ఎలా వేయాలో నేర్చుకోవాలి. కేవలం కళాకారుడే కావడం అనేది నిర్వీర్యమైనది. అంటే అతి మామూలయినది. లేదా అది అతికయినా దారితీస్తుంది. అంటే పిచ్చితనమౌతుంది" అన్నాడు మేధావి, ఆకర్షణీయమైన రచయిత జార్జ్ సాండ్.

ప్రస్తుత కాలపు రచయితలు రెండే రకాలు. అతి మామూలువాళ్ళుగానీ, పిచ్చి వాళ్ళుగానీ.

మనదేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు బ్రహ్మాండమైన జ్ఞానాన్ని కోరుకుంటాయి. రచయితలలో విజ్ఞాన సర్వస్వాన్ని కోరుకుంటాయి. కానీ రచయితలు ఈ కోర్కెలను వినలేని చెవిటివాళ్ళయిపోయారు.

మన సాహిత్యం మహామేధావులు దున్నిన క్షేత్రంలాంటిది. కొద్దికాలం కింది వరకూ సారవంతంగా, రకరకాల ఉజ్వలమైన పూల తివాచీగా ఉండిన ఈ నేలలో అజ్ఞానానందపు కలుపు మొక్కలు నిండిపోయాయి. ఫ్రెంచి, ఇంగ్లీషు, జర్మన్ పుస్తకాల ముఖచిత్రాల రంగుల కాగితాల ముక్కలు నిండిపోయాయి. ఈ పాశ్చాత్య క్షుద్రుల భావాల ముక్కలు, సంకుచిత, చిల్లర భావాలు మనకు పరాయివి. ఇది "విప్లవానికీ స్వర్గానికీ మధ్య పొత్తు" కూడ కాదు. కాని కేవలం గతకాలపు జ్ఞాపకాల మీద బురద జల్లాలనే పిచ్చి, జులాయి కోరిక తప్ప అది మరేమీ కాదు. ఒక పరాయి వచ్చాడు. అతనికి ప్రతిదీ విదేశీయమైనదే. అప్పుడే నిర్మించిన సమాధులమీద అతను ఆనందంగా చిందులు వేస్తాడు. రక్తపు మడుగుల మధ్య ఈపలాడుతాడు. కోపం నిండిన ముఖంమీద మెరుగుతో శిథిలమవుతున్న కోరలు బయటపడతాయి. వ్యాధిపీడితుడైన ఆ ఆటవికుడు తనను తాను విజేతగా భావించుకుంటాడు. ఇవాళ తన అసంబద్ధ ప్రేలాపనలను వింటున్న వాళ్ళముందు తన మొరటు ఆనందాన్ని కేకలద్వారా, అరుపులద్వారా ప్రకటిస్తాడు. క్షణికమైనవాడై అతను ఒకే ఒక్కరోజు లోని శబ్దాలమీద, దృశ్యాలమీద బతుకుతాడు. తనను తోసివెయ్యబోయే, నిశితమైన, దుర్భరమైన విమర్శకు గురిచేసే రేపటి గురించి ఒక్క ఆలోచన కూడ చెయ్యడు.

ఇవాళ్టి రచయిత దేని గురించి మాట్లాడతాడు ?

"జీవితమంటే ఏమిటి ?" అని అడుగుతాడు. "చివరి కంతా పురుగులకు ఆహారమయిపోయేదే. నువు చేసిన మంచీ చెడూ కూడ నీ మరణంతో అదృశ్యమై పోతాయి. దేనివల్లా చిన్నమెత్తు తేడా ఉండదు. మృత్యుముఖాన అందరూ సమానంగా ప్రాముఖ్యతను కోల్పోతారు" అంటాడు.

ఈ కొత్త భావాలు విని క్షుద్రుడు అంగీకారంగా తల ఊపుతాడు. "ఔను నిజమే. జీవితాన్ని సృష్టించడం అర్థరహితం. దాన్ని మార్చడానికి ప్రయత్నించడం

నిష్ప్రయోజకం. మంచీ చెడూ రెండూ సమానమే. జీవిత సార్థకత ఏమిటనే అన్వేషణ ఎందుకు? అది ఎలా ఉంటే అలా తీసుకుందాం. మన చేతికందిన ఆనందాలతో జీవితాన్ని నింపుకుందాం. అలా మన జీవితకాలం సంతోషంగా, ప్రయత్నరహితంగా గడిచిపోతే చాలు" అంటాడు.

నేరాలకు శిక్షలను సూచించే తన నైతిక స్మృతిని తానే నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తూ క్షుద్రుడు ప్రతిరోజూ అవినీతిలో, నీచత్వంలో, మానవ దేహానికీ, హృదయానికి వ్యతిరేకంగా చిన్న, అసహ్యకరమైన నేరాలు సాగిస్తూ గడుపుతాడు. ఇదంతా అతనికి ప్రగాఢమైన ఆనందాన్ని కలగజేస్తుంది.

ఈ క్షుద్రుడు గుర్రపుడెక్క ఆకులాగ జీవితాన్ని వదలకుండా ఉండిపోతాడు. స్వంత ఆస్తి అతని వేళ్ళు. ఆ వేళ్ళనుంచి పీకెయ్యకుండా పైపైన కత్తిరిస్తే అతను మళ్ళీ విరివిగా, అన్నిచోట్లా పెరిగిపోయి, చుట్టూ ఉన్న పూలను చంపేస్తాడు. మృత్యువు ఆనందదాయకమైనదనే మాట అతనికి బాగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఆ మాట అతని హృదయంలో ఒక ప్రశాంత విధ్వంస వాదాన్ని మినహా మరే ఆలోచననూ ప్రేరేపించదు తమ అతిశయాన్ని దాచుకునేందుకు ఈ క్షుద్రులు తమ సంపన్నమైన, రుచికరమైన ఆహారానికి ఒక మసాలా ఆలోచనను కలుపుతున్నారు. సజీవ పదార్థాలన్నీ మరణించేవే అని అంటున్నారు కాగా వారి కక్షిదార్లు, మృత్యు గాయకులు, ఆ మృత్యు భయంతో విషపూరితులై పాలిపోయి "మేం నశించిపోతున్నాం, ఎందుకంటే, వ్యక్తికి అమరత్వం లేదు" అని కేకలు వేస్తున్నారు.

మూర్ఖుల నోటి నుంచీ, పసిపాపల నోటి నుంచీ జ్ఞానవంతమైన మాటలు వస్తాయని అందరికీ తెలుసు.

ప్రస్తుత కాలపు సాహిత్యం గురించి చుకొవ్‌స్కీ బహిరంగంగా చెప్పిన ఈ "వాస్తవం" చూడండి. ఈ వాస్తవం మనిషికీ, రచయితకూ కేవలం అవమానకరమైనది మాత్రమే.

"అతీత విషయం పట్ల భీతావహం అనేది సాహిత్యంలో అలవాటయిపోయింది. రచయితలు, కవులు, కళాకారులు అష్టు బిందువులను పీల్చినట్టుగా దాన్ని పీలుస్తున్నారు. ఆంద్రెయెవ్ పేరుమీద ప్రచారమవుతున్న సాహిత్యధోరణికి చెందిన వాళ్ళందరూ ఈ భీతావహం నుంచే రూపొందారు, దాని మీదనే బతుకుతున్నారు. ఇవాళ

ఎవరైనా ఒక నిజమైన కవి కావాలంటే భీతావహాన్ని అనుభవించగల శక్తి అవసర మవుతోంది.... వాళ్ళందరూ మరణశిక్ష పడిన వాళ్ళలాగున్నారు.... ఇవాళ ఎవరైతే 'ఓ' అనే కేకను కొత్తరకంగా మరింత భీతావహంగా అనగలరో వాళ్ళు గొప్పవాళ్ళుగా గుర్తించబడుతున్నారు. ఏ మాటా, ఏ ఆలోచనా, ఏ కోరికా లేకుండా మనను కూడ తనతో పాటు అరిచేలా చేయగల వాడు మరింత గొప్పవాడవు తున్నాడు".

మన పాత రచయితల సున్నిత, సుకుమార హృదయంలో ఉన్న నొప్పి కలిగినా, అతని పెదాలు దాటి బైటపడిన మూలుగును కూడ దేశంలోని అత్యుత్తమ మానవులు స్వీకరించారు. వాళ్ళు ఆ రచయితతో అతి సన్నిహిత మానసిక బంధాలతో ఉండేవారు. అతను ప్రకటించిన నినాదం ఉమ్మడి స్వరమే అయ్యేది.

ప్రస్తుత కాలపు మానసిక రోగి మాత్రం తన స్వంత బాధను, తన మృత్యు భయాన్ని, ప్రపంచపు బాధ స్థాయికి పెంచాడు. అతని రచనలలో ప్రతి పుటలోనూ, ప్రతి పద్యంలోను, రచయిత వక్ర కవళికలను, తెరిచి పెట్టిన నోటిని గుర్తించవచ్చు. "నేను బాధతో ఉన్నాను, భయంలో ఉన్నాను. కనుక ప్రతివాన్నీ శపిస్తాను. మీ విజ్ఞాన శాస్త్రాన్ని, రాజకీయాలను, సమాజాన్ని, నా బాధలు చూడకుండా మీకు అడ్డు పడే ప్రతిదాన్నీ శపిస్తాను" అని అతడు అరుస్తున్నాడు.

రోగిష్టి అయిన స్వయం ప్రేమికునికంటే క్రూరులు ఉండరు.

ప్రకృతి జ్ఞానానికి మనం కృతజ్ఞతలు చెపుదాం. స్వంత, వయ్యక్తిక అమ రత్వం అనేది లేదు. మనందరమూ అనివార్యంగా అదృశ్యమైపోతాం. మన కంటె బలవంతులైన, అందమైన, నిజాయితీ పరులయిన మనుషులకు స్థానం ఇస్తాం. నూత్న, అద్భుత, వైవిధ్యపూరిత జీవితాన్ని సృష్టించే వాళ్ళకు స్థానం ఇస్తాం. బహుశా వాళ్ళు అనేక ఐక్య లక్ష్యాల సమ్మేళన శక్తికి అద్భుత ఫలితంగా చావునే అధిగమించ వచ్చు.

ఆ భవిష్యత్ మానవులకు ఆనందమయ శుభాకాంక్షలు!

మహిళల పట్ల దృక్పథంలో హఠాత్తుగా వచ్చిన మార్పు రష్యన్ సమాజ నీతి పతనానికి ఒక సూచిక....

మహా నిరాడంబరత్వం, భేషజమంటే అసహ్యం, ఉన్నత ఆత్మ గౌరవం,

అదుద్దైన మనసు, అనంత ప్రేమ భరితమైన లోతయిన హృదయం, స్వప్న సాఫల్యం కోసం త్యాగ సంసిద్ధత— ఇవీ రష్యన్ మహిళ లక్షణాలు. మన గత కాలపు దృశ్య నిపుణులు, అక్షర నిర్మాతలు ఈ మహిళను మహాద్భుతంగా చిత్రించారు........

మరి ఇవాళ చూస్తే, ఇటువంటి స్త్రీ నిజానికి మన నేలకు చెందిన ఉత్తమ మేధ, జీవితం నుంచి హఠాత్తుగా అదృశ్యమైపోయింది. ఆమె స్థానంలో "చిల్లర స్త్రీలు" ప్రవేశించారు వారిలో నిండుగా లైంగిక జీవితాకాంక్ష, అన్ని రకాల లైంగిక అనాచారాల విస్తృతీ ఉంటాయని చెపుతున్నారు. ఈ స్త్రీలను తమంత తాము నగ్నంగా కనబడేవైపు నెడుతున్నారు. తమంత తాము పతనమైపోయేవైపు నెడుతున్నారు.

లైంగిక అత్యాచారం ఒక రకమైన అలవాటుగా మారిపోయింది. ఒకడు ఒక స్త్రీని చెరబట్టాడనీ, మరొకడు ముగ్గురు స్త్రీలను చెరబట్టాడనీ, ఇంకా ఒకడు తన ముసలి అత్తను చెరిచాడని, మరొకడు కూతురిని చెరిచాడనీ రాస్తున్నారు. మన రచయితలకు వేగంగా అంటుకున్న క్షుద్రత్వం వాళ్ళను ఎంత దూరం తీసుకుపోయిందంటే అన్ని వయసుల, అన్నిరకాల వావివరుసల స్త్రీలను చెరచడం గురించే వాళ్ళు రాస్తున్నారు. ఇక వైవిధ్యాన్ని సాధించేందుకుగాను మన రచయితలు తమ దృష్టిని చేపలవైపు, కోకులవైపు, కప్పలవైపు తిప్పవలసి ఉన్నది. ప్రజల అభిరుచులకు తలఒగ్గి పిల్లుల జీవితాన్ని నిశితంగా అధ్యయనంచేసిన సాహిత్య బృందం ఒకటి ఇప్పటికే ఏర్పడింది.

ఇట్లా మన సాహిత్యం మొత్తం బూతు రచనలు ఆక్రమించాయి. మన సాహిత్యకారుల మనసులు అశ్లీలతతో నిండిపోయాయి. ఆ మనసులు ఎంత త్వరితంగా ఉబ్బిపోయాయంటే, ఎంత వికృత రూపాలు ధరించాయంటే, సంయమనంగల మనుషులందరూ మ్రాన్పడిపోయారు. బాలిక, భార్య, తల్లి- మొదలైన రష్యన్ స్త్రీలందరిమీద ఇంత క్రమం తప్పకుండా విసరబడుతున్న మురుగుపట్ల విరసన ప్రకటించేందుకు కూడ శక్తులుడిగినట్టయిపోయారు....

స్త్రీ వ్యతిరేకత అనేది క్షుద్రత్వంలో ఒక భాగమే. ఒకప్పుడు తన పోరాటంలో సహచరి అయిన స్త్రీ ఈ క్షుద్రవిజేతకు ఇవాళ అడ్డంకిగా కనబడుతున్నది. ఎందు

కంటే పోరాట క్రమంలో స్త్రీ స్వయంగా తన నెచ్చెలీ, మిత్రుడూ అయిన పురుషుడినే కొన్ని కోర్కెలు కోరే స్థితికి ఎదిగింది. ఆ కోర్కెలు దురాశలని పురుషుడు అనుకుంటున్నాడు.

స్త్రీ పట్ల ఈ దృక్పథాన్ని చూసి క్షుద్రులు సంతోషపడి, దాన్ని ప్రోత్సహిస్తారు. ఎందుకంటే అది క్షుద్రుడి శిథిల శరీరానికి మళ్ళీ శక్తినిస్తుంది. పాత శత్రువును ఉంపుడుగత్తెగా మార్చుకోవడంలో సరదా ఉంటుంది గదా.

రక్తహీనత పొందిన వాళ్ళ మనసుల హీనత్వంలోంచి పెల్లుబికిన జలగల్లాంటి వాంఛలు, లైంగిక అనాచారాల దృశ్యాలతో సృజనాత్మకతను విషమయం చేస్తాయి. అవినీతికరమైన క్షుద్రహృదయపు దుర్మార్గ ఫలితాలతో ఇష్టపూర్తిగాగాని, అయిష్టంగా కాని కర్తీ అయిన రచయితలు వాటినే కాగితాలమీదికి ఎక్కించి తమను తాము విష పూరితం చేసుకుంటారు. చుట్టూ ఉన్నవాళ్ళను విషమయం చేస్తారు....

ఇప్పుడు మన విద్యావంతులు మరొక పాత మిత్రుడిపట్ల, రైతుపట్ల ఎట్లా ప్రవర్తిస్తున్నారో, మన ప్రస్తుతకాలపు సాహిత్యం రైతును ఎట్లా పరిగణిస్తోందో చూద్దాం.

రైతును మేల్కొల్పడానికి యాభై ఏళ్ళపాటు కృషి జరిగింది. మేల్కొన్న రైతు మానసిక స్థితి ఇవాళ ఎట్లా ఉంది?

అతి తక్కువ కాలం గడిచిందనీ, మనకు ఎంతో కాలంగా తెలిసిన నాయకుడిలో వచ్చిన మార్పుల్ని గుర్తించే అవకాశం లేదనీ అనవచ్చు. కాని ఈ వాదన నిలవదు. పాత సాహిత్యం ఎప్పుడూ కాలంతో సమానంగా నడవగలిగింది. కొత్త సాహిత్యానికి కూడా రైతును పరిశీలించేందుకు తగిన సమయం ఉండింది. నిజంగానే ఈ విషయంమీద చెప్పగలిగి ఉండింది.

ఈ ప్రశ్నకు కచ్చితమైన జవాబులైతే లేవుగాని, కొందరు యువ రచయితలు ఇప్పటికే చేసివున్న సూచనల ప్రకారం ఆ రచయితలు దేశానికి అనుకూలమైన, రైతుకు ప్రశంసనీయమైన విషయాలను చూడడంలేదు, అనుభవించడంలేదు.

ఇవాళ్టి పత్రికలలోను, సాహిత్య గ్రంథాలలోను చిత్రితమవుతున్న రైతు రూపం ఏమయినప్పటికీ, అతను రెషెట్నికోవ్ (పందొమ్మిదో శతాబ్దపు ప్రజాస్వామిక రచయిత) చిత్రించినటువంటి పాత రైతే అజ్ఞానంలో, మొరటుదనంలో జీవించేవాడే.

రైతు హృదయంలో కొత్త లక్షణాలను గనుక గుర్తించేటట్టయితే, ఆ లక్షణాలేమంటే హత్యాకాండలు, గృహదహనాలు, దోపిడీలు. అతను విపరీతంగా తాగుతాడు....

ఈ రష్యన్ సాహిత్యపు పాత నాయకుడిపట్ల సాధారణ వైఖరిని చూస్తుంటే అది 80వ దశకపు సాహిత్యంలో పరిచితమైన విషాదాన్ని, నిస్పృహను ప్రతిఫలిస్తోంది. అటువంటి నిట్టూర్పులే వెలువడుతున్నాయి. "మన దేశం కోసం మనం పని చేస్తున్నాం. కాని ప్రతిఫలమేమిటి? కేవలం కృతఘ్నత!"

ఇటువంటి నిట్టూర్పులతోపాటు నిందలూ దుర్భాషలూ కూడ ఉన్నాయి. 1892లో ఒక రాజకీయ ప్రవాసుల బృందంలో వినబడిన మాట నాకిప్పటికీ గుర్తొస్తుంటుంది. వోల్గాప్రాంతంలో కలరావ్యాపించి కల్లోలంరేగినప్పుడు ఆ మాటవినిపించింది.

"మన రైతులకు ఇంకా కొరడా, బయొనెట్ కావలసిందేనండీ" అన్నాడొక మాజీ రాజకీయ ప్రవాసి మిగిలిన విషయాల్లో ఆయన చాల మంచివాడే.

అతని సహచరులెవరూ కూడ అభ్యంతరం చెప్పలేదు.

ఇవాళ కూడ "సంస్కృతీపరులు" అటువంటి నిశ్శబ్దాన్నే పాటిస్తుండగా, ప్రజలను "మూర్ఖులు" అనీ, "మేల్కొన్న పశువులు" అనీ పిలుస్తున్నారు. ప్రొఫెసర్ పి. ఎన్. మిల్యుకోవ్ ప్రపంచ ప్రజలను ఐక్యం చేసే మహోన్నత ఆదర్శ పతాకాన్ని "ఎర్ర అలుగుడ్డ" అనీ, తన భావజాల ప్రత్యర్థులను "గాడిదలు" అనీ పిలుస్తున్నాడు.

"గాడిదలు, ఆడగుర్రాలు, వెధవలు, మూర్ఖులు....". సంస్కృతీ, శెభాష్! రష్యన్ సమాజ సంస్కృతీ నాయకులారా శెభాష్ !

"శత్రువు కలానికి స్వేచ్ఛ"ను నిజాయితీగా అందించగల యోధులు ఇప్పుడీ "సాంస్కృతిక విలువల" పరిరక్షకుల గుంపులో లేరు.

రష్యన్ సంస్కృతీ పరుడి నమూనాకు ఇది పతనం కాదూ ?

మన యువరచయితలు అతి జాగ్రత్తగా రూపొందిస్తున్న రచనలలో కార్మికుడి చిత్రణ రైతు చిత్రణ కంటె అన్యాయంగా ఉంటున్నది. కార్మికుడు మరింత మూర్ఖంగా, మొండిగా ఉంటున్నాడు. అదే సమయంలో అతను సోషలిజం గురించి మాట్లాడతాడు....

ఈ రచయితలు తమనిరాసక్తతతో సోషలిజం గురించి క్షుద్రుల నిర్వచనాన్నే సొంతం చేసుకున్నారు. సోషలిజం అనేది కేవలం ఆకలికి సంబంధించిన ఏదో తప్పుడు సిద్ధాంతమనీ, ఆత్మ ఆకాంక్షలను అది పూర్తిగా నిరాకరిస్తుందనీ ఈ సిద్ధాంతం. కనుక సోషలిజం వైపు మొగ్గుచూపడమంటే ఒక రకమైన ఉన్మాదమని వాళ్ళనుకుంటారు.

కార్మికుడు ఎల్లవేళలా, అన్నిచోట్లా క్షుద్రులకు అనంగీకారంగానే ఉంటాడనే వాస్తవాన్ని అర్థం చేసుకోవడం సులభమే. క్షుద్రమోదాంత రచనలకు కార్మికుడు మరీ విషాదవ్యక్తి అయిపోతాడు. కార్మికుడు ఇవాళ్టి రచయితకు సులభంగా ఉండస ఒటి పెద్ద నాయకుడయిపోతాడు.

సాహిత్యంలో తన ప్రతిపత్తి శిథిలమైపోయిన రైతు, మన రచనలను గౌరవించడం కూడ మానేశాడు. అందుకు కారణాలివి : తన పైవాళ్ళు అంతకంతకూ ఎక్కువగా తమకు రాజకీయాధికారం కావాలని కోరుతుండడం చూసి, తాను వాళ్ళకు మద్దతు ప్రకటిస్తే, అధికారవర్గం లొంగి పోతుందని రైతు గుర్తించాడు. తన శక్తులన్నిటినీ క్రియాశీల క్షుద్రులకు అందించాలని గుర్తించాడు. అందుకు ప్రతిగా వాళ్ళు తమ సౌభాగ్యాన్ని నిర్మించుకున్న వెంటనే తగిన ప్రతిఫలం చెల్లిస్తారనుకున్నాడు. కాని ఆ మంచి మనసుల గొప్పింటివాళ్ళు ఎప్పుడో ప్రతిఫలం ఇస్తారని వేచి చూసే బదులు, ఈ సంస్కృతీ హీనుడైన కృతఘ్నుడు భయం గొలిపే కోరిక కోరాడు. "భూమి సమస్తాన్నీ" తనకు అప్పజెప్పమన్నాడు. కార్మికులతో పొత్తు కలిపి సోషలిజం గురించి కూడ మాట్లాడడం మొదలుపెట్టాడు. అందువల్లనే అతని మీద నిందలు మొదలయ్యాయి.

విద్యావంతులకూ, ప్రజలకూ మధ్య ఈ అఘాతం ఎక్కువకాలం నిలవదు. "రైతు లేకుండా జీవించటం అసాధ్యం." దేశాన్ని కాపాడాలన్నా, మరింత అభివృద్ధి చేయాలన్నా మన "సంస్కృతీ పరులు" తమ గాయపడిన భావాలను ప్రకటించడం మానివేయాలి. తన కోర్కెలపట్ల ప్రజలకు గౌరవం లేదనే తన ఉన్మాదపూరితమైన అత్యాశాభరితమైన ఫిర్యాదును మానివేయాలి. వాస్తవమేమంటే, విప్లవంవల్ల కదిలిపోయిన, ఊగిపోయిన రాజ్యాంగయంత్రపు ఖాళీలను ఈ విద్యావంతులు హడావిడిగా నింపుతున్నారు. అకాలంగా అలసిపోయి, నిరుత్సాహపడి, వాళ్ళు కేవలం సుఖమైన విశ్రాంతి కోసమే వెతుకుతున్నారు గాని వాళ్ళ చర్యలు దేశంపట్ల ప్రేమనేమీ ప్రదర్శించడం లేదు. వాళ్ళ మాటల్లో విశ్వాసమేమీ లేదు.

రష్యాకే ప్రత్యేకమైన మరొక పరిణామాన్ని కూడ గుర్తించాలి. "అనవసరమైన", "బాధ్యతారహితమైన", "నిష్ఫలమైన," "అవాంఛనీయమైన" వ్యక్తులు విపరీతంగా పెరిగిపోతున్నారు. ఈ కనబడే వాస్తవపు కారణాలు కూడ కనబడుతున్నాయి. ఈ పరిణామం సాంఘికంగా ప్రమాదకరమైనది. ఎందుకంటే ఆశయాలు, ఆశలు, కోర్కెలు ఏమీ లేని ప్రజలు వీళ్ళు. ఈ గుంపును మన శత్రువులు నైపుణ్యంతో ఉపయోగించుకోగలరు. మన సంస్కృతీ పరమైన సమాజంలో ఇటువంటి నమూనా ఉన్నదని సాహిత్యం ప్రస్తావిస్తే అందులో నిస్పృహా కారణమైనదేమీ లేదు. ప్రజల శక్తుల నుంచే సంస్కృతి రూపొందుతుంది. ప్రజలలోనుంచి

"బాధ్యతా రహితమైన" వాళ్ళు, "అవాంఛనీయమైన" వాళ్ళు రూపొందుతున్నారంటే అది భయహేతువే. అంటే ఆ నేలమీద ఉద్భవిస్తున్న సంస్కృతి వట్టిపోతున్నదన్న మాట. వేరేమాటల్లో చెప్పాలంటే ప్రజల సాంస్కృతిక శక్తులు ఉడిగిపోతున్నాయన్నమాట. ఈ పరిణామాన్ని గుర్తించవలసి ఉంది. ఎదిరించవలసి ఉంది. సాహిత్యపు కర్తవ్యమేమంటే అటువంటి మనుషులను పూర్తిగా తొలగించనైనా తొలగించాలి. లేదా, వారిని నిటారుగా నిలబడేట్టు చేసి, వారిని క్రియాశీల జీవితంలోకి తీసుకురావాలి.

అయితే ఒక ఇబ్బంది వచ్చింది. మన రచయితలు క్షుద్రుల సేవకు అంకితమయిన తర్వాత, వారి హృదయాలు కుళ్ళిపోతున్నాయని గుర్తించడం ప్రారంభించారు. క్షుద్రుల పథకాలు ఎంత సంకుచితమైనవో, వక్రమైనవో గుర్తించడం ప్రారంభించారు. వాళ్ళు వ్యక్తి సృజనాత్మక శక్తులను వినియోగించుకోగలంత, నిర్దేశించగలంత ఉన్నత భావాలను ఉత్పత్తి చేయలేరని గుర్తించడం ప్రారంభించారు.

మహావృక్షం ఊబినేలలో పెరగజాలదు. ఊబినేలలో చిన్న చిన్న మొక్కలు పెరగవలసిందే. అదే విధంగా ప్రస్తుతం పతనమైపోయిన వాతావరణంలో గొప్ప ప్రతిభ కనబడడం గానీ, వర్ధిల్లడం గానీ జరగదు. జీవితపు దైనందిన విషయాల కన్న పైకి వికసించి, దేశంలోనూ, ప్రపంచంలోనూ జరుగుతున్న పరిణామాలను విహంగావలోకనం చేయగల ప్రతిభ, భవిష్యత్ మార్గాన్ని కాంతిమంతం చేయగల ప్రతిభ, మనవంటి సామాన్యులకు ఎగిరే రెక్కలందించే మహాలక్ష్యాలను చూపగల ప్రతిభ రూపొందదు.

క్షుద్రవాదం ఒక బదనిక. దానికి ఉన్న పునరుత్పత్తి శక్తి అనంతమైనది. దాని దారిలో అడ్డువచ్చిన ప్రతిదాన్నీ అది మింగేస్తుంది. అది ఎంతమంది కవులను కొల్లగొట్టిందో చూడండి!

క్షుద్రవాదం ప్రపంచపు విషం. పండు లోలోపలి నుంచి తినేసే పురుగులా, అది లోలోపలినుంచి వ్యక్తిత్వాన్ని తినేస్తుంది. అది సౌందర్యపు శక్తివంతమైన ధ్వనులనూ, విస్తృత జీవన సత్యాన్నీ ముంచెయ్యగల స్థాయిలో ఆగకుండా గరగరలాడే కలుపు చేను. మేధావిత్వాన్నీ, ప్రేమనూ, కవిత్వాన్నీ, ఆలోచననూ, కళనూ, శాస్త్రాన్నీ అన్నిటినీ తన అసహ్యకరమైన లోతుల్లోకి లాగగల అడుగులేని ఊబి అది.

మానవజాతి మహత్తర దేహంలో ఈ రోగిష్టి భాగం వ్యక్తిత్వాన్ని పూర్తిగా ధ్వంసం చేసి వేసింది. విధ్వంసక వ్యక్తి వాదంతో అది దేహాన్ని విషపూరితం చేసింది. మనిషిని ప్రమాదకరమైన రౌడీగా, ఆంతరంగిక సంబద్ధత లేని జీవిగా మార్చివేసింది. మనసును చిన్నాభిన్నం చేసింది. నరాలను సాగదీసింది. జీవితంలోని

ప్రతి శబ్దానికి చెవిటివాణ్ణి చేసింది. తన సహజ ప్రవృత్తుల కోర్కెలనూ, రోగిష్టి ఆవేశాల దుర్మార్గపు గుసగుసలనూ తప్ప మరేమీ వినకుండా చేసింది.

ఈ క్షుద్రవాదం వల్లనే మనం ప్రొమిథియస్ నుంచి గూండా వరకు దిగజారాం.

మరి గూండా క్షుద్రుడి వారసుడే. క్షుద్రుడి నుంచి జన్మించిన వాడే. చరిత్ర ఆదేశమేమంటే ఈ గూండా పితృహంతకుడవుతాడని. నిజంగానే గూండా క్షుద్రుణ్ణి చంపేస్తాడు.

ఇదంతా శత్రుకుటుంబంలో జరుగుతోంది గనుకమనం ఈనాటకాన్ని నవ్వుతూ, ఆనందిస్తూ పర్యవేక్షించవచ్చు. కాని విలువైన, ప్రతిభావంతులైన వాళ్ళెందరో ఈ తగాదాలోకి ఆకర్షితులవుతున్నారంటే మనం విచారించాలి. ఉత్తములెందరో నశించిపోవడం విషాదకరం. త్వరితంగా విచ్ఛిన్నమై పోతున్న వాతావరణంలోంచి వెలువడుతున్న కుళ్ళు విషానికి వాళ్ళు బలయిపోతున్నారు.

మనం సమగ్రమైన వ్యక్తులం గనుక, మనకు తగినట్టుగానే, మిగిలినవాళ్ళు కూడ ఆరోగ్యంగా, ఆనందంగా, దృఢంగా ఉండాలని మనం కోరుకుంటాం. వాళ్ళు సంఘటిత పడాలనీ, అభివృద్ధి చెందాలనీ, అలా అయితే ప్రజల మానసిక శక్తులు ప్రపంచ జీవనాన్ని పునశ్శక్తివంతం చేయగలవనీ, మానవజాతి సత్య, సౌందర్య ఉత్సవాన్ని త్వరితం చేయగలవనీ మనం భావిస్తాం.

ప్రపంచ సంస్కృతీ చరిత్ర నిండయిన స్వరాలతో, ఉత్తమ పద్యాలతో రాయబడుతుందని నమ్మేవాళ్ళం మనం. గతకాలంలో సాధించిన విజయాలకు స్త్రీ పురుషులు నివాళి అర్పించే రోజు ఒకటి వస్తుందని నమ్ముతాం. విశ్వంలో మన భూగోళం మృత్యువు మీద జీవితం విజయం సాధించిన భూమిగా నిలబడుతుంది. అక్కడ నిజంగా కళకోసమే జీవించే స్వేచ్ఛా కళ, మహాద్భుతాలు సృష్టించే కళ ఆవిర్భవిస్తుంది.

మానవజాతి జీవితమంతా సృజనాత్మక అన్వేషణే. నిర్జీవపదార్థం ప్రతిఘటిస్తూంటే గెలుపుకోసం సాగించిన ప్రయత్నమే. ఆ పదార్థ రహస్యాలన్నిటినీ తెలుసుకోవాలనే ఆకాంక్షే. పదార్థ శక్తుల మానవ లక్ష్యాలకు సేవచేసేలా, ఆనందం కొని తెచ్చేలా చేసే ప్రయత్నమే. ఆ గమ్యంవైపు కవాతుచేస్తూ ప్రపంచంలో ఉన్న మానసిక, శారీరక, సజీవ, చైతన్యయుత, క్రియాశీల శక్తుల మొత్తం సమ్మేళనాన్ని నిర్విరామంగా, శ్రద్ధగా అభివృద్ధి చేయడం ద్వారా ఆ లక్ష్య సాధనను హామీ ఇవ్వవలసి ఉంది. ప్రజల దగ్గర ఉన్న సకల శక్తి వనరులనూ అభివృద్ధి చేయడం, సంఘటితం చేయడం ప్రస్తుత చారిత్రక కర్తవ్యం. తద్వారా ఆ శక్తులను క్రియాశీల సాధనంగా మార్చాలి. వర్గ, బృంద, పార్టీ సమూహాల్ని రూపొందించాలి. —(అయిపోయింది)

స్వీకారం

* యెక్కడైనా యిక్కడే - ప్రీతీష్ నంది కవిత్వం - కవిత్వం ప్రచురణలు, 16 పేజీలు, 1/8 డెమ్మీ, రెండు రూపాయలు.

* 19 కవితలు - గాలి నాసరరెడ్డి - కవిత్వం ప్రచురణలు, 24 పేజీలు, 1/8 క్రౌన్, రెండు రూపాయలు.

* ఒఖడే - స్మైల్ కవితలు కొన్ని - కవిత్వం ప్రచురణలు, 16 పేజీలు, రెండు రూపాయలు. పై మూడు పుస్తకాలు ప్రతులకు : త్రిపురనేని శ్రీనివాస్, 40-5/6-10, ఆంగ్రేజీల్ పేట, బందరు రోడ్డు, విజయవాడ 520 010.

* జాతి మొత్తం బానిస అయినపుడు - దక్షిణాఫ్రికా పోరాట కవిత, ప్రజా రచయితల సమాఖ్య, (జంట నగరాలు) ప్రచురణ, 22 పేజీలు, 1/8 డెమ్మీ, మూడు రూపాయలు. ప్రతులకు : ప్రజారచన, 60/ఎ, ఓల్డ్ ఎం. ఎల్. ఎ. క్వార్టర్స్, హైదరాబాదు.

* తెలుగు నవల - వ్యాపారధోరణి - కాసుల ప్రతాప్‌రెడ్డి, మానస ప్రచురణలు, 102 పేజీలు, 1/8 డెమ్మీ, 15 రూపాయలు. ప్రతులకు : బాలకృష్ణభారతి, 12-13-785, తార్నాకా, సికింద్రాబాద్-500 017.

* రారా లేఖలు - రారా స్మారక సమితి, ప్రొద్దుటూరు ప్రచురణ, 248+ xxx పేజీలు, 1/8 డెమ్మీ, 50 రూపాయలు. ప్రతులకు ; ఆర్. అశోకరెడ్డి హనుమాన్ నగర్, సూపర్ బజార్ రోడ్డు, ప్రొద్దుటూరు-516 360.

[1909లో మాగ్జిం గోర్కీ రాసిన 'డిసింటిగ్రేషన్ ఆఫ్ పర్సనాలిటీ' అనే ఈ వ్యాసానికి స్వేచ్ఛానువాదాన్ని 1990 మార్చి సంచికలో ప్రారంభించి నాలుగు సంచికలలో వేశాం. జూన్/జులై సంచికలో ఇంకా ఉంది అని వేసే బదులు పొరపాటున 'అయిపోయింది' అని అచ్చయిందని గుర్తించగలరు.

అను : జగన్, వేణు]

ఉత్తరం :

'ఒక తండ్రి'

ఫిబ్రవరి సృజనలో గోపి రాసిన 'ఒక తండ్రి' గొప్ప కథ. మిగతా పాఠకుల ప్రతిస్పందన నాకు తెలియదు గాని నిజానికి ఈ మధ్యకాలంలో నన్ను కదిలించిన కథ ఇదే. కామ్రేడ్ రమణారెడ్డి విప్లవంలోకి అడుగుపెట్టిన నాటి నుండి అమరు డయ్యేవరకు అతని స్మృతులే కాదు, అతని కుటుంబం, మన గాజులపల్లి కుటుంబాలు, మంథని తాలూకా అంతా ఒకసారి కళ్ళముందు నిలిపింది కథ నిజానికి మానవ సంబంధాలు, ప్రేమ, విలువలు, విప్లవకర కుటుంబాలలో ఎలా ఉన్నాయో ఈ కథ తెలియజేస్తుంది. వరంగల్ మహాసభలో అమరుల తల్లిదండ్రులంతా మాట్లాడిన మాటలు స్వయంగా నేను వినకపోయినా చెప్పిన దాన్ని బట్టి ఈ కథకు జోడించి ఊహిస్తుంటే మనం ప్రచారం చేస్తున్న రాజకీయాలు ఎంత శక్తివంతంగా మన తల్లిదండ్రులను కదిలిస్తున్నాయో అర్థం అవుతుంది వాళ్ళు కూడ మన కృషిలో పోరాటంలో పాలు పంచుకోవడానికి మానసికంగా సిద్ధపడుతుండడంవల్ల ఈ స్థితే గ్రామాల్లో మిగతా వారిని పోరాటంవైపు నిలిచేలా సిద్ధపరుస్తున్నదనడంలో సందేహం లేదు....

- నేస్తం

---

* ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిస్థితి - ప్రజా నివేదిక - 1990 గాంధీ విజ్ఞాన పరిషత్ ప్రచురణ, 290+viii పేజీలు, 1/4 డెమ్మీ, 195 రూపాయలు. ప్రతులకు : ఎకాడమీ ఆఫ్ ఆఫ్ గాంధియన్ స్టడీస్, 2-2-1133/5/5, న్యూ నల్లకుంట, హైదరాబాద్-500 044.

SRJANA **Telugu Monthly** **August 1990**

Regd No. with the Registrar of Newspapers for India 109 3/67

విప్లవ సాహిత్యాభిమానులకు విజ్ఞప్తి

విప్లవ సాహిత్యం కోసం పీస్ బుక్ సెంటర్‌కు విచ్చేయండి

ఆట, మాట, పాట బంద్ టెర్రరిస్టు చట్టాన్ని ప్రభుత్వం అమలు చేసిన 1985-89 మధ్యకాలంలో విప్లవ విద్యార్థి యువజన బహిరంగ కార్యకలాపాలు, జననాట్యమండలి సాంస్కృతిక సభలతోపాటు హైద్రాబాద్‌లోని పీస్ బుక్ సెంటర్ కూడ మూతపడవలసి వచ్చింది. విప్లవ సాహిత్యం అమ్మటం, కొనటం, చదవడం అప్రకటితంగా నిషేధింపబడిన కాలమది. చూపు మీద, చదువు మీద ఐదేళ్ళ నిర్బంధాన్ని భరించిన క్రమంలోనే ప్రజలు స్వేచ్ఛను సాధించుకొనే పద్ధతులు నేర్చుకున్నారు. తెలిసిన పద్ధతులకు పదునుపెట్టారు. ఫలితంగా క్రమంగా సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు రాష్ట్రమంతటా సందడి చేసినట్లుగానే మూతబడిన పీస్ బుక్ సెంటర్ మళ్ళీ తెరచుకున్నది.

ఇప్పుడు జననాట్యమండలి పాటలు, క్రాంతి, రాడికల్ మార్చ్ వంటి పత్రికలు, విప్లవ సాహిత్యం కావలసినవాళ్ళు నగరం నడిబొడ్డున చార్మినార్ చౌరస్తాకు వస్తే చాలు- విప్లవ పథ దిక్సూచి అయిన విప్లవ సాహిత్యం లభిస్తుంది-
-విప్లవ సాహిత్యాభిమానులకు ఇదే మా సుస్వాగతం.

పీస్ బుక్ సెంటర్
1-1-79/9, భాగ్యనగర్ కాంప్లెక్స్,
ఆర్. టి. సి. క్రాస్ రోడ్స్,
హైదరాబాద్-500 020

Rs. 4/-

SRJANA
Flat 11, Block 2,
MIG II, Baghlingampalli,
Hyderabad-500 020.